19-5Pg1exHMNWJQE.qxd:19-5Pg1exHMNWJQE.qxd 01/01/01 8:10 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 107 పేజీలు: 12 వెల: 6.50

భారత్ మామిడి పండ్లను తిరస్కరించిన అమెరికా

లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హతం 9లో

## ఉచిత బస్సు రాష్ట్రమంతా వర్తింపు!




### ప్రభుత్వానికి యేటా రూ. 3,182 కోట్ల భారం

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్ సిక్స్ ఎన్నికల హామీల్లో ఒకటైన కూటమి ప్రభుత్వ మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకం అమలు తేదీ ఖరారైంది. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాలో ఉచిత బస్సు అమలుకు సిద్ధం కావడం ఇదే ప్రథమం కావొచ్చు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్లు నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకంపై ఆయన స్పష్టతను ఇచ్చారు. దీని వలన ఆర్థిక భారంపడినా, ఆర్టీసీని నష్టాలకు గురిచేయని రీతిలో చర్యలు తీసుకోవాలన్నది సిఎం చంద్రబాబు ఆలోచన ప్రస్తుతం బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో 69 శాతం ఉండగా, అది 94 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటకల మాదిరిగానే రాష్ట్రమంతా వర్తించేలా మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేసే అవకాశం ఉందని తెలుస్తోంది. జిల్లాలకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని భావించినా ప్రభుత్వం ఆ ఉద్దేశం మార్చుకుంటుందంటున్నారు.

ఈ క్రమంలో ఈ పథకం వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.3,182 కోట్ల మేర భారం పడనుందని అంచనా వేస్తున్నట్లు ఎపి రోడ్డు రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు. సిఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకం ఉంటుందని వివరించారు. పథకాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకుని వెళ్లగలమన్న దీమా చంద్రబాబుది. మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా నిత్యం మరో 10.84 లక్షలకు పెరుగుతుందని ప్రాథమికంగా >>2

## ప్రజాభిప్రాయం మేరకే పథకాల అమలు

● 10 అంశాలపై ఐవిఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ ● వచ్చే నెలనుంచే 'తల్లికి వందనం' కార్యక్రమం ● పలు సర్వేల నుంచి కూడా సమాచార సేకరణ ● అవినీతి రహితంగా కార్యాచరణ: సిఎం చంద్రబాబు



**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి పథకం విషయంలో లబ్ధిదారులకు నేరుగా ఫోన్ చేసి వారికి విషయాన్ని తెలిపి, వారి సూచనలు తీసుకుంటున్నామని వివరించారు. 'ఎక్స్'వేదికగా ఆయన రాష్ట్రంలో 10 అంశాలపై ఐవిఆర్‌ఎస్‌తో ద్వారా ప్రజల నుంచి తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామన్నారు. అందువలనే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను కచ్చితంగా అమలు చేయగలుగుతున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు విషయంలోను ఐవిఆర్‌ఎస్ ద్వారా అనేకవిషయాలపై ఒక అవగాహనకు వస్తున్నామన్నారచు. ఐవిఆర్‌ఎస్ పాటు వివిధ రూపాల్లో నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాల సేకరణ తీసుకుంటున్నామన్నారు. పింఛన్ల పంపిణీ, దీపం పథకంఅమలు, అన్న క్యాంటీన్ నిర్వహణ, ఇసుక సరఫరా, ఆసుపత్రులు, దేవాలయాల్లో సేవలపై వివిధ రూపాల్లో సమాచారం సేకరణ..'ప్రజలే ముందు' (పీపుల్‌ఫస్ట్) అనే విధానంలో ప్రజల అభిప్రాయాలు, అంచనాల మేరకు ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి, ప్రతి విభాగం పనిచేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారుల నుంచి నేరుగా సేకరించిన సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ సేవలపై నేరుగా లబ్ధిదారులు ఏమంటున్నారు అనే అంశంపై ఐవిఆర్‌ఎస్‌తో పాటు వివిధ రూపాల్లో సర్వేలు నిర్వహించారు. ఈ సర్వే రిపోర్టుల ఆధారంగా శాఖల వారీగా అధికారులత చర్చిస్తున్నామన్నారు. వారి ద్వారా నివేదికలను తీసుకుని అమలు చేస్తున్నామన్నారు..ఎవరు ఏం చెప్పినా లబ్ధిదారుల మాటే ఫైనల్ అని, ప్రజలు క్షేత్ర స్థాయి నుంచి ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌నే ప్రామాణికంగా తీసుకుంటామని అధికారులకు సిఎం స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి వరకు విధానాల అమల్లో ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం అవ్వడంపై సిఎం సంతోషంగా ఉందన్నారు. కొన్ని శాఖల్లో 11నెలల కాలంలో అనుకున్న స్థాయిలో మార్పు రాకపోవడంపై సిఎం లోతుగా సమీక్షించారు. కారణాలు తెలుసుకుని దానికి అనుగుణంగా మార్పులు తేవాలని అధికారులకు సూచనలు చేసామన్నారు. ప్రభుత్వ సేవల్లో వేగం, నాణ్యత పెరగాలని, పథకాల పంపిణీలో 1 శాతంకూడా అవినీతి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల సంతృప్తి అంశంలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని సూచించారు. పథకాల లబ్ధిదారుల నుంచి నేరుగా సేకరించిన సమాచారం ఆధారంగా ఆయా శాఖల పనితీరుపై అధికారులతో సీఎం చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ సిబ్బంది, ఉద్యోగులు, అధికారులపై వచ్చిన ఫీడ్ బ్యాక్‌పై అధికారులు చంద్రబాబుకు నివేదిక అందించారు.

పింఛన్ల పంపిణీ, దీపం పథకం అమలు, అన్న క్యాంటీన్ నిర్వహణ, ఇసుక సరఫరా వంటి పథకాలు, పాలసీలపై వివిధ రూపాల్లో సేకరించిన సమాచారంపైనా చంద్రబాబు ఆరా తీశారు. ప్రభుత్వానికి సంబంధించిన ఏడు శాఖల్లో పథకాలు, కార్యక్రమాలపై సేకరించిన సర్వే ఫలితాలపై అధికారులు ముఖ్యమంత్రికి ప్రజెంటే >>2

## పది రోజుల్లో కేరళకు 'నైరుతి'

**విజయవాడ,మే 18,ప్రభాతవార్త ప్రతినిధి:** నైరుతి ఋతుపవనాలు మరో పది రోజుల్లో కేరళను తాకనున్నాయని వాతావరణ విభాగం (ఎఐండి) వెల్లడించింది. వాస్తవానికి ఇవి ఈ నెల 22న అండమాన్‌ను, 26న శ్రీలంకను తాకొచ్చని భావించగా.. అందుకు పది రోజుల ముందుగానే శ్రీలంకలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం శ్రీలంక, అండమాన్‌లో విస్తరించాయి. తాజాగా ఈ నెల 27 నాటికి కేరళను తాకే అవకాశం కనిపిస్తోందని ఐఎండి తెలిపింది. రాబోయే రోజుల్లో మరింత వేగంగా కదలడానికి అనుకూల పరిస్థితులున్నాయని చెప్పింది. మరో వైపు పశ్చిమ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంకొనసాగుతోంది. దీని ప్రభావంతో రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రుల కమిటీ

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వచ్చేనెల 21న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వంనియమించింది. కమిటీలో మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కందుల దుర్గేష్ ఉన్నారు. కన్వీనర్‌గా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు వ్యవహరిస్తారని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## మాజీ ఎంపి నందిగం సురేష్ అరెస్ట్

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీకి చెందిన మాజీ ఎంపి నందిగం సురేష్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. టిడిపి కార్యకర్త ఇసకపల్లి రాజుపై దాడి కేసులో సురేశ్ అరెస్టు అయినట్లు వెల్లడైంది. నందిగం సురేశ్ ను ప్రస్తుతం తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజధాని పరిధిలోని ఉద్దండ రాయునిపాలెంలో టిడిపి నేత రాజుపై వైఎస్సార్సీకి చెందిన మాజీ ఎంపి నందిగం సురేశ్ దాడికి పాల్పడ్డారన్నది అభియోగం. శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసు >>2

## చికిత్స కోసం అమెరికాకు కొడాలి నాని!

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** గుండె సమస్యతో భాధపడుతూ ముంబయి లోని ఓ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్సీ నేత,మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వర రావు(నాని) హైదరాబాద్ చేరుకున్నారు. మెరుగైన చికిత్స కోసం అమెరికాకు వెళ్లే యోచనలో నాని ఉన్నట్లు సమా >>2

## 'సీమ' రైల్వే ప్రాజెక్టులకు రూ. 13,878 కోట్లు



కొత్త రైలు మార్గాల నిర్మాణానికి రూ.8,358.12 కోట్లు

డబ్లింగ్ రైలు మార్గాలకు రూ.3,344.77 కోట్లు

రైల్వే విద్యుదీకరణ పనులకు రూ.2,113.82 కోట్లు

ప్రాజెక్టు నిర్మాణాల సర్వేల నిర్వహణ, భూసేకరణ తుది సర్వేలకు రూ.61.31 కోట్లు

**గుంతకల్లు రైల్వే,మే 18,ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాయలసీమ జిల్లాలలో కొత్తగా చేపట్టనున్న, పనులు జరుగుతున్న వివిధ ప్రాజెక్టులకు రూ.13,878.29కోట్లను రైల్వే శాఖ కేటాయించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో సమర్పించిన బడ్జెట్‌లో రైల్వే శాఖకు కేటాయించిన ఈనిధులను రైల్వే శాఖ కన్సాలిడేటెడ్ బడ్జెట్ స్టేట్‌మెంట్ (సిబిఎస్)లో రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలో జరుగుతున్న వివిధరైల్వేప్రాజెక్టులను మంజూరుచేసిన నిధులవివరాలు ఇలా వున్నాయి.

**నూతన రైలు మార్గాలు :**

కంభం-ప్రొద్దుటూరు రైలు మార్గానికి రూ.1,575.55కోట్లు, రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా విజయవాడ-గుంటూరు మధ్య నిర్మించనున్న రైలు మార్గానికి రూ.2,679.59కోట్లు, మునిరాబాద్-మహబూబ్‌నగర్ ప్రాజెక్టుకు రూ.1,813కోట్లు, కళ్యాణదుర్గం మీదుగా రాయదుర్గం-తుముకూరు రైలు మార్గానికి రూ.1,687.19కోట్లు, మరికుప్పం-కుప్పం ప్రాజెక్టుకు రూ.279.65 కోట్లు, మలుగూర్-పాలసముద్రంకు రూ.323.14కోట్లు చొప్పున కేటాయించారు. ధర్మవరం-పాకాల-కాట్పాడి డబ్లింగ్ రైలు మార్గానికి రూ.2,900 కోట్లు, ఎర్రగుంట్ల బైపాస్ లైన్ నిర్మాణానికి రూ.48.74కోట్లు, యలహంక-పెనుకొండకు రూ.988.37కోట్లు, పెనుకొండ-ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్టుకు రూ.307.66కోట్లు చొప్పున కేటాయించారు.

**రైల్వే విద్యుదీకరణ ప్రాజెక్టులకు :**


యలహంక-పెనుకొండ-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం ధర్మవరం-గుత్తి విద్యుత్‌రైలుమార్గానికి రూ.402.13 కోట్లు, నల్లపాడు-గుంతకలు >>2

## పిఎస్ఎల్‌వి సి-61 రాకెట్ విఫలం

రక్షణ ఉపగ్రహం కక్ష్యకు చేరకముందే గతి తప్పిన రాకెట్

సాంకేతిక లోపాలను విశ్లేషిస్తున్నామన్న ఇస్రో చైర్మన్ వి. నారాయణన్

కీలక ఉపగ్రహ వైఫల్యంతో అందరిలో నిరాశ, నిస్పృహలు





ఇస్రో చైర్మన్ నారాయణన్

**శ్రీహరికోట (తడ),మే 18, ప్రభాతవార్త:** కోట్లాది మంది భారతీయులు ఎన్నో ఆశలతో ఎదురు చూసిన ఉపగ్రహ ప్రయోగ విజయం సిద్ధించలేదు. సరిహద్దు రక్షణలో అత్యంత కీలకం అవుతుందని భావించిన ఇఓఎస్09 ఉపగ్రహం నిర్ణీత కక్ష్యకు చేరలేదు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కుతిరుగులేని విజయాలు అందించిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి-సి61) ఈ సారి గతి తప్పింది. ఆదివారం ఉదయం ఉదయం సరిగ్గా 5.59 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ విఫలం చెందింది. కేవలం 6 నిమిషాల 16 సెకన్ల వ్యవధిలోనే దారి తప్పింది. నాలుగు దశలతో నిర్మించిన ఈ రాకెట్ మొదటి, రెండు దశలు విజయవంతంగా దాటుకుని మూడో దశలో దిశ మారిపోయింది. అది ఘన ఇంధన దశ. 1993 సెప్టెంబర్ 20న పిఎస్ఎల్‌వి సిరీస్ ప్రారంభమయింది. ఈ సిరీస్‌లోని మొట్టమొదటి రాకెట్ పిఎస్ఎల్‌వి-డి1 కూడా సరిగ్గా మూడవ దశలోనే గతి తప్పింది. అయితే ఆ తర్వాత ఎన్నో పిఎస్ఎల్‌విలు మరెన్నో ఘన విజయాలు అందించాయి. భారత్ ఇప్పటివరకు 63 పిఎస్ఎల్‌వి రాకెట్లు ప్రయోగించగా, ఇది మూడవ వైఫల్యం మాత్రమే. శ్రీహరికోట నుంచి రాకెట్ నింగికి దూసుకెళ్లినతర్వాత 376.8 సెకన్లకు దారి మళ్లినట్లు సంకేతాలువచ్చాయి. ఈ రాకెట్‌ను >>2



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఘటనలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

### నగల దుకాణం దగ్ధం, 17 మంది దుర్మరణం

### మృతులలో 8 మంది చిన్నారులు

**హైదరాబాద్, (చార్మినార్) మే 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో గల గుల్జార్‌హౌజ్ వద్ద నగల దుకాణం యజమాని ఇంట్లో ఆదివారం ఉదయం సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది దుర్మరణం చెందగా నలుగురిని అగ్నిమాపక శాఖ సిబ్బంది కాపాడారు. కాగా మృతులంతా నగల దు కాణం యజమానితో పాటు ఆయన సోదరుడు వారి కుటుంబీకులే కావడం, మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలువుండడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో గల నగల దుకాణంలో ఏసి కంప్రెషర్ పేలడం వల్ల ఒక్కసారిగా మంటలు, పొగ చెలరేగి, నిమిషాల వ్య వధిలో మొదటి అంతస్తుకు, రెండవ అంతస్తుకు వ్యాపించడంతో ఆ సమయంలో గాఢ నిద్రలో వున్న వారు పొగతో ఊపిరి ఆడకుండా స్పృహ కోల్పోయారు. నగల దుకాణంలో మంటలు చెలరేగిన విషయమై అగ్ని మాపక శాఖ అధికారులకు సమాచారం అందగానే పది నిమిషాల వ్యవధిలో మొగల్‌పురా ఫైర్ స్టేషన్‌నుంచి రెండు యంత్రాలు, ఆ తరువాత మరో ఎనిమిది అగ్ని మాపక యంత్రాలను రంగంలో దించి మంటలను ఆర్పారు. మూడుగంటలు శ్రమించిన తరువాతే మంటలు అదుపులోకి వచ్చాయి. >>2

## అలిపిరి వద్ద బేస్ క్యాంప్



**తిరుమల భక్తుల కోసం వసతి సౌకర్యం, దర్శన కౌంటర్లు ఏర్పాటు**

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి, దర్శన సదుపాయాలు మరింత సులభం చేయడానికి వీలుగా తిరుపతి అలిపిరి వద్ద బేస్‌క్యాంపు ఏర్పాటుకు టిటిడి సిద్ధమైంది. సుమారు 15హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీ చేసే కౌంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకు అన్ని సమకూర్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి, అధికారులు కూడా ముందుకు కదులుతున్నారు. దేశంలోని అనేక ప్రాంతాలనుండి దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతి రోజూ లక్షమందివరకు భక్తులు వస్తున్నారు.

కొండపై 50వేలమంది భక్తులు రద్దీ పెరిగిత 1,2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు నిండిపోయి వెలుపలకు క్యూలైన్లు విస్తరిస్తున్నాయి. విపరీతమైన రద్దీతో శ్రీవారి దర్శనానికి 20గంటల నుండి 30గంటల సమయం పడుతోంది. దీంతో రద్దీకి అనుగుణంగా టిటిడి కొన్ని ప్రత్యామ్నాయ చర్యలు, నిర్ణయాలు తీసుకుంటోంది. భక్తులు తిరుమలకు చేరుకుంటే వీలైనంత వరకు త్వరగా నాలుగైదు గంటల్లోనే దేవుని దర్శనం చేయించేలా కృత్రిమమేధ (ఏఐ) ఆధారిత సేవలను ప్రారంభించాలని ఆలోచన ఉంది. ఇదే సమయంలో తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేలమంది వరకు భక్తులు ఈ >>2



ప్రమాదానికి గురైన కారును బావిలోనుంచి బయటకు తీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) ప్రమాదానికి గురైన కారు

## వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన కారు

### ముగ్గురు మృతి, ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు, పీలేరు వద్ద దుర్ఘటన

**పీలేరు మే 18 ప్రభాతవార్త:** పీలేరు మండలంలో ఓ కారు వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లడంతో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రం చింతామణి పరిసర గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు కేటరింగ్ నిర్వహించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు వీరందరూ పీలేరులో కేటరింగ్ నిర్వహించడానికి ఒప్పుకున్నారు తమిళనాడు రాష్ట్రం హోసూరులో క్యాటరింగ్ నిర్వహించి ఆదివారం అర్ధరాత్రి12 గంటల ప్రాంతంలో పీలేరు బయలుదేరారు. మరో 10 నిమిషాలు ప్రయాణిస్తే పీలేరుకు చేరుకుంటారు ఈ >>2

19-5pg2exHMNWJQE.qxd:19-5pg2exHMNWJQE.qxd 01/01/01 8:06 AM Page 1





గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఆదివారం తిరంగా యాత్రలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# పథకాల అమలు

>> షన్ ఇచ్చారు. ఐవీఆర్ఎస్‌తోపాటు ఇతర రూపాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయగా.. ప్రజల సంతృప్తి అంశంలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ముందుకెళ్లాలని సీఎం ఆదేశించారు. ప్రజలే ఫస్ట్ అనే విధానంలో ప్రజల అభిప్రాయాలు, అంచనాల మేరకు పనిచేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సిఎంకు అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో వివరాలు ఇలా ఉన్నాయి. వీటిని అనుసరించి ప్రతి నెలా 1వ తేదీన ఇంటివద్దే ఫింఛన్ అందుతుందా అనే ప్రశ్నకు 94శాతం మంది లబ్ధిదారుల నుంచి సంతృప్తి వ్యక్తమైంది. పింఛను అందించిన ఉద్యోగుల ప్రవర్తనపై 90 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. మీరు పింఛను తీసుకుంటున్నప్పుడు అవినీతి గమనించారా అన్న ప్రశ్నకు 12శాతం మంది అక్కడక్కడా అవినీతి జరుగుతుందని ఫిర్యాదు చేశారు. అన్న క్యాంటీన్‌లో పారిశుధ్యంపై 82 శాతం మంది, ఆహారంలో నాణ్యతపై 91 శాతం మంది, సమయపాలనపై 84 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణ విధానంపై 89.92 శాతం మంది రైతుల నుంచి సంతృప్తి వ్యక్తమైంది. గోనె సంచుల విషయంలో 30 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతకు తగ్గ ధర లభించిందని 84 శాతం మంది అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 7 ఆలయాల్లో దర్శనాల తీరుపై సర్వే నిర్వహించగా 70 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. వసతులపై 37 శాతంమంది భక్తుల్లో అసంతృప్తి కనిపించింది. ప్రసాదంపై మాత్రం 81 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఆసుపత్రుల్లో అడ్మిషన్‌పై 90 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. సేవల విషయంలో 87 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యమిత్రల పనితీరుపై 87 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపైన అధికారులు సిఎం చంద్రబాబుకు పలు విషయాలు వివరించారు.వైద్యులు, సిబ్బంది అందుబాటుపై 65 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవినీతి జరుగుతుందని 37 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రజల అభిప్రాయాలను సాదా సీదా తీసుకోకండి.,ప్రతిదీ మనం రికార్డు చేసుకుంటున్నాం,ఆయా అంశాలను మనం పరిష్కరించడంతో పాటు వివిధ ప్రభుత్వశాఖల పనితీరు బాగుపడాలని సిఎం వ్యాఖ్యానించారు. వైద్య, ఆరోగ్య శాఖపై వచ్చే ఫిర్యాదుల విషయంలో అలెర్ట్‌గా ఉండాలన్నారు.ఈ శాఖలో అవినీతి ఆరోపణలు,పనితీరుపై వచ్చే అభియోగాలపై ఎప్పటికప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.గతంలో ఎన్నడు లేని వైద్యశాఖపై మనం దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుత తరుణాన్ని పరిశీలించి, వ్యాధుల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలన్నారు.కొత్త వేరియెంట్లు వస్తే వెంటనే అవి వ్యాప్తి చెంద కుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇది మనకు అత్యంత కీలకంశంగా భావించా లన్నారు. వైద్యశాఖ అలసత్వం వ్యవహరించిన అనేకమంది వైద్యులను నిర్మోహ మాటంగా చర్యలు తీసుకున్నామన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూ గిరిజనులకు న్యాయం చేస్తామని తెలిపారు.మా ప్రభుత్వం ఇటువంటి కీలక నిర్ణయాలను ఐవిఆర్ఎస్‌తో ద్వారానే తెలుసుకుంటుందన్నారు. 'తల్లికి వందనం' వచ్చే నెలో విద్యాసంవ త్సరం ఆరంభం నాటికి అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు.

# బంగాళాఖాతంలో 'శక్తి' తుఫాను

## పలు జిల్లాలను అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతోంది. రానున్న రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇది తుపానుగా మారనుంది. దీనికి 'శక్తి' తుపాను అని పేరు పెట్టారు. దీంతో వారం రోజుల పాటు తెలంగాణ,ఎపి లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వీటి ప్రభావంతో వారం రోజుల పాటు తెలంగాణ, ఎపి సహా దక్షిణాది రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశంకూడా ఉందని, వర్షంపడే సమయంలో చెట్ల కిందకు వెళ్లకూడదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షం కురుస్తుందని ఐఎండీ తెలిపింది. సాయంత్రం 5గంటల తరువాత పశ్చిమ తెలంగాణలో వర్షం మొదలై రాతంత్రా కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని గద్వాల్, మహబూ నగర్, నిజామాబాద్, బెల్లంపల్లి, జగిత్యాల ఇలా కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే, గాలి వేగాన్ని బట్టి వర్షం పడే ప్రాంతాలు మారే అవకాశాలుఉన్నాయి. మరోవైపు రాబోయే మూడురోజుల్లో తెలంగా ణలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాగల మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుండి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాతావరణం మేఘావృతం అయ్యి ఉంటుంది.

# అలిపిరి వద్ద బేస్ క్యాంప్

>> క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కూడా అవసరమైన మౌలిక వసతులకు టిటిడికి అనుమతులు ఇచ్చింది. కొండపై రద్దీని నియంత్రించేందుకు వీలుగా అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నారు. సాదారణ రోజుల్లోనే తిరుమలకు 80వేలమంది నుండి 90వేలమంది వరకు భక్తులు చేరుకుంటున్నారు. ఇక వారాంతం,ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన ఉత్సవాల రోజుల్లో 1.50లక్షలమంది వరకు కూడా భక్తులు తిరుమలకు వస్తున్నారు. గత ఏడాది కాలంలో తిరుమలలో విజన్ 2047కి శ్రీకారంచుట్టేలా పనులు చేపట్టేందుకు ప్రస్తుత టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. అలిపిరి పాతచెక్ పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకునిగానీ, దేవలోక్ ప్రాంతంలోగానీ బేస్‌క్యాంపు ఏర్పాటుకు స్థలాల పరిశీలన జరిగింది.

**బేస్‌క్యాంపుతోనే యాత్రికులకు సకల సేవలు:**

ఇప్పటికే అలిపిరి వద్ద ఇందుకోసం స్థలాన్ని కూడా టిటిడి పరిశీలించింది. ప్రస్తుతం తిరుమలలో 7,790 గదులు, వెయ్యికిపైగా మఠాల్లోని గదులు, మూడు యాత్రికుల వసతి సముదాయాల్లో 7వేల వరకు లాకర్లు సదుపాయం ఉన్నాయి. వీటన్నిటిలో 40వేలమంది నుండి 50వేలమంది వరకు భక్తులకు వసతి పొందుతున్నారు.ఆపై భక్తులు కొండకు చేరుకున్నా ఆరుబయట, ఖాళీస్థలాల్లో, ఉద్యానవనాల్లో విశ్రాంతి తీసుకోవడం, తలదాచుకోవడం కనిపిస్తుంది. సామాన్యభక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. భక్తులకు సంతోషకరమైన దర్శనంతోబాటు సంతృప్తికర వసతి కల్పించేందుకు బేస్‌క్యాంపు ప్రధానంగా నిలవనుంది. దేశంలోని పలుప్రాంతాలనుండి తిరుపతికి చేరుకునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమలకు వాహనాలు కాలుష్యం,పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకునే వీలుకలుగుతుంది. ఘాట్‌లో అనుభవంలేని వాహనాల డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నారు. అలిపిరి నుండి భక్తులను ఆర్టీసి బస్సులద్వారా తిరుమలకు చేరవేయాలనేది ప్రధాన ఉద్దేశ్యం కూడా తెలుస్తోంది. బేస్‌క్యాంపులో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వివిధ రకాల ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రణాళికలు రూపొందించి ఆమోదించడంతో టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు టిటిడి వేగంగా ప్రయత్నిస్తోంది.

# రాకెట్ విఫలం

>> నియంత్రిస్తున్న త్రివేండ్రంలోని ఇస్రో వారి భూకేంద్రం మొట్టమొదట ఈ వైఫల్యం గుర్తించింది. అప్పటిదాకా అంతా బాగానే ఉంది. మొదట ఆరు స్ట్రాపాన్లు, మొదటి ఘన ఇంధన దశ, రెండవ ద్రవ ఇంధన దశ నిర్ణీత కాలంలో ముగిసింది. మూడవ ఘన ఇంధన దశ వైఫల్యం కొంపముంచింది. ఈ దశను శ్రీహరికోటలోనే రూపొందించారు. 3.6 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వ్యాసం, హెచ్‌టిబిడి అనే ఘన ఇంధనాన్ని ఇందులో నింపారు. 7.65 టన్నుల ఘన ఇంధనంతో ఈ మూడో దశ నిర్మాణమైంది.

**ఉత్కంఠ భరిత క్షణాలు..**

త్రివేండ్రం నుంచి వైఫల్యం నీడలు తొలిసారి బయటపడిన తర్వాత రాకెట్ ప్రయోగ దృశ్యాలను దూరదర్శన్ లైవ్ నిలిపివేశారు. అప్పుడే రాకెట్ గతి తప్పినట్లు శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో పెద్ద తెరలపై వీక్షించి పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. స్క్రీన్ మీద రాకెట్ దారి మళ్లినట్లు ఒక దృశ్యం కనిపించింది కూడా. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రయోగాన్ని వీక్షించిన ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌తో పాటు ఇతర శాస్త్రవేత్తలు, 18 మంది కేంద్ర పార్లమెంటరీ కమిటీబృందం సభ్యులు, మాజీ ఛైర్మన్ ఎఎస్ కిరణ్‌కుమార్ తదితరులు రాకెట్ ప్రయోగం ఏమయిందన్న సందేహాలతో ఉన్నారు. ఆ తర్వాత కొద్ది క్షణాలకు దూరదర్శన్ వారు మళ్లీ లైవ్ ప్రసారం చేశారు. అయితే ఈ సారి రాకెట్ ప్రయోగ దృశ్యాలు కాకుండా ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ మిషన్ కంట్రోల్ సెంటర్‌నుంచి ప్రసంగిస్తున్నారు. ఈ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టలేకపోతున్నాం. కారణాలను విశ్లేషించి మళ్లీ చెప్తాం అంటూ దూరద ర్శన్‌లో క్లుప్తంగా మాట్లాడి వెళ్లిపోయారు. ఆతర్వాత ఛైర్మన్ నారాయణన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మీడియాసెంటర్‌కు హడావుడిగావచ్చి పిఎస్ రాకెట్ ప్రయోగం విజయవంతం కాలేదనిచెప్పి క్షణాల్లోనే వెనుతిరిగారు.

**ఉపగ్రహం ఏమైంది ? నాలుగో దశ ఎక్కడ ?**

అంతరిక్షంలోని రెండు వేర్వేరు కక్ష్యల్లో పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ ఉపగ్రహాన్ని, నాలుగవ దశను ప్రవేశపెట్టేలా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించారు. మొదటగా భూమికి 534 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టిన తర్వాత రాకెట్ నాలుగో దశను మరో కక్ష్య వైపు తీసుకెళ్లాల్సి ఉంది. ఈ నాలుగో దశలో మరిన్ని పరిశోధనల కోసం కొంచెం దిగువ కక్ష్యలో భూమికి 351 కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెట్టాల్సి ఉంది. ఈ రెండు కార్యక్రమాలు పిఎస్ఎల్‌వి-సి61 చేయలేకపోయింది. ఇక ఈ ప్రయో గంలో నాలుగో దశ పరిశోధనలకు కొన్ని ఉపకరణాలు పంపించి ఉన్నారు. ఈ కీలక దశ రాకెట్‌తో పాటే గతితప్పిందా? ఒక వేళ నాలుగో దశ చివరిక్షణాల్లో అంటుకుని దాన్ని నిర్ణీతకక్ష్యకు చేరువఅవుతుందా? అనే దిశలో శాస్త్రవేత్తలు భూకేంద్రాలనుంచి పరిశోధనలుచేస్తున్నారా? అన్న చర్చలు జరుగుతున్నాయి.

# బావిలోకి దూసుకెళ్లిన కారు

>> క్రమంలోనే నిద్రమత్తు ఆవహించడంతో వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కనే ఉన్న పాడుబడ్డ వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. పీలేరు సిఐ యుగంధర్ కథనం మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు హుసూరు నుంచి ఐదుగురు వ్యక్తులు పీలేరులో క్యాటరింగ్ నిర్వహించడానికి ఆదివారం రాత్రి 12 గంటలకు కారులో బయలుదేరారు. మరో పది నిమిషాల్లో అనుకున్న ప్రాంతానికి చేరుకుంటారు. ఈ క్రమంలో పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ కురవపల్లె సమీసంలోకి రాగానే 4 గంటల ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కనే ఉన్న పాడుపడ్డ వ్యవసాయ బావిలోకి దూసుకొంది. బావిలోకి దూకిన కారు తలకిందలై పూర్తిగా నీటిలో మునిగిపోయింది. వీరిలో కారు వెనుక సీట్లో కూర్చొన్న ఇద్దరు వ్యక్తులు సాహసించి కారు అద్దాలు పగలకొట్టి బయటపడగలిగారు. మిగతా ముగ్గురు బయటకు వచ్చే క్రమంలో ఊపిరాడక కారులో ఇరుక్కుని మృతి చెందారు మృతి చెందిన వారిలో చింతామణి చాంద్రహళ్లి గ్రామానికి చెందిన శివానంద (45) కారులో చిక్కుకుని మృతి చెందాడు. ఇతనికి భార్య కవిత(40), చందన (17), భార్గవ్(15) ఇద్దరు పిల్లలు ఉన్నారు. సొలుగుటూరు గ్రామానికి చెందిన లోకేశ్(40) ఉండగా ఇతనికి భార్య చందన (35) అమూల్య (10), బాస్కర్(8) అనే పిల్లలు ఉన్నారు. .. కోలారు జిల్లా పొగుటూరుకు చెందిన చలపతి(48) మృతి చెందగా ఇతనికి భార్య చైత్ర(45), వినీత్ (15), వినీత(13) ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకున్న మృతుల కుటుంబ సభ్యులు బోరున విలపించడాన్ని చూపరులను కుటతడి పెట్టించాయి. బావిలోకి దూసుకెళ్లి నీటిలోనే తిరగబడిన కారులోంచి శాంద్రహళ్లి చిక్బల్లాపూర్కు చెందిన తిప్పారెడ్డి(43), సునీల్(23) సాహసించి కారు వెనుక అద్దాలు పగలగొట్టి బయటపడి మృత్యుంజయులుగా మిగిలారు. వీరు బయటపడడంతో ఈ ప్రమాదం వెలుగుచూసింది లేదంటే బావిలో నీరు అయిపోతే గాని కారు పడిన సంఘటన తెలిసేదికాదు. కారులోంచి బయటపడ్డ ఇద్దరు వ్యక్తుల ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక గ్రామస్థులు సహాయక చర్యలు చేపట్టారు. రైతులు స్వచ్ఛందంగా మోటార్లు అమర్చి నీటిని తోడారు. సమాచారం అందుకున్న పీలేరు పోలీసులు, అ గ్రామ ప్రజలు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాడు. మోటార్ల ద్వారా నీటిని తోడేయడంతో పోలీసులు క్రేన్ సాయంతో కారును బయటకు తీసి అందులో ఉన్న మృతదేహాలను వెలికితీశారు. సమాచారం అందుకున్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలకు నివాళి అర్పించి ఆర్థికంగా తక్షణ సాయం అందించారు.

# సనంద్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా

**సనంద్(గుజరాత్), మే 18:** ఆపరేషన్ సింధూర్‌తో భారత్ విజయానికి ప్రతీకగా దేశవ్యాప్తంగాజరుగుతున్న తిరంగార్యాలీల్లో కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటున్నారు. గుజరాత్ బిజెపి ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీలోకేంద్ర మంత్రి అమిత్‌షా పాల్గొ న్నారు. మువ్వన్నెల జెండాను చేతపట్టి సనంద్‌లోని నల్ సరోవర్ చౌకిడినుంచి మెక్లింగ్‌జీరోడ్డులోని మహారాణప్రతాప్ చౌక్ వరకూ పాదయాత్రచేసారు. ర్యాలీలో ముఖ్య మంత్రి భూపేంద్ర పటేల్, హర్ష్‌సంఘ్వి తదితర రాష్ట్రమంత్రులు కూడా పాల్గొన్నార. ఎక్లింగ్‌జీరోడ్డులోనే 16వ శతాబ్దపు మహాయో ధుడి విగ్రహం వద్ద నివాళి అర్పించి అనం తరం పాదయాత్రను కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యేలు, బిజెపినాయకులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అత్య ధిక సంఖ్యలో పాల్గొన్నారు. సనంద్‌పరిసరాల నుంచి కూడా సామాజిక రాజకీయ కార్యకర్తలు తిరంగా యాత్రలో పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలుచేసారు. త్రివిధ దళాల ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ అభినందిం చారు. ఆపరేషన్‌సింధూర్ విజయవంతం చేయడంలో మన త్రివిధ దళాలశక్తిని ప్రపంచా నికి చాటిచెప్పామని, మన యోధులకు గౌరవ సూచకంగానే ఈ యాత్రలునిర్వహి స్తున్నట్లు గుజరాత్ బిజెపిరాష్ట్రయూనిట్ ప్రకటించింది.

# సురేష్ అరెస్ట్

>> కుంది. రాజుపై నందిగం సురేష్‌తో పాటు ఆయన సోదరుడు ప్రభుదాసు, బంధువులు దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన రాజు మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతు న్నారు. ఈఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో రాత్రి 9 గంటల సమయంలో వేగంగా కారువచ్చి ఇసుకపల్లి రాజుని ఢీకొట్ట డంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపటికే సురేష్ ఆయన అన్న ప్రభుదాస్, ఇతర బంధువులు వచ్చి అక్కడే రాజుని కొట్టి మళ్లీ ఇంటికి తీసుకెళ్లి అక్కడా చావబాదారు. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయకముందే సురేష్ భార్య రాత్రి 11 గంటలకు సమయంలో కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసారు.

# కొడాలి నాని!

>> చారం.హైదరాబాద్‌లోని వెంకటేశ్వరరావు విశ్రాంతి తీసుకుంటున్నారు.వైకాంగ్రెస్ పార్టీలోని అత్యంత సన్నిహితులను మినహా ఎవరినీ దగ్గరకు రానివ్వట్లేదని తెలిసింది. వైఎస్సార్సీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలపై అసభ్య పదజాలంతో విరుచుకుపడిన నాని తెరవెనుక మట్టి, ఇసుక సహా అనేక అక్రమాలకు పాల్పడ్డా రన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం వాటిపై విజిలెన్స్ విచారణలు జరుగుతున్నాయి.

## వారం - వర్జ్యం

తేది : 19-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
షష్ఠి ఉ.6.11
శ్రవణ రా.7.25
వర్జ్యం రా.11.26-1.02
దు.ము.12.31-1.23, 2) ము.3.06-3.58
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. విలువైన వస్తువులు జాగ్రత్త అవసరం.

**వృషభం :** పనులలో జాప్యం ఒరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ప్రయాణా లలో తొందరపాటు వద్దు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. స్వల్ప ధనలాభం.

**కర్కాటకం:** విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గుంటారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** కుటుంబంలో సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కన్య :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు.

**తుల :** ప్రయాణాలలో నూతన పరి చయాలు పెరుగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే.

**వృశ్చికం:** ప్రముఖుల నుండి సలహాలు స్వీకరిస్తారు. పుణ్యక్షేత్రాల సందర్శనం. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** వ్యాపారాలలో ఆటంకాలు ఏర్పడి చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వుంటుంది.

**మకరం:** ఋణబాధలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం:** నూతన మిత్రులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**మీనం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. ధనలాభం.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఆదివారం నాగ్‌పూర్ జిల్లాలో తిరంగా యాత్రలో పాల్గొన్న మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్ తదితరులు

# రూ. 13,878 కోట్లు

>>(పెండే కల్లు-గుతి కలుపుకుని) రూ.824.9 కోట్లు, (తోరణగళ్ళు- రంజిత్‌పురా బ్రాంచిలైన్ కలుపుకొని) రూ.226.68కోట్లు,చిక్ జాజూర్-రాయదుర్గం-బళ్లారి ప్రాజెక్టుకు రూ.244.23కోట్లు, నంద్యాల-ఎర్రగుంట్లకు రూ.121.86కోట్లు, ధర్మవరం-పాకాల ప్రాజెక్టుకు రూ.239.1కోట్లు,గద్వాల-రాయచూరుకు రూ.54.92కోట్లు కేటాయించారు.

**సర్వేలు,భూసేకరణ తుది సర్వే ప్రాజెక్టులు :**

కర్నూలు జిల్లా వాసులు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న మంత్రాలయం రోడ్డు-కర్నూలు నూతన రైలు మార్గాన్ని ఇంజనీరింగ్, ట్రాఫిక్‌లు సంయుక్తంగా నిర్వహించే ప్రాథమిక సర్వేకు రూ.0.28కోట్లు కేటాయించి ప్రాజెక్టుకు జీవం పోశారు. ధర్మవరం-బళ్లారి నూతన రైలు మార్గానికి ఇంజనీరింగ్,ట్రాఫిక్‌లు సంయుక్తంగా నిర్వహించే ప్రాథమిక సర్వేకు రూ.0.30కోట్లు,కడప,గుంతకల్లు,బళ్లారిలతో పాటు దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో మరికొన్ని రైలు మార్గాల నిర్మాణానికి ప్రాథమిక సర్వేకు రూ.1.11కోట్లు కేటాయించారు. అలాగే అమరావతి మీదుగా విజయవాడ-గుంటూరు మధ్య నిర్మించనున్న నూతన రైలు మార్గం తుది భూసేకరణ సర్వే నిర్వహణకు రూ.1.33కోట్లు,ముద్దనూరు-ముదిగుబ్బ ఆర్ఇటి సర్వేకు రూ.0.16కోట్లు, విశాఖపట్నం-విజయవాడ- కర్నూలుతో పాటు చేపట్టనున్న నూతన రైలు మార్గాల నిర్మాణాల తుది భూసేకరణ సర్వేలకు రూ.4.71కోట్లు, ఓబులవారి పల్లి-రేణిగుంట చతుర్భుజ రైలు మార్గాల తుది భూ సేకరణ సర్వే నిర్వహణకు రూ.1.12కోట్లు, స్వామి హళ్లి-రాయదుర్గం తుది భూసేకరణ సర్వేకు రూ.1.30కోట్లు, ములుగూరు-మడకశిర-హరియూర్ నూతన రైలు మార్గం భూసేకరణ తుది సర్వేకు రూ.2.75కోట్లు,రాయదుర్గం-తుముకూరు డబ్లింగ్ రైలుమార్గం ప్రాజెక్టు తుది భూసేకరణ సర్వే నిర్వహణకు రూ.3.88కోట్లు,హిందూపురం-చిత్రదుర్గమధ్య చేపట్టనున్న ఆర్ఇటిసర్వేకు రూ.0.33కోట్లు కేటాయించారు.

# రాష్ట్రమంతా వర్తింపు

>> అంచనా వేశారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, హోంమంత్రి అనిత, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిల బృందం ఫిబ్రవరిలో కర్ణాటకలో పర్యటించింది. అక్కడ అమలవుతున్న ఉచిత బస్ పథకంపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. మరోవైపు ఈ పథకం అమలవుతున్న 5 రాష్ట్రాల్లోని పరిస్థితులపై ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి మరో నివేదిక ఇచ్చింది. ఆర్టీసీలో 11,216 బస్సులుంటే, వాటిలో 8,193 పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ఈ పథకం అమలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం 69 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో టికెట్ల ద్వారా రాబడి ఏడాదికి రూ.3,708 కోట్లుగా ఉంది. అందులో 40 శాతం మహిళా ప్రయాణికుల ద్వారా వస్తున్న రాబడి 14 వందల 83 కోట్లుగా లెక్క వేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే ఓఆర్ 94 శాతానికి చేరుతుంది. టికెట్ల ద్వారా వచ్చే రాబడి రూ.5051 కోట్లకు చేరుతుంది. మహిళా ప్రయాణికుల సంఖ్య 63 శాతానికి పెరుగుతుంది. వారి టికెట్లకు చెందిన సొమ్ము ఏటా రూ3,182 కోట్లు ఉంటుంది. ఇదంతా ప్రభుత్వం భరించాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రస్తుతం నిత్యం ప్రయాణించే వారి సంఖ్య సగటున 43.59 లక్షలు. అందులో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రతిరోజూ ప్రయాణించే వారు 23.67 లక్షలు. వీరిలో మహిళా ప్రయాణికుల సంఖ్య 9.46 లక్షలు. దూరప్రాంత సర్వీసుల్లో ప్రయాణికులు 3.33 లక్షలు. విద్యార్థి పాస్‌లు, వివిధ రాయితీల పాస్‌లు కలిగినవారు 16.59 లక్షలు. వీరిలో మహిళలు 6.64 లక్షలు. అంటే ఉచిత ప్రయాణం అమలు చేయనున్న బస్సుల్లోని మహిళా ప్రయాణికులు 9.46 లక్షలు, మహిళా పాస్ హోల్డర్లు 6.64 లక్షలు కలిపి నిత్యం 16.10 లక్షల మంది ఉన్నారు.ఉచిత ప్రయాణ పథకం అమలు చేస్తే వీరి సంఖ్య నిత్యం 26.95 లక్షలకు చేరుతుంది. అంటే రోజుకు 10.85 లక్షల మంది మహిళలు అదనంగా ప్రయాణిస్తారని అంచనా. ఉచిత ప్రయాణ సమయంలో మహిళలకు జీరో టికెట్ జారీ చేస్తారు. మహిళలకు ఇచ్చే టికెట్‌లో సున్నా ఉంటుంది. కానీ, ఈపోస్ యంత్రంలో మాత్రం టికెట్ ధర నమోదవుతుంది. ఇలా మహిళా ప్రయాణికులకు జారీ చేసిన టికెట్ల విలువను ఆర్టీసీ లెక్కించి, ప్రతినెలా ప్రభుత్వానికి అందజేస్తుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది.ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబుకు మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య ప్రజల కోసం ముఖ్యమంత్రి చొరవ అభినందనీయమన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు భారీ ఊరటనిచ్చారన్నారు. చంద్రబాబు ప్రజా సంకల్పమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలిపారు. మహిళలకు, వృద్ధులకు ప్రయాణంలో భద్రత, స్వేచ్ఛను కలిగించిన సీఎంకి ధన్యవాదాలు చెప్పారు. గ్రామాల నుంచి పట్టణాలకు వడివడిగా ప్రయాణించే మహిళలకు ఇది వరమని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఓ నిర్ణయం కాదు - ప్రజల పట్ల సీఎం హృదయాన్ని చూపిస్తోందన్నారు. ఉచిత బస్సు పథకంతో కుటుంబ ఆర్థిక భారం తగ్గుతుందని వెల్లడించారు. టిడిపి ప్రభుత్వం సామాజిక న్యాయం, సౌకర్యాల పాలనకు సంకేతం ఇదే అన్నారు. మహిళా సాధికారతకు చంద్రబాబు బలమైన అడుగులు వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణంపై సిఎం చంద్రబాబు క్లారిటి ఇవ్వడంతో మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# భారీ అగ్నిప్రమాదం

>>ఈ ఘటనలో నగల దుకాణం యజమాని ప్రహ్లాద్ మోడి (72)తో పాటు ఆయన సోదరుడు రాజేందర్ మోది (65), ప్రహ్లాద్ మోది భార్య మున్నీ భాయి మోది (68), రాజేందర్ మోది భార్య సుమిత్ర (60), ప్రహ్లాద్ మోది పెద్ద కుమారుడు కుమారుడు పంకజ్ మోది (43), కోడలు వర్ష (36), కుమార్తెలు శీతల్ (35), రజని (32), రెండవ కుమారుడు సోదరుడు అభిషేక్ (31) మరణించారు. వీరితో పాటు పంకజ్ మోది పిల్లలు అన్య మోది (12) ఇదికా మోది (8). ఇరాజ్ మోది (2)లు, శీతల్ జైన్ కుమార్తె ఆరుషీ జైన్ (17), రజని కుమార్తె హర్షాలి గుప్తా (7), రాజేందర్ మోది మనవలు ప్రియాంషి అగర్వాల్ (6). హమేయ్ (7), రిషబ్ (4)లు మరణించారు. కాగా ఈ ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికివెళ్లి గాయపడ్డ బా ధితులను పరామర్శిం చారు. అనంతరం ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదంపై అధికా రులను అడిగి తెలుసుకున్నారు. మంటలు చెలరేగిన భవనంలో పైకి వెళ్లేందుకు ఒకటే మెట్ల మార్గం వుండడం, అది కూడా చిన్నదిగా వుండడం వల్ల ప్రమాద తీవ్రత పెరిగిందని, లోపలి భాగంలో మంటలను ఆర్పేందుకు రోబోను కూడా పంపామని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. పాతబస్తీలోని నగలు, ముత్యాల అమ్మకాలకు ప్రసిద్ధిగాంచిన గుల్జార్‌హౌజ్ వద్ద ఓ నగల దుకాణంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. పూనంచంద్ అనే వ్యక్తికి చెందిన రెండంతస్తుల భవనంలో ఒక భాగంలో పూనం చంద్ జ్వెల్లర్స్, దీని పక్కనే కృష్ణా ముత్యాల దు కాణం వుంది. భవనం మొదటి అంతస్తులో నగల దుకాణం యజమాని ప్రహ్లాద్ మోది ఆయన సోదరుడు రాజేందర్ కుమార్ మోది కుటుంబం నివసిస్తోంది. ఆయన ఇద్దరు కుమారులు పంకజ్ మోది, రెండవ కుమారుడు అభిషేక్ మోదితో పాటు పెద్ద కోడలు వర్ష వారి ముగ్గురు పిల్లలు ఇదే ఇంట్లో వుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో పహ్లాద్ మోది సోదరుడు రాజేందర్ మోది, ఆయన భార్య సుమిత్రతో పాటు నగరంలోనే వుంటున్న ప్లహాద్ మోది కుమార్తెలు శీతల్ జైన్, రజని గుప్తా వారి పిల్లలంతా వేసవి విడిది కోసం తండ్రి ఇంటికి వచ్చారు. రాత్రి 12 గంటల వరకు కుటుంబ సభ్యులంతా మాట్లాడుకుని నిద్రపోయారు. ఉదయం ఆరుగంటల సమయంలో కింది భాగంలో గల నగలదుకాణంలో వున్న ఏసి కంప్రెషర్ ఒక్కసారిగా పేలిపోవడంతో నిమిషాల వ్యవధిలో మంటలు చెలరేగి దుకాణంలోని వస్తువులతో పాటు ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యింది. వెను వెంటనే మంటలు మొదటి అంతస్తు, రెండవ అంతస్తుకు వ్యాపించాయి. మంటతోపాటు పొగకూడా మొదటి, రెండవ అంతస్తుకు వ్యాపించడంతో ఇక్కడ గాడ నిద్రలో వున్న ప్రహ్లాద్ మోది, రాజేందర్ మోదిల కుటుంబ సభ్యులు, వారి పసిపిల్లలు ఏం జరిగిందో కూడా తెలుసుకునే వీలులేని పరిస్థితి నెలకొనడంతో ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. సరిగ్గా ఇదే సమయంలో స్థానికులు దీనిపై పోలీసులతో పాటు అగ్నిమాపక శాఖకు ఫిర్యాదు చేయడంతో వారు హుటాహుటిన రంగంలో దిగి అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పారు. భవనం పై భాగంలో వెళ్లేందుక గల మెట్ల మార్గం చిన్నదిగా వుండడం, అక్కడ మంటలతో పాటు పొగ చూరడంతో అగ్నిమాపక సిబ్బంది ముందుకు వెళ్లలేక పోయారు. దీంతో నిచ్చన ద్వారా మొదటి అంతస్తులో వెళ్లి అక్కడ ఊపిరి ఆడకుండా స్పృహలేని పరిస్థితిలో వున్న 17 మందిని బయటకు తరలించి మల క్పేట యశోధ ఆసుపత్రితో పాటు హైదర్‌గూడ అపోలో, ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారంతా మరణించారు. వీరి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోస్టు మార్టం అనంతరం మృత దేహాలను వారి కుటుంబీకులకు అప్పగించారు.

19-5Pg3exHMNWJQE.qxd:19-5Pg3exHMNWJQE.qxd 01/01/01 7:51 AM Page 1



# ఇఒఎస్ 09 వైఫల్యంతో అంతా నిరాశ

## శాస్త్రవేత్తలు డీలా..షార్ కేంద్రం వెలవెల

**శ్రీహరికోట (తడ), మే 18 ప్రభాతవార్త:** చంద్రయాన్-3తో చరిత్ర సృష్టించిన ఇస్రో అంతకు ముందు ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలు విజయవంతంగా ప్రయోగించి ఉంది. మంగళయాన్, ఆదిత్య ఎల్1 వంటి ఉపగ్రహాలను అలవోకగా అంతరిక్ష కక్ష్యలోకి చేర్చి పరిశోధనలు ప్రారంభించింది. ప్రపంచం మొత్తం తనవైపు చూసేలా ఇస్రోపలుమార్లు శభాష్ అనిపించుకుంది.అయితే శాస్త్రవేత్తలు ఆదివారం ఒక్క వైఫల్యంతో డీలా పడ్డారు. అత్యంత కీలకమైన దేశ రక్షణకు పెద్దన్న పాత్ర పోషిస్తుందని అందరూ ఆశతో ఎదురుచూసిన ఇఒఎస్ 09 ఉపగ్రహం నిర్ణీత కక్ష్యకు చేరుకోలేక పోయింది.

**ఇఒఎస్ 09ను ముందుకు తెచ్చారు:** గతంలో నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన అతి విలువైన ఉపగ్రహం నిసార్‌ను ఈ నెలలో ప్రయోగించాల్సి ఉంది. జిఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్‌ను ఇందుకు సిద్ధంచేశారు. అయితే ఇటీవల పాకిస్తాన్ సరిహద్దుల్లో పెహల్గాం దాడులు, తద్వారా ముదిరిన సరిహద్దు వివాదం నేపథ్యంలో దేశానికి అత్యవసరంగా ఇఒఎస్ 09 వంటి అత్యాధునికమైన, శక్తివంతమైన భూపరిశీలన ఉపగ్రహం అవసరమైంది. అందుకే దీన్ని ముందుకు జరిపి చకచకా ఏర్పాట్లు పూర్తి చేసి ఆదివారం ప్రయోగించారు. ఇస్రో ఇఒఎస్ 09కు ముందే భూపరిశీలన ఉపగ్రహాలను రూపొందించి ఉంది. ఆ సిరీస్‌లో ప్రస్తుతం ప్రయోగించిన ఉపగ్రహం 9వది. ఇది మిగిలిన వాటికన్నా ఎక్కువ శక్తివంతమైనది. ఇందులోని సింథటిక్ అపర్చర్ రాడార్ (సార్)తో పగలురాత్రి, వర్షం తుపానులు వంటి అన్ని వేళల్లో పని చేసేలా రూపొందించారు. దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పిస్తున్న మన వీర సైనికులకు శత్రుదేశం కదలికలు ఎప్పటికప్పుడు తెలుసుకునే దివ్యాస్త్రంగా దీన్ని తయారు చేశారు. పైగా వ్యవసాయ అభివృద్ధి, అటవీ సంరక్షణ, ప్రకృతి వైపరిత్యాలు పసిగట్టడం, పట్టణాభివృద్ధి వంటి సేవలను కూడా ఆశించారు. ఇటువంటి కీలక పరిణామాల తర్వాత పలుమార్లు పొరుగు దేశంపై విజయాలు సాధించి సత్తా చాటిన భారత్ ఈ ఉపగ్రహ ప్రయోగంతోను సక్సెస్‌ను అందుకుని ఉంటే మరింత బలీయమైన శక్తిగా అవతరించేదని విశ్లేషకులు అంటున్నారు.

**నాయకత్వం మార్పు తర్వాత:** ఇస్రో ఛైర్మన్‌గా సోమనాథ్ నుంచి ఈ జనవరిలో వి.నారాయణన్ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత జరిగిన రెండవ రాకెట్ ప్రయోగమే విఫలం చెందింది. ఇది ఇస్రోకు 101వ రాకెట్ ప్రయోగం ఈ ఏడాది జనవరి 29న 100వ రాకెట్ జిఎస్ఎల్వి-ఎఫ్15ను శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించారు. నావిక్ ఉపగ్రహం ఎన్ఒఎస్02ని నిర్ణీత కక్ష్యలో ఆ రాకెట్ చేర్చగలిగింది. అయితే తర్వాత ఉపగ్రహం సాంకేతిక లోపానికి గురయింది. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇస్రో అధికారికంగా వెల్లడించలేదు. పిఎస్ఎల్వి-సి61 రాకెట్ మూడో దశలోనే దారి మళ్లడం కూడా ఇస్రో ఛైర్మన్ నారాయణన్, శాస్త్రవేత్తలను బాధిస్తోంది. వి.నారాయణన్‌కు ఛైర్మన్ హోదా రాకముందే ఎంతో అనుభవం ఉంది. దేశంలోని వివిధ ఇస్రో ప్రాజెక్టుల్లో పని చేసి ఎన్నో మెళకువలు తెలుసుకుని ఉన్నారు. ఆదివారం ప్రయోగ వైఫల్యం తర్వాత ఛైర్మన్ నారాయణన్ మొహం చిన్నబోయింది. అయితే ఇటువంటిపరిస్థితుల్లో రెండుసార్లు ఆయన మాట్లాడారు.ఒకసారి మీడియా ముందుకు వచ్చారు. మన శాస్త్రవేత్తలు ఇఒఎస్ 09 కన్నా ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మరో ఉపగ్రహాన్ని అతిత్వరలోనేరూపొందించి ఈసారి గురితప్పకుండా సక్సెస్ సాధించాలని దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

## నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

**కుప్పం, మే 18 ప్రభాతవార్త:** ఆటలాడుకునేందుకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురం లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన సుమతి,రాజా దంపతుల కుమార్తె షాలిని (6), వరలక్ష్మి,తిరుపతిల కుమార్తె గౌతమి (7) , యశోద, శరవణన్‌ల కుమారుడు అశ్విన్ (6)లు ఆదివారం తమ ఇళ్ల సమీపంలో ఉన్న చర్చి వద్దకు ఆడుకునేందుకు వచ్చారు. అక్కడే ఆటలాడుకుంటూ చర్చి సమీపంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. స్థానికులు గమనించి హుటాహుటిన నీటి గుంతలో పడిన చిన్నారులను పైకి తేగా అప్పటికే వారు మృతి చెంది ఉన్నారు. కాగా ఈ విషాద సంఘటనపై ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సిఎం ఆదేశాలతో ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల వంతున అందించాలని జిల్లా కలెక్టర్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌లకు ఆదేశించారు.

## విద్యార్థిపై దాడిని ఖండించిన జగన్

**విజయవాడ,మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని వైకాంగ్రెస్‌అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దళితులు,బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని మండిపడ్డారు. ఈమేరకు సోషల్‌మీడియాలో స్పందించారు.

## అగ్ని ప్రమాద ఘటన దిగ్భ్రాంతికరం: డి.సిఎం పవన్

**విజయవాడ.మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ పాత బస్తీలోని గుల్జార్ హౌస్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ దుర్ఘటనలో 16 మంది దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదన చెందాను. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. క్షత గాత్రులకి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నీరజ్‌చోప్రా విజయం దేశానికి గర్వకారణం: సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** దోహా డైమండ్ లీగ్-2025లో భారత జావెలిన్ త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా బల్లేన్ని 90.23 మీటర్ల దూరం విసిరి మరోసారి చరిత్ర సృష్టించాడని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఆయన సాధించిన విజయం దేశానికి గర్వకారణమని ఎక్స్ వేదికగా అభినందించారు. ఈ ఘట్టం దేశంలో పెరుగుతున్న క్రీడా ఆకాంక్షకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. నీరజ్ చోప్రా తన ఉత్తమ ప్రదర్శనతో నవభారత స్ఫూర్తిని ప్రతిబింబించారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ధైర్యంగా సంకల్పంతో ప్రపంచాన్ని అధిగమించేం దుకు సిద్ధం అని ఈ ఘనత దేశానికి గర్వకారణమని ఎక్స్ వేదికగా అభినందించారు.

## అమరావతిలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రఖ్యాత నేత్ర వైద్య,పరిశోధనాలయం ఎల్.వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఏపీలో పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నది. రాజధాని అమరావతిలో త్వరలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మా ణం జరగనుంది. రాయపూడి నుంచి దొండ పాడు వెళ్లే మార్గంలో సీడ్ యాక్సెస్ రహదారికి పక్కన ఈ సంస్థకు కూటమి ప్రభుత్వం 12 ఎకరాల భూమి కేటాయించింది. కొన్ని రోజుల్లో భూమిపూజ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.


## విద్యుత్ అంతరాయాలపై స్పందించాలి: సిఎస్

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** గాలివానలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన వెంటనే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు.ముందస్తు సన్నద్ధతపై డిస్కంలు సీఎండీలు,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

### జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరికలతో

## శ్రీశైలం రక్షణ పనులకు రూ.25.65కోట్లతో టెండర్లు

### కుడి, ఎడమ కొండ గట్టులకు 'షాట్ క్రీటింగ్'



**రాజంపేట అర్బన్, మే 18, ప్రభాతవార్త:** జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటి(ఎన్‌డిఎస్ఎ) హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ పనులపై దృష్టి సారించింది. శ్రీశైలం ప్రాజెక్టు సమగ్రతకే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించిన తర్వాత జలవనరుల శాఖ స్పందించి వెంటనే రక్షణ పనులు ఈ సీజన్లోనే చేపట్టేందుకు 25.65కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. దీంతో శనివారం రక్షణ పనులు చేపట్టేందుకు టెండర్ ఉత్వర్వులు జారీ అయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్దఎత్తున వరద ఉధృతి ఏటా పెరుగుతుండటంతో డ్యామ్ రక్షణకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి అనివార్యమని ఇప్పటికే నిపుణులు హెచ్చరించారు. ఈ హెచ్చరికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం డ్యాన్స్ సేఫ్టీ అథారిటికి ఓ లేఖ రాసింది. శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించి సలహాలు, నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ మేరకు ఎన్‌డిఎస్ఏ ఛైర్మెన్ అనిల్ జైన్ గత నెల 29న శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించారు. కేంద్ర జల సంఘం(సిడబ్ల్యూసి) సహాయాన్ని కూడ తీసుకొని డ్యామ్ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ఎన్డిఎస్ఏ సిఫార్సుచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దిగువ కుడిగట్టు పటిష్ఠపరిచేందుకు నిర్ణయం తీసుకుంది. అలాగే 780అడుగుల నుంచి 550అడుగుల వరకు కూడ అప్రోచ్ రోడ్డు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు 20.93కోట్లతో టెండర్లను పిలిచారు. అలాగే కుడి, ఎడమ కొండగట్టులకు 905 అడుగుల పైన గల భాగంలో షాట్ క్రీటింగ్ చేపట్టాలని కూడ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు 4.72కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఈ రెండు పనులకు టెండర్లను ఆహ్వానిస్తూ శ్రీశైలం ప్రాజెక్టు ఎస్.ఈ టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్లు దాఖలు చేసేందుకు జూన్ 2 చివరి గడువుగా పేర్కొన్నారు.

## వర్గ విభేదాలు వీడి 'మహానాడు' విజయవంతం చేయండి

### టిడిపి నాయకులతో ఇన్‌చార్జి మంత్రి సవిత



**పులివెందుల,మే18,ప్రభాతవార్త:** ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పులివెందుల నియోజక వర్గంలోని టిడిపి నాయకు లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవిత కోరారు. ఆదివారం కడపలో జరిగే మహానాడు పనులు ఏ విధంగా జరుగు తున్నాయో పరిశీలిం చడానికి వెళుతూ పట్టణంలోని టీడీపి కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మండలాల టిడిపి ఇన్చార్జిలు, నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ లో వర్గ భేదాలు పెట్టుకోకుండా కలిసికట్టుగా సభకు భారీగా తరలి వచ్చేందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో తుంగభద్ర హెచ్ ఎల్ సి కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి, హాజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, టిడిపి నాయకులు రఘునాథరెడ్డి, మద్దూరి వెంకట్రా మిరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, శివ మోహన్ రెడ్డి, నల్లారి భాస్కర్ రెడ్డి, ఆక్కుల విజయ్ కుమార్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

**మంత్రినికలిసిన బిజెపి నాయకులు:** పులివెందుల పర్యటనకు వచ్చిన ఇన్చర్జి మంత్రి సవితాను బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహణ సభ్యుడు భాను ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి పులివెందుల నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు.

## గడువులోగా గృహనిర్మాణాలను పూర్తి చేయాలి: మంత్రి పార్థసారధి



గృహనిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేయాలని,కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్దేశించిన 3 లక్షల గ్రుహాలనిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకేసారి 3 లక్షల మందికి గృహనిర్మాణాలు పూర్తీ చేసి లబ్దిదారులకు ఇంటి తాళాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం అన్నారు. ఆయన ఆదేశాలను వేగవంతగా అమలు చేద్దామన్నారు.రాష్ట్రంలో అమలు జరుగుతున్నా గృహనిర్మాణాల పనితీరు పై విజయవాడలోని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంత్రి నిర్వహించారు, జిల్లా అధికారులు అందరూ నిత్యం లే ఔట్లలో ఉండి లబ్దిదారులతో నిర్మాణాలను పూర్తీ చేయటానికి చర్యలు తీసుకోవాలని,నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.కింది స్థాయి సిబ్బందితో నిరంతరం పర్యవేక్షించాలని,ఇళ్ళ నిర్మాణాలలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక లబ్దిదర్లకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, లేఔట్లలో రహదారులు, విద్యుత్,మంచినీరు వంటి మోలిక వసతులు కల్పించటానికి చర్యలు చేపట్టాలని మంత్రి పార్ధసారధి అధికారులకు దిశా నిర్దేశం చేసేరు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల గృహనిర్మాణ శాఖ అధికారులుతో మాట్లాడి ఇల్లనిర్మాణాల పురోగతిని తెలుసుకొని,సత్వరం నిర్మాణాలు పూర్తీ చేయటానికి అవసరమైన చర్యలను మంత్రి సూచించేరు.రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గృహనిర్మాణాల అమలు జరుగుతున్న తీరును మంత్రికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.ప్రతి రోజు జిల్లా అధికారులుతో సమీక్షలు నిర్వహిస్తూ నిర్మాణాలలో వేగం పెంచుతున్నామని ఆయన మంత్రికి వివరించేరు. ఈ సమావేశంలో గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ వేణుగోపాల్,సుపరెండేంట్ ఇంజినీర్ జయరామాచారి, చీఫ్ జనరల్ మేనేజర్ అన్నపూర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

### డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆరోగ్యమంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత పచ్చదనం ఎంతో అవసరమని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం పరిశుభ్రత పచ్చదనం థీమ్‌తో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మొక్కలు నాటి మాట్లాడారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని అన్ని పోలీస్ స్టేషన్లలో నిర్వహిస్తున్నామని, మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ఐజీలు హరికృష్ణ, రవిప్రకాష్, రాజకుమారి డీఐజీలు అమ్మిరెడ్డి సెంథిల్‌కుమార్ ఫకీరప్ప, ఎస్పీలు శ్రీకాంత్ ఉమామహేశ్వర్ కమాండెంట్ నగేష్‌బాబు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాధన్ ఉపకార వేతనాలకు జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థికంగా వెనుకబడి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు కళాశాలవిద్య అభ్యసించేందుకు సహాయం చేస్తోంది.

## 125 ఆటిజం కేంద్రాల ఏర్పాటు

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 125 ఆటిజం కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సమగ్ర శిక్షా అభియాన్ చర్యలు చేపట్టింది. మున్సిపాలిటీకి ఒకటి చొప్పున ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు భవనాలు నిర్మించనున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా మిన హా మిగతా 25 జిల్లాల్లోనూ వీటిని అందు బాటులోకి తీసుకురానున్నారు.

ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.27.75 లక్షల చొప్పున ఎస్పీడీ శ్రీనివాసరావు నిధులు విడుదల చేశారు. ఈ కేంద్రాల్లో ఆటిజం విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు శిక్షణ అందిస్తారు. పిల్లలకు వచ్చే ఆరోగ్య సమస్యలు తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తారు.

## తిరుమల సమాచారం



## గరుడ వారధి నిర్వహణ 'గాలి'కొదిలేశారా!?

### రెండేళ్లనే కుంగిన వారధి

**తిరుపతి,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి విమానాశ్రయంనుండి తిరుమలకు వచ్చే యాత్రికుల సులభ ప్రయాణం కోసం ఇతర ప్రాంతాల నుండి తిరుపతికి చేరుకునే ప్రయాణీకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో రెండేళ్ళ క్రిందట అందుబాటులోకి వచ్చిన గరుఢవారధి నిర్వహణ "గాలి"కొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారధిపై డివైడర్లు కళావిహీనంగా మారడం, వారధి రోడ్డు పాక్షికంగా దెబ్బతినడం నిర్వహణాలోపం, పర్యవేక్షణా రాహిత్యమేనని తిరుపతి ప్రజా సంఘాలు, భక్తులు ఆరోపి స్తున్నారు. గరుఢ వారదిపై లీలామహల్‌కూడలి దాటిన తరువాత ఎలివేటెడ్ కారిడార్ సమీపంలో రోడ్డు బాగా దెబ్బతింది. దీన్ని వారంరోజులుగా మరమ్మతులు చేయడానికి శ్రమిస్తున్నారు. అయినా కుంగినరోడ్డును బాగుచేయడం ఆప్కాన్స్ సంస్థ నిర్వాహకులు కూడా తలపట్టుకుంటున్నారు. తిరుపతినగరంలో ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు వీలుగా 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధంచేసి గరుఢవారధి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సుమారు 694కోట్ల రూపాయలు నిదులతో టిటిడి, రాష్ట్రప్రభుత్వం స్మార్ట్‌సిటీ నుండి నిధులు విడుదల చేయడం జరిగింది. వారధి నిర్మాణంలో 90కోట్ల రూపాయలు స్మార్ట్‌స్ట్రీట్స్, కాలువల నిర్మాణం కోసం కేటాయించారు. పద్మావతిపురం నుండి కపిలతీర్థంరోడ్డులో శ్రీవారిసన్నిధివరకు,ఇటు కరకంబాడి మార్గంలో లెప్రసీ ఆస్పత్రి నుండి కపిలతీర్థం వరకు వారధి నిర్మాణం జరిగింది. ఈ వారదినిర్వహణ ఐదేళ్ళ వరకు 25కోట్ల రూపాయలతో ఆప్కాన్స్ సంస్థకు అప్పగించారు. ఇప్పుడు వర్షాలు పడితే తిరుపతి నగరంలోని గరుడవారధి క్రిందప్రాంతాలు పూర్తిగా జలమయంగా మారుతున్నాయి. చెరువులను తలపిస్తున్నాయి. వారధిపై వాతావరణ మార్పులకనుగుణంగా వర్షాలు పడినప్పుడు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరగకుండా మార్పులుచేసి మరమ్మతులు చేయాలి. అయితే ఇవేమీ పట్టించుకోకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వారధిపై రోడ్డుదెబ్బతింది. కుంగిపోయేలా ఇనుపరాడ్‌లు పైకొచ్చేశాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు చేయాలంటే భయపడుతున్నారు. ముఖ్యంగా తిరుమలకువెళ్ళే, చిత్తూరువైపు వెళ్ళే ఆర్టీసి బస్సులు గరుఢవారధిపైనే రాకపోకలు సాగిస్తు న్నాయి. మరీ ఈ వారధి నిర్వహణ గాలికోది లేశారని బిజెపి నాయకుడు నవీన్‌కుమా ర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాక స్మార్ట్‌సిటీ, వారధి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం ఐఎస్ఒ ప్రమాణాలకనుగుణంగా ప్రమాదాలు జరగకుండా నిర్వహణ చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు.



## భక్తులకు ఐఫోన్ అప్పగింత

**తిరుమల,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనం కోసం వచ్చిన ఓ భక్తుల కుటుంబం యాత్రికుల వసతిసముదాయం అన్నప్రసాదం హాల్‌లో వదలివెళ్ళిన లక్షరూపాయలు విలువైన ఐఫోన్‌ను సిబ్బంది తిరిగి భక్తులకు అప్పగించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన డి.ధనవర్ష కుటుంబంతో శనివారం రాత్రి తిరుమలకు వచ్చారు. యాత్రికుల విశ్రాంతిసముదాయం -4లో లాకర్‌నుపొందారు. రాత్రి అన్నప్రసాదహాల్‌లో భోజనం చేసి లక్ష రూపాయలు విలువైన ఐఫోన్‌ను వదలివెళ్ళారు. ఆ తరువాత శుభ్రపరిచేసమయంలో ఫోన్‌ను గుర్తించిన సిబ్బంది ఉద్యోగి షణ్ముఖ పృధ్వీరాజ్‌కు శ్రీవారిసేవకులు అప్పగించారు. ఆ ఫోన్‌ను ప్రసారమాధ్యమాల ద్వారా తెలియజేసి సంబంధిత భక్తులకు అందజేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. సిబ్బంది నిజాయితీని అభినందించారు.



## భారతదేశం శక్తివంతమైన దేశమే

### ప్రధాని మోడీ నాయకత్వంలో పురోభివృద్ధి: కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

**తిరుమల,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** దేశానికి సమర్థవంతమైన నాయకుడు ప్రధానిగా నరేంద్రమోదీ పాలనలో దేశం శక్తివంతంగా ఎదిగిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. మోదీ నాయకత్వంలో అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధించిందన్నారు. పాకిస్తాన్‌పై యుద్దంలో భారత్ సైన్యం ధీటుగా ఎదుర్కొని సమాధానం చెప్పడం మోదీ పాలనకారణ మన్నారు. సైన్యానికి పూర్తిస్వేచ్ఛ, ఆర్థిక వనరులు సమకూర్చడం వంటివి ఆత్మస్థైర్యం కలిగించిందన్నారు. ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా అడుగులువేస్తోందన్నారు. ఇందుకు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు . ఆయనతోబాటు టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ శ్రీవారి దర్శనం చేయించారు.ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రూ.500కోట్లతో పది అంతస్తులతో అధునాతన ఆర్టీసి బస్టాండ్ టెర్మినల్

### తిరుపతిలో పాతబస్టాండు స్థానంలోనే ఇంటిగ్రేటెడ్ భవనం

**తిరుపతి,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** కొన్ని దశాబ్దాల క్రిందట అప్పటి తిరుమల యాత్రికుల అవసరాలకు అనుగుణంగా తిరుపతినగరంలో నిర్మితమైన సెంట్రల్ ఆర్టీసి బస్టాండు ఇప్పటి భక్తుల రద్దీకి ,విపరీతంగా పెరిగిన ప్రయాణీల సేవలకు తగ్గట్లు లేకపోవడంతో అధునాతన నూతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు టర్మినల్ నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదిసంవత్స రాల క్రిందట ప్రతిపాదనలు ఇప్పుడు అమలులోకి వస్తుండటంతో సుమారు 500 కోట్ల రూపాయలు వ్యయంతో గ్రౌండ్‌ఫ్లోర్‌తోబాటు 10 అంతస్థులతో తిరుమల ఆలయ నమూనా తరహాలో ఈ ఆర్టీసి బస్టాండు ఇంటిగ్రేటెడ్ టర్మినల్ నిర్మాణం చేయాలని ఆమోదించారు. తిరుపతి స్మార్ట్‌సిటీ,అంతర్జాతీయఖ్యాత ఉట్టిపడేలా అధునాతనంగా బస్‌స్టేషన్ నిర్మాణం పనులు మొదలుకానున్నాయి. ప్రస్తుతం 60వేలమంది ప్రయాణీకులతో ,50వేలమంది వరకు యాత్రికులతో నిత్యం రద్దీగా ఉండే తిరుపతి సెంట్రల్ బస్టాండు (ఏడుకొండలు బస్టాండ్, శ్రీహరిబస్టాండు, శ్రీనివాసాబస్టాండ్) నుండి తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసిబస్సులతో బాటు తమిళనాడు, కర్నాటక ,పాండిచ్చేరి రాష్ట్రాల ఆర్టీసి బస్సులు తిరుపతికి వస్తున్నాయి. ఇక్కడకు వస్తున్న ప్రయాణీకుల సౌకర్యంతోబాటు అన్ని రకాల వాణిజ్యసముదాయాలకు నిలయంగా ఇంటిగ్రేటెడ్ బస్‌స్టేషన్ అభివృద్ధి చేసేందుకు డిపిఆర్ సిద్ధమైంది. బస్‌టర్మినల్ నుండి కూతవేటు దూరంలో ఉన్న రైల్వేస్టేషన్‌కు స్కైవే ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుకానుంది. 13ఎకరాల్లో ఉన్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రస్తుతం 70వరకు ప్లాట్‌ఫామ్‌లతో గ్రామీణ ప్రాంతా లకు వెళ్లే బస్సుసర్వీసులతో నిండిపోతోంది. ఈ బస్‌స్టేషన్ నుండి తిరుమలకు నేరుగా రోడ్డుసౌకర్యం ఉంది. తిరుపతి విమానాశ్రయంకు కూడా నూతన ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. ఈ నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా చేపట్టనుంది. నూతన టర్మినల్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అన్ని ప్రాంతాలకు వెళ్ళే బస్సుప్లాట్‌ఫామ్‌లు, మొదటి అంతస్థుల నుండి ప్రయాణీకులకు సదుపాయాలు, వాణిజ్యసముదాయాలు, హోటళ్ళు, ఆర్టీసి కార్యాలయాలు, డార్మిటరీలు, డ్రైవర్ల విశ్రాంతి గదులు, ప్రవేశ,నిష్క్రమణ ద్వారాలు ఉంటాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 3లక్షలమంది వరకు ప్రయాణీలకు సరిపోయేలా ,మరో నాలుగు దశాబ్దాల వరకు ఇబ్బంది లేకుండా ఈ అధునాతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం ఇతరరాష్ట్రాల నుండి బస్టాండుకు వస్తున్న ఆర్టీసి బస్సులతోబాటు తిరుపతి, చిత్తూరు, నెల్లూరుజిల్లాల నుండి వచ్చే గ్రామీణ ప్రాం తాల ఆర్టీసి బస్సులను తాత్కాలిక బస్టాండులు మంగళం, బైరాగిపట్టెడ, తిరుచానూరుసమీపం,మూవడమైలు ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని నిర్ణయిస్తున్నారు.ఈ స్థలాలను ఇప్పటికే ఆర్టీసి ఉన్నతాధికారులు పరిశీలించారు.



మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మనకున్నప్పుడు, అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

-ఫిలిప్‌మాసింగర్

# మాటలతో ధరలు తగ్గవు!

పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, నల్లబజారు వ్యాపారులపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామంటూ ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్న పాలకుల తీరును చూసి సామాన్యులు సైత్యం ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పుడే కాదు అధికారంలో అటు కేంద్రంలో కానీ, ఇటు రాష్ట్రాల్లో కానీ ఏ పార్టీ ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసేవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదిరించడం ఒక రివాజుగా మారిపోయింది. ఈ విషయంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా అక్రమార్కులు గడగడలాడిన సందర్భాలున్నాయి. రానురాను పరిస్థితులు మారిపోతున్నాయి. గతంలో ఉన్న భయభక్తులు నేడు కన్పించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరుపెద్దలు అక్రమ వ్యాపారులతో మమేకం కావడమే. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలానే రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత ఉందని చెప్పకతప్పదు. కొందరు బడా వ్యాపారులతో రాజకీయ నాయకులకు అవినాభావ సందర్భాలు ఏర్పడుతున్నాయి. మొత్తం ఈ భారమంతా ప్రజలు భరించక తప్పడం లేదు. దీంతో ఎన్ని కేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు చేసినా ఇవన్నీ తమను ఏమీ చేయలేవనే ధీమా అక్రమ వ్యాపారుల్లో పెరిగిపోయింది. ధరలు పెరగడానికి కారణాల్లో ఇదొకటి. ద్రవ్యోల్బణంతోపాటు మార్కెట్ మాయాజాలం, జిఎస్టీ విధానం అన్నీ కలిపి సామాన్యులు అందుకోలేనంతపైకి ధరలు పెరిగిపోతున్నాయి. మరొకపక్క సరుకులు రహస్యంగా నిల్వ చేసి కృత్రిమకొరత సృష్టించి ఇష్టానుసారంగా పెంచడం పరిపాటిగా వస్తున్నది. రైతుల వద్ద ఉత్పత్తులు ఉన్నప్పుడు ధరలు పెరగడం అటుంచి తగ్గించే ప్రయత్నం చేస్తారు. రైతులు అందరూ తమ సరుకులనుఅమ్ముకున్న తర్వాత ధరలను పెంచే కార్యక్రమం ఆరంభమవుతుంది. కొరత ఎంతగా సృష్టించగలిగితే అంతగా ధరలు పెంచుకోగలుగుతున్నారు. బియ్యం, నూనెలతోపాటు, ఉప్పు, పప్పు ఒకటేమిటి ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులన్నీ పెరిగిపోతున్నాయి. ఈరోజు ఉన్న ధర రేపు ఉండడం లేదు. కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. దేశవ్యాప్తంగా చూసినా కూరగాయల సాగు తగ్గిపోతున్నదేమోననిపిస్తున్నది. కూరగాయాలను ఉద్యానం పంటల జాబితాలో చేర్చారు. అనేక రాష్ట్రాల్లో ఉద్యానశాఖకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. వ్యవసాయశాఖకు తొంభై శాతం నిధులిస్తూ కూరగాయలను విస్మరిస్తున్నారు. ఈ పంటలు సాగు చేసే రైతులకు కనీసం విత్తనాల ధరల్లో రాయితీ కోసం ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయడంలో కూడా శ్రద్ధ తీసుకోవడం లేదు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) పథకం కింద కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. ఇవి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలంటే నలభై శాతం వాటా నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ఆ నిధులు ఇవ్వలేక తెలుగు రాష్ట్రాల్లో ఆ పథకం కింద విత్తనాలకు రాయితీ ఇవ్వడానికి మంగళం పాడారు. ఇక దేశంలోని అనేక ప్రధాన నగరాలకు, పట్టణాలకు చివరకు మండల కేంద్రాలకు కూడా చుట్టూ కిలో మీటర్లలో ఉన్న భూములు స్థిరాస్థి ప్లాట్లుగా మారి బీడ్లు పడ్డాయి. దీంతో కూరగాయలు పండించేందుకు దూరంగా ఉన్న భూముల్లోకి పోవాల్సి వస్తున్నది. డీజిల్, పెట్రోలు, హమాలీ, మార్కెట్ రుసుములు, కమిషన్‌లు చేరి కూరగాయల ధరలను మండిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వినియోగానికి, ఉత్పత్తికి వ్యత్యాసం పెరిగిపోతున్నది. అందుకే కూరగాయల ధరలను అదుపు చేసేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. వీటిని నియంత్రించేందుకు గతంలో ఏర్పాటు చేసిన రైతుబజార్లు కూడా దళారుల ఆధీనంలోకి పోయాయి. మొత్తంమీద అటు కూరగాయాలు, ఇటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇందువల్ల ఉన్నడబ్బును ఎలా ఖర్చు పెట్టుకోవాలో తెలియని నల్లధనస్వాములకు ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వీటన్నింటికితోడు మార్కెట్ మాయాజాలంతో ధరలు అదుపు తప్పుతున్నాయి. వ్యాపారులు లాభాల కోసమే ఈ వ్యాపారం చేస్తున్నారనేది వాస్తవం. అలాగే కమిషన్ల కోసమే దళారుల వ్యవస్థ ఉన్నదనేది కూడా నిజం. అలా వారు వ్యవహరించడాన్ని తప్పుపట్టలేం. కానీ నెలనెలా వేలాదిరూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనాన్ని తీసుకుంటున్న అధికారగణం ఏం చేస్తున్నది? ధరలు అదుపు తప్పుతున్నప్పుడు ప్రభుత్వ జోక్యం చేసుకొని ఇతరప్రాంతాల నుంచి సరుకులు తెప్పించి వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చి ధరలు నియం త్రించే ప్రయత్నాలు జరిగేవి. ఇప్పుడు అలాంటివేవీ ఉండడం లేదు. అంతేకాదు గతంలో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ధరలు ఒక్కసారిగా ఆకా శాన్ని అంటితే రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో దాడులు నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువైన అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ మార్కెట్లోకి రావడంతో ధరలు దిగివచ్చాయి. పాలకులు ఇప్పటికైనా శ్రద్ధతీసుకోవాలి. ఇలానే నిర్లక్ష్యంచేస్తే ఎన్నిసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగులకు జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రావు.

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

# న్యాయస్థానాల వికేంద్రీకరణ అవసరమే!

**విశాఖపట్టణం అన్ని సదుపాయాలతో అలరారుతున్న అద్భుతనగరం. అక్కడ హైకోర్టు బెంచి నెలకొల్పబడటం కూడా అందరూ అభిలషిందగ్గ విషయమే. యుపిలో అలహాబాదులో హైకోర్టుతో పాటు లక్నోలో మహారాష్ట్రలో ఔరంగాబాదు, నాగపూర్‌లో హైకోర్టు బెంచిలు ఉన్నాయి. ఇలా పనిఒత్తిడితో న్యాయం సామాన్యుడికి అందుబాటులో ఉండటం కోసం చాలా రాష్ట్రాలలో హైకోర్టు బెంచిల డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో న్యాయస్థానాలు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే వికేంద్రీకరణ అన్ని రంగాలలో జరుగుతున్నదన్న నైతిక బలాన్ని సమన్యాయాన్ని అందుబాటులోకి తెచ్చిన భావన కలుగుతుంది. ప్రధాని మోడీ అన్ని వ్యవస్థలను బలోపేతం చేసినట్లే హైకోర్టు బెంచీల అవశ్యకతను గుర్తించి న్యాయ వ్యవస్థను కూడా బలపర్చాలి. ప్రస్తుతానికి ఎపిలో హైకోర్టు బెంచి కర్నూలులో రావటం ఖాయమని అనిపిస్తున్నది.**



రావులపాటి సీతారాంరావు

కొన్నాళ్ల క్రిందటి వరకూ ఒక సామెత లాంటిది ప్రజల నోళ్లల్లో నానుతుండేది. మహమ్మద్ మౌంటెన్ దగ్గరకు పోకపోతే, మౌంటెనే మహమ్మద్ దగ్గరకు వస్తుందనే అతిశయంతో కూడిన మాట వాడుకలోఉండేది. పోలిక సరిగ్గా ఉంచకపోవచ్చు. కానీ ప్రజాస్వామ్యం ద్వారానే పాలనసాగాలనుకున్న దేశాలలో ప్రజలచేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలే ప్రజల వాకిట ఉండి పాలన సాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండక తప్పదు. ప్రభుత్వం అనేది ఒక విధంగా మేరు పర్వతంలాంటిదే. అక్కడికి చేరుకోవటం సామాన్యుడికి సాధ్యపడకపోవచ్చు. అయినాసరే 'గవర్నమెంట్ ఎట్ యువర్ డోర్ స్టెప్' అన్న భావనకు న్యాయం జరుగుతున్నదని ప్రజలు భావించిన నాడు ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ బాధ్యత ప్రజలు ఏర్పరుచుకున్న లక్ష్యం నెరవేరినట్లే అని అనుకోక తప్పదు. ప్రభుత్వానికి ముఖ్యమైన అంగం న్యాయవ్యవస్థ. మిగతా రెండు అంగాలూ పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ తమ విధులను సంతృప్తికరంగా నిర్వహించిననాడు ఆదేశంలో ప్రజలు ఎప్పుడూ ప్రజాస్వామ్యాన్నే కోరుకుంటారు. ఈ మధ్యకాలంలో పాలనా ఫలం చిట్టచివరి పౌరుడికి కూడా చేరాలనే అభిలాష విజ్ఞులూ రాజకీయులూ, అధికారులే కాదు ప్రజలు కూడా మనసా వాచా వాంఛిస్తున్నారు. దానికి అనుగుణంగానే డివిజన్ ఆఫ్‌పవర్స్ చేపట్టేనే పాలన ఫలవంతంగా మారుతుందని ఏకాభిప్రాయంగా అందరి నోటా వినపడుతున్నది. న్యాయవ్యవస్థను కూడా ప్రజలకు చేరువగా తీసుకొనిపోవటం ద్వారా న్యాయపాలన అందుబాటులో తెచ్చినట్లవుతుందని న్యాయం అందరికీ అందే విధంగా ఉంటుందని ప్రభుత్వాలు చాలా కాలం నుంచి ప్రణాళికలు ఈమార్గంలో రచిస్తున్నాయి. మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో హైకోర్టు (రాష్ట్రంలోని ఉన్నత న్యాయస్థానం) బెంచీలు ఒకటి, రెండు ప్రాంతాలలో ఏర్పాటు చేసి న్యాయం సత్వరం అందేలా రాజధానికి రానవసరం లేకుండానే ఉన్నత న్యాయస్థానపు వ్యవస్థను దగ్గరకు తెచ్చి, ప్రజలకు న్యాయం చేస్తున్నది. తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో దాదాపు అన్ని జిల్లాల ప్రజలు మూడు గంటలలోనే (హైదరాబాద్) రాజధానికి వచ్చి ఉన్నత న్యాయస్థానంలో న్యాయ సంబంధిత విషయాలు తేల్చుకోవడానికి వెసులుబాటు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతిలోని హైకోర్టుకు లిటిగేషన్ల సందర్భంగా ఇతర జిల్లాల నుంచి లాయర్లు, ప్రజలు రావడానికి దూరాల వల్ల ఎక్కువ కాలం ప్రయాణాల్లోనే ఉండాల్సి వస్తుంది. ముఖ్యంగా రాయలసీమలో హైకోర్టు బెంచి ఒకటి ఏర్పాటు చేయాలని ఎంతో కాలం నుంచి ఉన్న డిమాండ్‌ను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వేగిరం తీర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలుపుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ కర్నూలులో హైకోర్టు బెంచిని ఏర్పాటు చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. సంబంధిత కార్యక్రమాలు కూడా వేగిరం జరుగుతాయన్న ఆశ రాయలసీమ ప్రజలకు ఏర్పడింది. కర్నూలులో ఏర్పడబోతున్న హైకోర్టు బెంచి వల్ల న్యాయపాలన వికేంద్రీకరించబోతున్నది. రాష్ట్ర హైకోర్టు పరిధిలోని



కేసుల్లో దాదాపు 33 శాతం రాయలసీమకు చెందినవే. హైకోర్టు మొత్తం అమరావతి నుంచి కర్నూలుకు తరలించడం కంటే హైకోర్టు బెంచి కర్నూలుతో ఏర్పాటు చేయడం తేలిక అని అందరూ ఒప్పుకుంటున్నారు. ఇంతకు మునుపు హైకోర్టులోని కొన్ని రాయలసీమ కేసులను వర్చువల్ విధానం ద్వారా పరిష్కరించే ఏర్పాటు చేసినప్పటికిని, రాయలసీమ జిల్లాల నుంచి లాయర్లు ఎనిమిది, తొమ్మిది గంటలు ప్రయాణం చేసి హైకోర్టులో మాండేటరీ పిటిషన్లు, రెగ్యులర్ అప్పీళ్లు వేయాల్సిన పరిస్థితి. బెంచి ఏర్పడితే రాయలసీమలోని నాలుగు జిల్లాలనుంచి పిటిషన్‌దారులు కర్నూలు కొచ్చి న్యాయ వ్యవహారాలు చూసుకొనే వెసులుబాటుతో పాటు అమరావతి దాకా దూరప్రయాణం చేసే పరిస్థితి తప్పుతుంది. కొందరు లాయర్లు హైకోర్టు బెంచి రాయలసీమకు చెందిన కర్నూలులో ఉండటం వల్ల మరికొన్ని లాభాలు కూడా చెప్పారు. సర్వీసు లిటిగేషన్లు, లేబర్ చట్టాలు లాంటివి కూడా న్యాయవ్యవస్థ తీర్పులకు లోబడి ఉంటాయి. కాబట్టి వాటికి సంబంధించిన కార్యాలయాలు, మరికొన్ని సంబంధిత ప్రభుత్వ సంస్థలు కూడా కర్నూలు తరలిరాక తప్పదు. వాణిజ్య సముదాయాలు కూడా కర్నూలు పట్టణంలో చోటు చేసుకుంటాయి. హైదరాబాద్‌కు కర్నూలు దగ్గరగా ఉండటం వల్ల రోడ్డు, రైళ్లు, విమాన సర్వీసు కనెక్టివిటీ కూడా బాగా కలిసివస్తుంది. నల్లమల అడవులతోపాటు శ్రీశైలం, మంత్రాలయం లాంటి పేరుగాంచిన దేవాలయాలను మరింత ఎక్కువగా దర్శించే భక్తులు, పర్యాటకులూ ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో టూరిజం ఆర్థిక పరిశ్రమగా నిలదొక్కుకునే అవకాశాలు ఉన్నాయి. విశాఖ పట్టణంలో హైకోర్టు బెంచి కావాలని 1993 నుంచి అక్కడి లాయర్లు, ప్రజలు డిమాండ్ చేయడమే కాదు ఆందోళనలు కూడా చేసిన దాఖలాలు ఉన్నాయి. అయితేఅప్పుడు కోస్టల్ జిల్లాలకు రాజధాని హైదరాబాద్ దూరంగా ఉండటం చేత ఆ డిమాండ్ ఆరోజులలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా, కర్నూలుతోబాటు మరో హైకోర్టు బెంచి విశాఖపట్నంలో ఉండటం న్యాయమైన డిమాండ్ అని అనేక కారణాలు డిమాండ్‌కు అనుకూలంగా లేవనెత్తే వారిసంఖ్య పెరుగుతున్నది కూడా. విశాఖలో అనేక విద్యాసంస్థలు ఉన్నాయి. దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీతో పాటు, ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజీ, గీతం లాస్కూల్, లాంటివి అందులో కొన్నిగా చెప్పుకోవచ్చు. అయితే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశం మరొకటి ఉంది. విశాఖబార్ అసోసియేషన్‌లో 5000 మందికిపైగా అడ్వకేట్లు ఉన్నారు. అందులో 1,200 మంది మహిళా లాయర్లు కూడా ఉండటం విశేషం. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను కూడా తప్పకుండా పరిశీలించే విధంగా పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విశాఖపట్టణం అన్ని సదుపాయాలతో అలరారుతున్న అద్భుతనగరం. అక్కడ హైకోర్టు బెంచి నెలకొల్పబడటం కూడా అందరూ అభిలషిందగ్గ విషయమే. యుపిలో అలహాబాదులో హైకోర్టుతోపాటు లక్నోలో మహారాష్ట్రలో ఔరంగాబాదు, నాగపూర్‌లో హైకోర్టు బెంచిలు ఉన్నాయి. ఇలా పనిఒత్తిడితో న్యాయం సామాన్యుడికి అందుబాటులో ఉండటంకోసం చాలా రాష్ట్రాలలో హైకోర్టు బెంచిల డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో న్యాయస్థానాలు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే వికేంద్రీకరణ అన్ని రంగాలలో జరుగుతున్నదన్న నైతిక బలాన్ని సమన్యాయాన్ని అందుబాటులోకి తెచ్చిన భావన కలుగుతుంది. ప్రధాని మోడీ అన్ని వ్యవస్థలను బలోపేతం చేసినట్లే హైకోర్టు బెంచీల అవశ్యకతను గుర్తించి న్యాయ వ్యవస్థను కూడా బలపర్చాలి. ప్రస్తుతానికి ఎపిలో హైకోర్టు బెంచి కర్నూలులో రావటం ఖాయమని అనిపిస్తున్నది. ●

# రద్దీవేళ.. తొక్కిసలాటలు ఆపలేమా?

ఐ.ప్రసాద రావు

ఉత్తర ప్రదేశ్ ప్రయాగరాజ్‌లో జరిగిన కుంభమేళా సందర్భంగా ఢిల్లీ రైల్వేస్టేషన్లో జరిగిన తొక్కిసలాటలో అనేక మంది అమాయక భక్తులు మరణించడం జరిగింది. తదుపరి తిరుపతిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో, గత వారంలో సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన సందర్భంగా కొందరు భక్తులు మరణించడం జరిగింది. అంతే కాకుండా, శనివారం గోవాలో శ్రీ లరాయ్ మాత ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో కొందరు భక్తులు మరణించడం జరిగింది. ఇలా వరుసగా వివిధ దేవాలయాలకు వెళ్లిన భక్తులు అకాలంగా మరణించడం చాలా బాధాకరం. దీనికి కారణం కొంతమేరకు భక్తుల తొందరపాటు కారణం అయితే, ఎక్కువగా ప్రభుత్వాలు, దేవస్థాన కమిటీలు తీసుకుంటున్న చర్యల్లో సమతౌల్యం లోపించడం అని తేటతెల్లం అవుతుంది. ముఖ్యంగా రైల్లో సీట్లకు మించి టికెట్లు తీసుకుని (టిక్కెట్లు ఎలా ఇస్తున్నారో) వివిధ రైల్లో ప్రయాణాలు ప్రజలు ఎలా ప్రయాణం చేస్తున్నారో, కొన్ని సందర్భాల్లో ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారో... అదే పద్ధతిలో దైవ దర్శనాలకు కూడా ముఖ్యంగా కొన్ని ప్రత్యేక పండుగ, జాతర సందర్భాల్లో ఎక్కువ మంది దేవాలయాలకు రావడంతో అదుపుతప్పి తొక్కిసలాటలు సంభవించడం, కొందరు భక్తులు ప్రాణాలు కోల్పోవడం మరికొందరు గాయాలు పాలవడం పరిపాటిగా మారుతుంది. మన దేశంలో నేటికీ అనేక దేవాలయాలు పురాతన కాలంలో నిర్మించినవి కావడంతో ప్రాకారాలు, పై గోడలు, ఇరుకు దైవ దర్శనాల మార్గాలుగా ఉండటంతో పలుమార్లు తొక్కిసలాట జరుగుతుంది. అంచనాలకు మించి ఒకో సందర్భంలో భక్తులు చేరటంతో తగినన్ని సౌకర్యాలు



కల్పించడంలో ప్రభుత్వాలు దేవస్థాన కమిటీలు, బందోబస్తు ఫెయిల్ అవుతున్నారు. ఇదే సమయంలో భక్తులు కూడా ఆచితూచి దైవదర్శనాలకు వెళ్లటం శ్రయోష్కరం. వృద్ధులు, దివ్యాంగులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. మనదేశంలో నేటికీ చాలా దేవాలయాలు చాలా పురాతనమైనవి. మరమ్మతులు చేయవలసి ఉంది. ఆధునీకరణ చేయాలి. అదే సందర్భంలో నేడు పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ద్వారాలు, మార్గాలు సంబంధిత పండితుల సలహా మేరకు విశాలపరచాలి. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. అలాగే చాలా దేవాలయాలు పర్వతప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో, కొండల్లో నెలకొన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా రవాణా సౌకర్యాలు, దేవాలయాలకు చేరే మార్గాలు, ద్వారాలు వద్ద పగడ్బందిగా బందోబస్తు, రక్షణ కోసం చర్యలు తీసుకోవాలి. అడవి మృగాల నుంచి, విష సర్పాలనుంచి భక్తుల ప్రాణాలు కాపాడాలి. వివిధ దేవాలయాల్లో జరిగే వివిధ ప్రత్యేక పండుగలు సందర్భంగా ముందస్తు చర్యలు పగడ్బందిగా తీసుకోవాలి. తాగునీటి సౌకర్యం, రవాణా సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. దర్శన టిక్కెట్లు పారదర్శకంగా మంజూరు చేయడం తోపాటు సామర్థ్యానికి మించి మంజూరు చేయకూడదు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. శారీరక, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు మరింత మెరుగ్గా ఉంచాలి. అమాయక ప్రజల ప్రాణాలు కాపాడాలి. అదే సమయంలో భక్తులు కూడా ప్రభుత్వాలు దేవస్థాన కమిటీలు పోలీసులు జారీ చేసే సూచనలను అనుసరించాలి. మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు విడనాడాలి. పరిస్థితిని బట్టి ప్రయాణం చేయడం, దర్శనానికి వెళ్ళడం ప్రస్తుత సమయంలో అత్యావశ్యకం. ●

# డిజిటల్ ఇండియాలో మహిళా సాధికారత ఎక్కడ?

డి జె మోహన రావు

నేడు భారతదేశం సాంకేతిక యుగంలోకి శరవేగంగా దూసుకుపోతున్న వేళ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక డిజిటల్ ఇండియా కార్యక్రమం డిజిటల్ సేవలను ప్రతి పౌరుడికి అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ సాంకేతిక పురోగతి నిజమైన అభివృద్ధిని సాధించాలంటే పురుషులతో సమానంగా మహిళలు కూడా ఈ ప్రయాణంలో భాగస్వాములు కావడం అత్యంత ఆవశ్యకం. 'డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం' అనేది మనం సాధించడం అత్యంత ఆవశ్యకం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి అత్యంత కీలకమైన ఈ అంశంపై సమగ్ర గణాంకాలతో కూడిన లోతైన అవగాహన అవసరం. మన దేశంలో డిజిటల్ లింగ అంతరం వివిధ స్థాయిల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాథమిక ఇంటర్నెట్ వినియోగం నుండి అధునాతన సాంకేతిక నైపుణ్యాల వరకు మహిళలు పురుషుల కంటే వెనుకబడి ఉన్నారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ 2023గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 33శాతం మంది మహిళలు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తుండగా పురుషుల వినియోగం 57శాతంగా ఉంది. ఉపయోగించే పురుషుల్లో 71శాతం స్మార్ట్‌ఫోన్లను వాడుతుండగా, మహిళల్లో సంఖ్య కేవలం 46శాతం మాత్రమే ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఈ అంతరం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో కేవలం 28 శాతం మంది మహిళలు మాత్రమే ఇంటర్నెట్‌ను వినియోగిస్తుండగా, పురుషుల వినియోగం 53శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఈ అంతరం కాస్త తక్కువగా ఉన్నప్పటికీ 41 శాతం మంది మహిళలు, 61శాతం మంది పురుషులు ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే పూర్తి సమానత్వం ఇంకా సాధించలేదు. డిజిటల్ నైపుణ్యాల విషయానికి వస్తే ఈ అంతరం మరింత అధికంగా ఉంది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గణాంకాల ప్రకారం ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యత కలిగిన మహిళలు కేవలం 25శాతం మాత్రమే ఉండగా పురుషుల్లో ఈ సంఖ్య 48శాతంగా ఉంది. కోడింగ్ వంటి అధునాతన డిజిటల్ నైపుణ్యాల విషయానికి వస్తే మహిళల ప్రాతినిధ్యం కేవలం 10-15శాతం మధ్యే ఉంది. సాంకేతిక రంగంలోని ఉద్యోగాల్లో కూడా ఇదే అసమతుల్యత కనిపిస్తోంది. విశ్వసనీయ నివేదికల ప్రకారం భారతీయ ఐటీ, సాంకేతిక రంగంలో మహిళలు దాదాపు 34శాతం మంది ఉన్నారు. మధ్య, ఉన్నత స్థాయి నిర్వహణ స్థానాల్లో ఈ సంఖ్య మరింత తక్కువగా స్టార్టప్ వ్యవస్థాపకుల్లో మహిళల శాతం కేవలం 14శాతం మాత్రమే. డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం కేవలం సామాజిక న్యాయం మాత్రమే కాదు. ఇది భారతదేశ ఆర్థికాభివృద్ధికి గణనీయమైన ఊతమిస్తుంది. ప్రపంచ బ్యాంకు, మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థల అంచనాల ప్రకారం డిజిటల్ లింగ అంతరాన్ని తగ్గించడం ద్వారా భారతదేశ జీడీపీ 0.5శాతం నుండి 1.5శాతం వరకు పెరిగే



అవకాశం ఉంది. అంతేకాకుండా మహిళల ఉద్యోగిత రేటు పెరిగితే ఆర్థిక వృద్ధి మరింత బలపడుతుంది. డిజిటల్ నైపుణ్యాలను పొందడం ద్వారా మహిళలు ఐటీ రంగంలోనే కాకుండా ఆర్థిక సేవలు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి వివిధ రంగాల్లో కొత్త ఉద్యోగ అవకాశాలను పొందగలరు. ఈకామర్స్ వేదికలు మహిళలకు తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించడానికి, చిన్న వ్యాపారాలను స్థాపించడానికి అవకాశాలను అందిస్తాయి. తద్వారా వారి ఆర్థిక స్వావలంబన పెరుగుతుంది. మెరుగైన డిజిటల్ అక్షరాస్యత ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య సమాచారం, విద్యా వనరులకు మహిళల ప్రాప్తిని సులభతరం చేస్తుంది. తద్వారా వారి జీవన ప్రమాణాలు సమగ్రంగా మెరుగుపడతాయి. ఈ ఆందోళనకరమైన గణాంకాల వెనుక సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక అడ్డంకులు ఉన్నాయి. పేదరికం, నిరక్షరాస్యతలుఅనేక మంది మహిళలకు స్మార్ట్‌ఫోన్‌లు ఇంటర్నెట్ వంటి ప్రాథమిక డిజిటల్ సాధనాలను అందుబాటులో లేకుండా చేస్తున్నాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ సర్వే ప్రకారం అనేక గ్రామీణ గృహాల్లో డిజిటల్ పరికరాలపై మహిళలకు పరిమిత నియంత్రణ ఉంది. సాంఘిక కట్టుబాట్లు, కుటుంబ నియంత్రణలు తరచుగా మహిళలు డిజిటల్ సాంకేతికతలను స్వేచ్ఛగా ఉపయోగించకుండా అడ్డుకుంటున్నాయి. ఆన్‌లైన్ భద్రత గురించిన భయాలు, సైబర్ వేధింపుల ముప్పు వారిని డిజిటల్ ప్రపంచం నుండి దూరం చేస్తున్నాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) విద్యలో మహిళల తక్కువ ప్రాతినిధ్యం ఉన్నత స్థాయి సాంకేతిక ఉద్యోగాల్లో వారి సంఖ్య తక్కువగా ఉండటానికి ఒక ముఖ్యమైన కారణం. దీనిని ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ధృవీకరిస్తోంది. దురదృష్టవశాత్తు సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య ఆలోచనలు సాంకేతిక రంగంలో మహిళల పట్ల ఉన్న పక్షపాతాలు అన్ని స్థాయిల్లో వారి వృత్తిపరమైన ఎదుగుదలకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. ఈ సంక్లిష్ట పరిస్థితిని పరిష్కరించడానికి సమగ్రమైన, బహుళస్థాయి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం అత్యవసరం. డిజిటల్ మౌలిక సదుపాయాలు అందుబాటును మెరుగుపరచాలి. ప్రభుత్వం ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విశ్వసనీయమైన ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్‌లను విస్తరించడానికి గణనీయంగా పెట్టుబడులు పెట్టాలి. భారత్‌నెట్ వంటి కార్యక్రమాలను వేగవంతం చేయడం చాలా ముఖ్యం. మహిళలకు ప్రత్యేకంగా ప్రత్యేక రాయితీలుతో సరసమైన డేటా టారిఫ్‌లను అందించే ఏర్పాటు కల్పించాలి. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ వంటి నిధులను సమర్థవంతంగా ఉపయోగించడం కూడా కీలకం. దేశవ్యాప్తంగా మహిళల కోసం ప్రాథమిక స్థాయి నుండి అధునాతన స్థాయి వరకు ప్రత్యేక డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించాలి. నేషనల్ డిజిటల్ లిటరసీ మిషన్ వంటి కార్యక్రమాల అమలును మెరుగుపరచడం చాలా ముఖ్యం. స్థానిక భాషల్లో శిక్షణ, మహిళా శిక్షకులను నియమించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. మొబైల్ లిటరసీ వ్యాన్‌లు, కమ్యూనిటీసెంటర్ల ద్వారా శిక్షణను విస్తరించడం కూడా అవసరం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి భవిష్యత్తులో డిమాండ్ ఉండే డిజిటల్ నైపుణ్యాలపై మహిళలకు శిక్షణఇవ్వడానికి ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన వంటి పథకాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం, శిక్షణ తర్వాత ఉపాధి అవకాశాలను కల్పించడానికి కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం కూడా కీలకం. ●

# ప్రజావాక్కు



## సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి

చైనా దశాబ్దాల క్రితమే భారత్‌లోని తూర్పు భాగాన ఉన్న అరుణాచలప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 38000 చదరపు కిలోమీటర్ల స్థలాన్ని చట్టవ్యతిరేకంగా ఆక్రమించుకుని తన స్థావరాలను ఏర్పరుచుకుంది. ఆ ప్రదేశంలో గడ్డి కూడా మొలవదని మన దేశాన్ని ఏలిన నాయకులు ఆ రోజుల్లోనే నిర్లక్ష్యంగా వదలివేసారు. ఆక్రమించుకన్న ప్రదేశాలకు చైనా తమ దేశానికి చెందిన పేర్లను పెడుతోందని నిన్న మొన్నటివార్త. వెంటనే విదేశాంగ శాఖ రంగం లోకి దిగి పేర్లు పెట్టుకున్నంత మాత్రాన అవి భారత్ భూభాగానికి చెందకుండా పోతాయా అని చప్పిడి మాటలు మాట్లాడుతోంది. చైనా ఆక్రమించిన మొదట్లోనే ఎందుకు ఖండించలేదు? మళ్ళీ మొదటికొస్తే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌నూ తెలిగ్గాతీసుకుంటూ అది భారత్‌లోనిదే అంటూ కాలయాపన చేసారు. మొండివాడు రాజుకున్న బలవంతుడే నన్నసామెత మనమేపుట్టించుకున్నాము. భారత్‌తోశాంతి చర్చలకోసం ఉవ్విళ్లూరుతూ అనేక ఎత్తుగడలతో వస్తున్న పాకిస్థాన్ పిటకేను వదలి పెడుతుందా? అనుమానమే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## అక్రమ దందా

రాష్ట్రంలోమినరల్ వాటర్ పేరిటకోట్ల రూపాయల అక్రమ వ్యాపారం మూడు పూవ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. పల్లెలు, పట్టణములు, నగరాలలో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అనుమతులు లేకుండా నీళ్ల వ్యాపారం నడుస్తుంది. అధికారులు కూడా మామూళ్లకి ఆశపడి ఈ వాటర్ ప్లాంట్‌ల వైపు చూడడం లేదు. మినరల్ నీళ్లుతాగడం వల్ల కీళ్ల నొప్పులు, అనారోగ్యం బారిన పడుతున్నారు. అనుమతిలేని వాటర్ ప్లాంట్‌లను అధికారులు తక్షణమే సీజ్ చేసి ప్రజల ఆరోగ్యంని కాపాడాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

## ఆడపిల్లలు జాగ్రత్త

నేడు సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందింది. ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వాడకం అధికమైపోయింది. వీటివల్ల కొత్తస్నేహాలు, పరిచయాలు పెరిగిపోయాయి. మొదట్లో నమ్మకం కలిగించేలా ప్రవర్తిస్తూ తరువాత తమ అసలు రూపాన్ని చూపెడుతున్నారు.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

దేశంలో ఏరాష్ట్రంలో లేనటువంటి పర్యవేక్షణతెలంగాణ ముఖ్యమంత్రి విద్యాశాఖపై చూపుతున్నారని చెప్పడం లో అతిశయోక్తి లేదు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మరుక్షణం నుండి విద్యాశాఖ పై సమీక్షలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యల పై నిర్ణయం తీసుకున్నారు. 11062 టీచర్ పోస్టులు భర్తీ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష సం..లో రెండు సార్లు నిర్వహిస్తున్నారు. ప్రతి స్కూల్‌లో మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు ఇస్తున్నారు. స్కావెంజర్ల వ్యవస్థ ఏర్పాటుచేశారు. వంట పాత్రలు కొత్తవి మంజూరు చేశారు. విద్యా సంవత్సరముందే విద్యార్థులకు బుక్స్, యునిఫాం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. 25వేల మంది ఉపాధ్యాయులను కోరుకున్న చోటుకు బదిలీ చేశారు. దాదాపు 20 వేల మందికి ప్రమోషన్స్ ఇచ్చారు. ఇప్పుడు వేసవి సెలవుల్లో పాత కొత్తటీచర్లకి 5రోజుల శిక్షాణకార్యక్రమాలు నిర్వహించనున్నారు.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## పారదర్శకతతో సీటు ఇవ్వాలి

దేశంలో కొన్ని వందల విశ్వవిద్యాలయాలు ఉంటాయి. వాటి పరిధిలో వేల విద్యార్థుల వృత్తి విద్యా కోర్సులు లక్షలు ఖర్చు చేసి, శ్రమతో భవిష్యత్తు కోసం రిస్క్ తీసుకుంటారు. అది ఏ కోర్సు అయినా అభ్యర్థి ర్యాంకు, కేటగిరి ఒకటే. సదరు ప్రవేశ పరీక్షకు అన్ని కోణాల్లో స్పష్టమైన నిబంధాలు ఉంటాయి. కళాశాల ప్రవేశం సమాన ప్రతిభ ఉన్నప్పుడు, ఏ అంశం మీద ప్రాధాన్యత ఉందో తెలియపరుస్తూ అభ్యర్థికిలేక పేరెంట్‌కి అనుమానం నివృత్తి చేయడం అవసరం. అభ్యర్థులు వారికి సీటు రానందుకు కోర్టునీఆశ్రయించడం, తిరిగి యూనివర్సిటీ కోర్టుకి వెళ్ళడం, విద్యార్థికి నష్టపరిహారం ఇవ్వడం చిన్నవిషయం కాదు.

- బొల్లోజు మేఘానధ్, విశాఖపట్నం

## టేకు కర్ర తరలింపులు

వనమహోత్సవాలు ఒకపక్క జరుగుతుంటే మరొకప్రక్క అడవులలోఉన్న టేకుకర్రతో కొందరు దొంగ చాటుగా ఫర్నిచర్ కోసం బడా వ్యాపారాలు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో గంగారం కొత్త గూడా మండలాలలో ఈ వ్యాపారం ఎక్కువగా దొరుకుతుంది. అడవీ శాఖ అధికారులు ఈ ప్రాంతాలలో జరుగుతున్నఈవ్యాపారాన్ని నిలిపివేయాలి. వనసంరక్షణ జర గాలి. రాజకీయ జోక్యం అధికారుల అలసత్వం వీడాలి.

-రాపాక రవీందర్, జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## స్వామివారికి కలశ ప్రతిష్ట



**అద్దంకి, మే 18 ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగర కొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి మహా కుంభాభిషేకాన్ని పురస్కరించుకొని స్వామి వారి కలశాన్ని ఆదివారం సాయంత్రం ప్రతిష్టించారు. ఈ కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఎసి తిమ్మానాయుడు, ప్రధాన దాతలు విజయభాస్కరరెడ్డి, కోట శ్రీనివాసకుమార్, గుంజి కృష్ణారావు, కాట్రగడ్డ అనిల్ కుమార్, మేదర మెట్ల శంకరారెడ్డి, ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# నేడే సింగరకొండలో మహా కుంభాభిషేకం

- ఏర్పాట్లు పూర్తి
- క్షేత్రానికి చేరుకున్న శృంగేరి పీఠాధిపతి
- ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు రాక
- భక్తుల కొరకు అన్నదాన ఏర్పాట్లు
- అన్నీ శాఖల సమన్వయంతో సింగరకొండ సర్వసన్నద్ధం



**అద్దంకి, మే 18, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి మహా కుంభాభిషేకం సోమవారం జరగనున్నది. అందులో భాగంగా అవసరమైన ఏర్పాట్లు ఆలయ ఎసి ఎం. తిమ్మానాయుడు అన్నీ శాఖల అధికారుల తో సమన్వయం చేసుకొని ఏర్పాట్లును పూర్తి చేశారు. ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు శృంగేరి, శారదా పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి సింగరకొండ క్షేత్రానికి చేరుకున్నారు. ఆయన స్వహస్తాలతో ఈ మహా కుంభాభిషేకాన్ని సోమవారం ఉదయం 9.03 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మహా కుంభాభిషేకంలో పాల్గొనేందుకు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజ నేయస్వామితోపాటు పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, రాను న్నారు. గత 5రోజులుగా మహా కుంభాభిషేక నిర్వ హణలో భాగంగా 14వతేది నుండి సన్నాహక పూజా కార్యక్రమాల ను, రోజువారి ఆలయ ఎసి, ప్రధాన దాతలు, భక్తులతో నిర్వహిస్తున్నారు. ధ్వజస్తంభ నగరోత్సవంతో పాటు, ధ్వజస్తంభ కలశ ప్రతిష్ట, కార్యక్రమాన్ని ఇప్పటికే నిర్వహిం చారు. ఇక కుంభాభిషేకాన్ని పురస్కారించుకొని ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరుతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి సింగరకొండ క్షేత్రానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ పరిస్థితు లను దృష్టిలో పెట్టుకొని ఆలయ ఎసిస్వామివారిని దర్శించు కునేందుకు అవసరమైన ఏర్పాట్లను స్వీయ పర్యవేక్షణలో నిర్వహించారు. భక్తుల దైవదర్శన కోసం క్యూలైన్ల ఏర్పాట్లు, త్రాగునీరు, ఆల్పహారం, భోజనం తదితర సౌకర్యాలను కూడ పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. ఆలయ తరుపున సుమారు 30వేల మంది భక్తులకు అన్నదానాన్ని నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదే విధంగా సింగరకొండలోని అన్నదాన సత్రాల నిర్వహకులకు కూడ 20వేల మంది భక్తులకు అన్నదానాన్ని నిర్వహించేందుకు ఆయా సత్రాలలో ఏర్పాట్లు చేశారు. ఇక ఆలయ పరిసరాలలో విద్యుత్ దీపా లతో ఆలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన ఆలయ ప్రాంగణం, ముందు, వెలు పల భాగాలలో ప్రత్యేక పెండాల్స్ ను ఏర్పాటు చేశారు. అన్నీ శాఖల వారు సేవలు అందించేందుకు వారికి కూడ సంబంధిత సౌకర్యా లను కల్పించారు. పలు సేవా సంఘాల నుండి మహిళా భక్తులు అధిక సంఖ్యలో సేవలు అందిం చేందుకు సింగరకొండకు చేరుకు న్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల నుండి వాలంటీర్‌లు, కూడ అందు బాటులో వున్నారు. దేవాదాయ శాఖ నుండి పలువురు సిబ్బంది కూడ మహా కుంభాభిషేక సందర్భంగా విధులను నిర్వహించేందుకు అందుబాటులో వున్నారు. శృంగేరి పీఠాధిపతులు ఆదివారం రాత్రికే ఆయన సిబ్బందితో సింగరకొండకు చేరుకున్నారు. వారికి అవసరమై న అన్నీ ఏర్పాట్లను ఎసి తిమ్మానాయుడు సమకూర్చారు.



# జనరేషన్ కష్టాలు..

- ఒంగోలు రిజిష్టర్ కార్యాలయానికి తరలివచ్చిన అర్జీ దారులు
- కార్డుకు నిబంధనలు - మ్యారేజ్ సర్టిఫికేట్ తప్పనిసరి
- పిల్లాపాపలతో గంటల తరబడి నిరీక్షణ
- కార్యాలయాల్లో వసూళ్ల జాతర

**ఒంగోలు, ప్రభాతవార్త**

కొత్త రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం విధించిన నిబంధనలు ప్రజలకు గుదిబండగా మారాయి. వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ తప్పనిసరి చేయడంతో తరాలతో సంబంధం లేకుండా ఎప్పుడు పెళ్లైన వారు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు క్యూకడుతున్నారు. కొత్త కార్డుల దరఖాస్తుకు 14 రోజులు గడువు మాత్రమే మిగిలి ఉండటంతో తీవ్ర ఆందోళన చెందుతు న్నారు. కొత్తగా పెళ్లైన జంటలతో పాటు, ఇంత వరకు రేషన్ కార్డు లేని వారు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవడంతో మొదలయ్యే పక్రియ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్టిఫికేట్‌వ వచ్చే ప్రహసనంగా మారుతుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌లో లోపాల వల్ల మ్యారేజ్ సర్టిఫికేట్ కోసం వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. ఒకే సమయానికి ఎక్కువ మందికి స్లాట్ ఇవ్వడం వల్ల పిల్లాపాపలతో గంటలు తరబడి కార్యాలయాల వద్ద పడి గాపులు పడాల్సి వస్తుంది. మండే ఎండలతో నరకం చవి చూడాల్సిన దుస్థితి నెలకొంది. వాస్తవానికి ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఒక సమయానికి ఒక స్లాట్ విధానమే అమల్లో ఉంది. కానీ మ్యారేజ్ రిజిస్ట్రేషన్‌కు మాత్రం ఒక సమయానికి ఎంత మందికి కావాలంటే అంత మందికి అధికారులు స్లాట్ ఇస్తున్నారు. భార్య భర్తలు ముగ్గురు సాక్షుల ఫింగర్ ప్రింట్‌ల సేకరణ, తదితర పనుల వల్ల పక్రియ భాగా ఆలస్యం అవుతుంది. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.2500 నుంచి రూ.4వేల వరకు దరఖాస్తు దారుల నుంచి వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క రోజే ఒంగోలు రిజిష్టర్ కార్యాలయానికి సుమారు వంద మంది మ్యారేజ్ రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తులతో తరలి వచ్చారు. ఇక్కడ పని అంతా చేసేది ఒక ఉద్యోగి కావడంతో దరఖాస్తు దారులకు నిరీక్షణ తప్పలేదు. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాల్లో మ్యారేజ్ సర్టిఫికేట్ జారీ చేసే వారు. ఈ సైన్ లేకపోవడంతో పది నిమిషాల్లోనే పక్రియ పూర్తయిపోయేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో భార్య భర్తలు ముగ్గురు సాక్షులు ఈ సైన్ చేయాల్సి రావడంతో కష్టాలు తప్పడం లేదు. మ్యారేజ్ సర్టిఫికేట్ కోసం రోజు జనం పోటెత్తుడటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుంది. సిబ్బంది అంతంత మాత్రంగా ఉండటంతో మానసిక వేదనకు గురవుతున్నారు. గ్రామ సచివాలయాల్లో, రిజిష్టర్ కార్యాలయాల్లోనూ మ్యారేజ్ సర్టిఫికేట్ల జారీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు, పాత రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు, తొలగింపుల పక్రియకు సచివాలయాల్లో సర్వర్ సమస్య ప్రతిబంధకంగా తయారైంది. సాంకేతిక సమస్య లతో సర్వర్ తరచూ మొరాయిస్తుండటంతో దరఖాస్తు దారులు గంటలు తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. ముఖ్యం గా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మండల కేంద్రాల్లో ఉదయం 11గంటల నుంచి గంట పాటు మాత్రమే వెబ్‌సైట్ పని చేస్తుంది. తరువాత మొరాయిస్తుంది. దీంతో సమస్య సచివాలయాల్లో ఎక్కువగా ఉంది. ఒక పక్క చూస్తే మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌లతో రిజిష్టర్ కార్యాలయాల్లో ఆ సర్టిఫికేట్ తీసుకువచ్చి ఈకేవైసీ చేయించుకోవాలంటే సర్వర్ మొరాయిస్తుండటంతో రోజులు తరబడి ప్రజలు వేచి చూడాల్సి వస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# భారత్ దెబ్బకు చిగురుటాకులా వణికిన పాకిస్థాన్






- యుద్ధం కొనసాగితే నామరూపాలు కోల్పోతామనే పాక్ కాళ్లబేరం
- ఆపరేషన్ సింధూర్ విజయంతో హీరోగా ప్రధానమంత్రి మోదీ
- తిరంగా ర్యాలీలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య

**చీరాల, మే 18, ప్రభాతవార్త**

ఆపరేషన్ సింధూర్ విజయాన్ని కీర్తిస్తూ నిర్వహించిన ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉంది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు ఈ తిరంగా యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండ య్య ధన్యవాదాలు తెలిపారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు మతం పేరు అడిగి భార్య బిడ్డల ఎదుటి హిందువులను దారుణంగా హతమార్చారు. కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ కూడా ఉగ్ర తూటాలకు బలయ్యాడు. ప్రతి భారతీయుడి గుండె తరుక్కుపోయే ఘటన ఇది. యుద్దాలు జరుగుతుంటాయి. బాంబులు వేస్తుంటారు. కానీ మతం పేరు అడిగి ప్రాణాలు తీయడం ఇదే తొలిసారేమో. పాక్ ఉగ్రవాదుల దుశ్చర్యపై ఆపరేషన్ సింధూర్‌తో భారతదేశం సత్తా చాటింది. మన సైనికుడు మురళీ నాయక్ పాకిస్థాన్ సైన్యంతో పోరాడుతూ అమరుడ య్యాడు. లక్షలాది మంది సైనికులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ మన కోసం సరిహద్దులో ప్రాణాలోడ్డి పోరాడుతున్నారు. త్రివిధ దళాలకు దేశమంతా అండగా ఉంది. వారికి మన ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి. ఆపరేషన్ సింధూర్‌తో భారతదేశ సత్తాను ప్రపంచానికి దాటి చెప్పి నరేంద్ర మోడీ హీరోగా నిలిచారన్నారు. భారతదేశం జోలికొస్తే తాట తీస్తామని హెచ్చరికను శత్రుదేశంతో పాటు ఉగ్రవాదులకు పంపారు. పాకిస్థాన్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను మన సైన్యం ధ్వంసం చేసి ముష్కరులను మట్టుబెట్టింది. 400 సిస్టమ్ ను యాక్టివేట్ చేసి సుమారు400కి పైగా పాక్ డ్రోన్లను గాలిలోనే పేల్చేసింది. బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్ గడగడలాడింది. మరో 48 గంటలు యుద్ధం కొనసాగి ఉంటే పాకిస్థాన్‌లోని ఎయిర్ బేస్‌లు మొత్తం ధ్వంసమయ్యేవి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. టెర్రరిస్టులను పోషించే తమకు ఈ గతి పట్టిం దని ఆ దేశ సైనికాధికారులు తలలు బాదుకుంటున్నారు. భారతదేశమంతా ఐకమత్యంగా ఉంది. కులమతాలకు అతీతంగా ఒకే తాటిపై నడుస్తామన్నారు.

## 20న ఇంటర్వ్యూ

**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లా ఉపాధి కార్యాలయం, ఒంగోలు వారి ఆధ్వర్యంలో కేఎల్ గ్రూప్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, శ్రీచక్ర హుండాయ్ కంపెనీలో పికింగ్, ప్యాకింగ్, స్టొయింగ్, సార్టింగ్, లోడింగ్, ప్రమోటర్లు, సేల్స్ ఎగ్జిక్యూటీవ్ సెక్టార్‌లలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేయుటకు ఏదైనా విభాగంలో ఐటీఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూలు జిల్లా ఉపాధి కార్యాలయం, ఒంగోలు నందు ఈ నెల 20వ తేదీన ఉదయం 10గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు జీతం నెలకు రూ.10 వేల నుండి రూ.19వేల వరకు ప్లస్ పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇవ్వటం జరుగుతుందని, టి.భరద్వాజ్, జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి తెలిపారు. కావున జిల్లాలోని 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల మధ్యగల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఇంటర్వ్యూకు ఆధార్‌కార్డు, సర్టిఫికేట్స్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని భరద్వాజ్ తెలిపారు. వివరా లకు ఆఫీసు పని సమయాలు 08592281776లను సంప్రదించగలరని తెలియజేశారు.




## మహా కుంభాభిషేకానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు



**అద్దంకి, మే 18, ప్రభాతవార్త**

చీరాల డిఎస్‌పి మహమ్మద్ మొయిన్, పట్టణ సి.ఐ. సుబ్బరాజుల ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి మహా కుంభాభిషేక సందర్భంగా పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రమే 5సి.ఐ.లు, 300మంది సిబ్బందితో విధులకు సంబంధించిన డ్యూటీలలో ఆయా సిబ్బంది నియమించారు. ముందుగా స్థానిక కాకతీయ కమ్మ సేవా సత్రంలో పోలీసు సిబ్బంది సమావేశం నిర్వహించి, విధులకు సంబంధించిన సూచనలను, అధికారులు సిబ్బందికి ఇచ్చారు. మహా కుంభాభిషేకాన్ని పురస్కరించుకొని, పలువురు మంత్రులు, ఎంపిలు, శాసనసభ్యులుతోపాటు అధిక సంఖ్యలో భక్తులు సింగరకొండకు రానున్న నేపద్యంలో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసు అధికారులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చెక్ బిపి-స్టాప్ స్ట్రోక్‌పై అవగాహన



**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రారంభించిన చెక్ బిపి-స్టాప్ స్ట్రోక్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్, ఒంగోలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం ఒంగోలు ఇండియన్ ఐయంఎ హాల్‌లో చెక్ బిపి-స్టాప్ స్ట్రోక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఐఎస్ఎ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్, ఒంగోలు ఐయంఎ ప్రెసిడెంట్ డాక్టర్ శివసీతరామయ్య, సెక్రటరీ డాక్టర్ మణిబాబు, ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరథ, డాక్టర్ సుందర్‌రావు, డాక్టర్ మధుకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డియంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలా ఈచెక్ బిపి-స్టాప్ స్ట్రోక్ కాంపెయిన్‌కి సహకరిస్తుందని హామీ ఇచ్చారు. డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ బిపి వచ్చిన వారు కొంతకాలం మందు వాడి తగ్గి పోయిందని ముందు ఆపడం వలన ఎక్కువ ప్రమాదం జరుగుతున్నాయని గమనించాలన్నారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి నిమిషం ముగ్గురికి బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారని, అందులో 25 శాతం మంది 40 సంవత్సరాలలోపే ఉన్నరన్నారు. అవగాహన 80శాతం స్ట్రోక్‌లు నివారించవచ్చున్నారు. హై బిపి అనేది మౌన వ్యాధని చాలామంది వారికి ఉన్నదే తెలియకుండా పక్షవాతం వంటి సమస్యలు వచ్చిన తరువాతతెలుసుకుంటారన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారు బిపిని కనీసం ఒకసారి చూపించుకోవాలన్నారు. ఎక్కువగా ఉంటే చికిత్స చేయించుకోవాలన్నారు. బిపిని గుర్తించి నియంత్రిస్తే 50 శాతం పక్షవాతాలు నివారించవచ్చాన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దేశ వ్యాప్తంగా విస్తరించనున్నట్లు ఐఎస్ఎ కార్యదర్శి డాక్టర్ అర్వింద్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఉచిత బిపి పరీక్షలు నిర్వహించారు. మొబైల్ బస్సును డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ విజయలు జెండా ఊపి ప్రారంభించారు.

## బాల కోటేశ్వరస్వామి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**చిన్నగంజాం, మే 18, ప్రభాతవార్త**

వేసవిలో ఎండల నుంచి ఉపశమనంతో పాటు ప్రజల దాహార్తి తీర్చేలా కొత్తపాలెం గ్రామ పంచాయతీ మునగానివారిపాలెం బాలకోటేశ్వర గుడి వద్ద బాల కోటేశ్వర స్వామి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యం లో చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ఎండల నుంచి ఉపశమనంతో పాటు ప్రజల దాహార్తి తీర్చేలా గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని ఎంప్లాయిస్ యూని యన్ ప్రెసిడెంట్ మారిబోయిన నాగరాజురెడ్డి అన్నారు. ఈ చలివేంద్రం చుట్టు పక్కల మూడు గ్రామాలకు ఎంతో ఉపయోగకరమని ప్రజలు అన్నారు. బాల కోటేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో నాలుగు గ్రామాల ప్రజలు దాహార్తి తీర్చుకునే విధంగా ఈ చలివేంద్రం చుట్టు పక్కల మూడు గ్రామాలకు ఎంతో ఉపయోగకరమని ప్రజలు అన్నారు. బాల కోటేశ్వరస్వామి గుడి ప్రాంగణంలో నాలుగు గ్రామాల ప్రజలు దాహార్తి తీర్చుకునే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేశారన్నారు. రాజు బంగారుపాలెం, శాంతి నగర్, కుక్కలవారిపాలెం, మూలగానివారిపాలెం ఎక్కువ మంది ప్రజలు ఉప్పుగుండూరు అటుగా వెళ్తారు. వాళ్లు ఉదయం 6గంటలకు వెళ్లి మిట్ట మధ్యాహ్నం 12.30గంటలకు తిరిగి ఇంటికి వచ్చే సమయంలో దాహం వేసి చాలా ఇబ్బందులు పడేవాళ్లమని ఇప్పుడు ఆ ఇబ్బందులు పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గుడి ప్రాంగణంలోని గ్రౌండ్ నిత్యం పిల్లలు ఆట్లాడుకుంటూ ఉంటారు. వాళ్లకి ఉపయోగకరంగా ఉందని చెప్పుకొస్తున్నారు. ఎండలు దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేసిన బాలకోటేశ్వరరావు స్వామి ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ సభ్యులు, ఉచిత వేసవి శిక్షణ శిబిరం స్టూడెంట్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## చీరాల నియోజకవర్గంలో ఘనంగా మినీ మహానాడు కార్యక్రమం



**చీరాల, మే 18, ప్రభాతవార్త**

తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటేందుకు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ, అనతి కాలంలో పార్టీని అధికారం వైపు నడిపించిన ధీశాలి అన్న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించు కుంటూ.. చీరాల నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును చీరాల పట్టణం గోలి సదాశివ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలనే లక్ష్యంగా ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించే మహానాడు కార్యక్రమం, పార్టీ శ్రేణులకు పండగతో సమానం. ఈ నెల 27,28,29 కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి చీరాల నుండి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



## శాంతి భద్రతలకు భంగం కలిగించే వారికి తగిన సమాధానం

### - బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు రోడ్డ వెంకట్రావు యాదవ్



**దొనకొండ,మే 18,ప్రభాతవార్త**

భారత ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా దొనకొండ బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు రోడ్డ వెంకట్రావు యాదవ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలియజేశారు. వెంకట్రావు మాట్లాడుతూమన సైన్యం యొక్క అప్రతిహత శక్తి ఆపరేషన్ సిందూర్ తో పీవోకే పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాదుల శిబిరాలను నాశనం చేసి శాంతి భద్రతలకు భంగం కలిగించే వారికి తగిన సమాధానం ఇచ్చింది ,మన నేలను కాపాడే మన దీర జవాన్లకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారికి స్ఫూర్తిదాయక నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు, భారతమాతకి జై అంటూ గ్రామస్థాయి నుంచి దేశ స్థాయి వరకు ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని, దేశం పట్ల గౌరవం పాకిస్తాన్‌ని ప్రేమించే వారిని ఇకనైనా కఠినంగా శిక్షి ంచాలని కోరారు.

## జర్నలిస్ట్ శ్యామ్‌ను పరామర్శించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు



**దొనకొండ,మే 18,ప్రభాతవార్త**

దొనకొండ మండలం ఉదయ్ న్యూస్ చానల్ డివిజనల్ రిపోర్టర్ సీనియర్ జర్నలిస్ట్ శ్యామ్ కన్ను ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చిన తరుణంలో పరామర్శించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నూనె దేవదానం, బత్తుల వెలుగొండయ్య యాదవ్ సీనియర్ నాయకులు

## వెల్డింగ్ పని ఆగిపోయింది





**దొనకొండ,మే 18,ప్రభాతవార్త**

ఆదివారం చందవరంలో వర్షం కారణంగా వెల్డింగ్ పని ఆగిపోయింది రేపు ఉదయాన్నే చేసి రేపు సాయంత్రం కానీ లేక ఎల్లుండి ఉదయం గాని వస్తాయి

# రేపు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు

**దొనకొండ,మే 18,ప్రభాతవార్త**

ఏపీలోని రాయలసీమ జిల్లాల్లో రేపు పిడుగులతో కూడిన భారీ వానలు కురిసే అవకాశం ఉందని ıలీడీ వెల్లడించింది. పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు వర్షాలు, ఇతర జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయంది. అటు గిబిలోని నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మిగతా చోట్ల మోస్తరు వానలు కురుస్తాయంది.

## సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల గుర్తింపు



**బల్లికురవ, మే 18, ప్రభాతవార్త**

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 3 నుండి 18 సంవత్సరాలలోపు 21 రకాల దివ్యాంగుల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించడం జరుగుతుందని ప్రత్యేక టీచర్లు పి.నాగబాబు, జి.నాజీనీలు తెలియజేశారు. గుర్తించిన దివ్యాంగులను, పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు. తద్వారా భవిత కేంద్రాలు నిర్వహించ బడతాయన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి పిల్లలను పాఠశాలల్లో చేర్చాలన్నారు. మరిన్ని వివరాల కోసం ప్రత్యేక టీచర్లను సంప్రదించాలని అన్నారు.

## తిరంగా యాత్రలో పాల్గొన్న కనపర్తి మనోజ్‌కుమార్




**జరుగుమల్లి, మే 18, ప్రభాతవార్త**


ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో మన సైనిక దళాలకు సంఘీభావంగా జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు, సింగరాయకొండ, టంగుటూరు మండలాల బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన తిరంగా యాత్ర కార్యక్రమం సింగరాయకొండలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ర్యాలీలో జాతీయ జెండా పట్టుకుని భారత సైనికులకు, భారత మాతకి, వందేమాతరం అంటూ నినాదాలు హోరెత్తింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మిడసల బాలకోటయ్య, రమేష్, కోమల్‌రావు, ప్రియరాధిక, తన్నీరు లక్ష్మి, ప్రసాద్, మధు, రామకృష్ణ, అల్లరి రామయ్య, టీడీపీ సింగరాయకొండ మండల అధ్యక్షులు వేల్పుల సింగయ్య, జనసేన పార్టీ కొండపి నియోజకవర్గం సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, అయినాబత్తిన రాజేష్, గూడా శశిభూషణ్, కాసుల శ్రీను, అనుమలశెట్టి కిరణ్‌బాబు, రాజు, దారం పవన్ కుమార్, మెండా మహేంద్రబాబు, జనసేన, బీజేపీ, టడీపీ నాయకులు పాల్గొన్నారు.


## అసైన్డ్ భూముల విక్రయ చీటింగ్ కేసులో ముద్దాయిలు అరెస్టు











**పెద్దదోర్నాల, మే18, ప్రభాతవార్త**

అసైన్డ్ భూములను మోసపూరితంగా ఇతరులకు విక్రయించిన కేసులో ముద్దాయిలను ఆదివారం అదుపులోకి తీసుకొని వారిని కోర్టుకి తరలించినట్లు ఎస్సై వి.మహేష్ తెలిపారు. కేసుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి, మండల పరిధిలోని ఐనముక్కల ఇలాకాలోని 73 ఎకరాల ఫ్రీ హల్డ్ భూమిని ఇతరులకు మోసపూరితంగా విక్రయించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించిన తహశీల్దార్ కిన్నెర శాంతి దీనికి సంబంధించిన నివేదికలతో పెద్దదోర్నాల ఎస్సై మహేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన ఎస్సై వి.మహేష్ విచారణ చేసి పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంకన్న అనే వ్యక్తులతో పాటు ఈ కేసులో భూముల రిజిస్ట్రేషన్లకు సహకరించిన వీరభద్రపురం, చందవరం, గొల్లవిడిపి, యర్రగొండపాలెం, తదితర గ్రామాలకు చెందిన 14 మంది నిందితులను గుర్తించి ఆదివారం అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు. గతంలో ఇవే భూమిని దుర్గికి చెందిన ఓ వ్యక్తికి అమ్మకానికి పెట్టగా అతను ఫ్రీ హోల్డ్ భూములను కొనడానికి నిరాకరించాడు. ఈ నేపథ్యంలో పామూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులకు 70 లక్షల రూపాయలతో నిందితులు ఈ భూమిని అమ్మినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమంగా భూమికి చెందిన వ్యక్తులతో కాకుండా ఇతర వ్యక్తులకు సంబంధించిన ఆధార్ కార్డులను వినియోగించి అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడినట్లు సమాచారం.

## మారుతీ భవన్ అభివృద్ధికి పుట్టా వారి విరాళం



**అద్దంకి ,మే 18, ప్రభాతవార్త**

రావినూతల వాస్తవ్యులు పుట్టా భాస్కరరావు, ధర్మపత్ని లక్ష్మీ వారి కుమారుడు నాగచందు, కుమార్తె జాహ్నవిలు సింగరకొండలోని మారుతీ భవన్ అభివృద్ధికి ఎసి, గీజర్. మంచం,లను ఆలయ ఎసి తిమ్మనాయుడుకు అందజేశారు.

## రాతి ముఖమండపానికి లక్ష్మీప్రసాద్ విరాళం



**అద్దంకి , మే 18, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండపానికి కామేపల్లి లక్ష్మీప్రసాద్ వారి ధర్మపత్ని సామ్రాజ్యం రూ .2,01,116లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, చుండూరి మురళీసుధాకరరావు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## రాతి ముఖమండపానికి వేముల వారి విరాళం



**అద్దంకి ,మే 18,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండపానికి అద్దంకి వాస్తవ్యులు వేముల వల్లేశ్వరావు వారి ధర్మపత్ని శ్రీదేవిలు రు. 1,01,116లు, ఆలయ ఎసి తిమ్మా నాయుడుకు విరాళం అందజేశారు.

## ముఖమండపానికి అల్లంనేని వారి విరాళం



**అద్దంకి ,మే 18, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండపానికి, తిమ్మాయిపాలెం వాస్తవ్యులు శశ్వత గ్రాఫిక్స్ అల్లంనేని పూర్ణచంద్రరరావు ధర్మపత్ని పద్మజలు రు. 1,05,116లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు విరాళం అందజేశారు.

## రాతి ముఖమండపానికి అంజిబాబు విరాళం



**అద్దంకి , మే 18, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండపానికి, అద్దంకి వాస్తవ్యులు చిన్ని అంజిబాబు ధర్మపత్ని శ్రీదేవిలు రూ.1,01,116లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో చుండూరి మురళీ సుధాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

## రాతి ముఖమండపానికి అడుసుమిల్లి వారి విరాళం



**అద్దంకి ,మే 18, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతిముఖ మండపానికి నాగులపాడు గ్రామ వాస్తవ్యులు అడుసుమిల్లి వెంకటేశ్వర్లు ధర్మపత్ని అరుణలు రు. 1,00,359లు ఆలయ ఎసి తిమ్మా నాయుడుకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, చుండూరి మురళీసుధాకరరావు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## గ్రంథాలయ శాశ్వత భవనానికి 10 సెంట్లు కేటాయింపు




**అద్దంకి , మే 18, ప్రభాతవార్త**

అద్దంకిలోని గ్రంథాలయ స్వంత భవనం కొరకు తహశీల్దార్ జి. చరణ్ 10సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ సంబంధిత ఉత్తర్వులను జారీచేశారు. ఆమేరకు స్థలాన్ని కేటాయిస్తూ సంబంధిత పత్రాన్ని కూడ రిటైర్డు గ్రంథపాలకుడు సుగుణరావు, ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎల్ వసుంధరాదేవిలకు, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు సమక్షంలో తహశీల్దార్ చరణ్ అందజేశారు. గత 5దశబ్దాలుగా అద్దంకిలో గ్రంథాలయ స్వంతభవనం నిర్మాణం కొరకు కృషి చేస్తున్నారు. ఈ నేపద్యంలో ఎన్ఎస్‌పి కార్యాలయ ప్రాంగణం నందు ఈ 10 సెంట్ల భూమిని కేటాయించారు.

## చెరుకూరులో ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

### - నిరంతర ప్రజా సేవకుడు ఎమ్మెల్యే ఏలూరి

### - రాజకీయాలకు అతీతంగా వైద్య సేవలు అందిస్తున్న దాత ఏలూరి

### - సభలో పలువురు వక్తలు, కంటి బాధితులు





**మార్టూరు, మే18, ప్రభాతవార్త**

సామాన్య మధ్య తరగతి కుటుంబం.. గత అనేక ఏళ్లుగా ఎమ్మెల్యేఏలూరి సాంబశివరావు రాజకీయాలకు అతీతంగా వైద్య శిబిరాలు మోకాళ్ల ఆపరేషన్లు కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. కొంత మంది నాయకులు ఎన్నికలవరకే రాజకీయాలు కోసం ఆర్భాటంగా వైద్య శిబిరాలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుంటారు. కానీ ఎమ్మెల్యే ఏలూరి ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ.. ఎక్కడ రాజకీయాలు లేకుండా నిరంతరం కొనసాగిస్తూ ప్రజలచెంతకే కార్పొరేట్ వైద్యాన్ని తీసుకువచ్చి రూపాయి ఖర్చు లేకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ కంటి ప్రదాతగా ఆరోగ్య ప్రదాతగా నిలుస్తున్నారని, ఆయనకు మా ఆశీస్సులు నిండు నూరేళ్లు ఉండాలని క్యాంపుకు వచ్చిన పలువురు కంటి బాధితులు ఎమ్మెల్యే ఏలూరిని ఆశీర్వదించి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, ఏలూరి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో చెరుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి పర్చూరు మండలం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో విశేష స్పందన లభించింది. తొలుత స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగించారు. రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే ఏలూరి నిరంతరం సేవాకార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజాగుండెల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు.

### విశేష స్పందన :


ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. క్యాంపుకు 553 మంది హాజరు కాగా వారిలో 158 మందికి చికిత్సలు నిర్వహించేలా వైద్యులు రిఫర్ చేశారు. మజ్జిగ, మంచినీళ్లు, బిస్కెట్ ప్యాకెట్స్ అందించారు. క్యాంపు అనంతరం భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి, కారుమంచి కృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు షేక్ జమాలుద్దిన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాలేటి కోటేశ్వరరావు, రామకృష్ణ, నాయకులు మానం హరిబాబు, మక్కెన శేఖర్‌బాబు, సాంబయ్య, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు,ఆకుల శ్రీనివాసరావు,అప్పలనే నరేంద్ర, నాగరాజు, శంకరరావు, ఆదినారాయణ, వెంకట సుబ్బయ్య, దాస్, భుట్టో తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

**సీఎస్‌పురం, మే18, ప్రభాతవార్త**

క్రీడలు యువకుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అయ్యలూరివారిపల్లి సర్పంచ్ ముత్యాల భారతి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని అయ్యలూరివారిపల్లి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ పోటీలను ఆదివారం నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ నిర్వాహకులు నారాయణరెడ్డిని పెద్దలను సన్మానించారు. 28 జట్లు పాల్గొంటున్న ఈ పోటీల్లో ప్రారంభ మ్యాచ్‌లో బసినేనిపల్లి గ్రామానికి చెందిన లిటిల్ డ్రాగన్స్ జట్టుపై సీతారాంపురంకు చెందిన ఫ్యూచర్ ఫోర్స్ జట్టు విజయం సాధించింది. శివ, బాలచంద్రలు అంపైర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల భారతి నారాయణరెడ్డి, పెద్దిఎడ్డి రామిరెడ్డి, ఎస్.శివారెడ్డి, పత్తెరపు శివరామకృష్ణ, లంకెనపల్లి వెంకటేశ్వర్లు, గేనిక గురుబ్రహ్మం, పెద్దిరెడ్డి లక్ష్మీ నారాయణరెడ్డి, దేవతి సురేంద్ర, చిరుబోయిన దుగ్గయ్య, దుద్దెల కేశయ్య, కల్లూరి వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈర్ల గంగమ్మకు ప్రత్యేక పూజలు



**బల్లికురవ, మే 18, ప్రభాతవార్త**

స్థానిక ఈర్లకొండ వద్ద వేంచేసియున్న ఈర్ల గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి తొడుగు, బంగారు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. బాపట్ల, ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రానైట్ క్వారీల నిర్వాహకులు వాహన పూజలు, అన్న సంతర్పణ నిర్వహించారు.

## ముఖమండపానికి కోనేటి వారి విరాళం



**అద్దంకి , మే 18, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండపానికి అద్దంకి పట్టణానికి చెందిన కోనేటి వెంకటేశ్వర్లు కీ.శే. కోనేటి యలమంద, ధర్మపత్ని సుబ్బులు జ్ఞాపకార్థం రు.3,69,999లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సందిరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# వివాహా వేడుకలలో పానెం



**అద్దంకి , మే 18,ప్రభాతవార్త**

మండలంలోని శంఖవరప్పాడు గ్రామంలో కోట రామిరెడ్డి కుమారుడు బ్రహ్మారెడ్డి, దానవర్ణల వివాహానికి అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి సోదరుడు నరసింహారెడ్డి హజరై నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయన వెంట గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, రాజ తదితరులు వున్నారు.

## చేరెడ్డికి పుట్టం వారి పురస్కారం బహుకరణ



**అద్దంకి , మే 18, ప్రభాతవార్త**

ప్రముఖ పద్యకళానిధి డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డికి2025 విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ఆదివారం పుట్టంరాజు వారి కళాక్షేత్రంలో ఘనంగా సత్కరించి, బహుకరించారు. పుట్టంరాజు,బుల్లెయ్య రామ లక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారానికి, ప్రముఖ పద్యకవిత, ప్రావీణ్యుడు, పద్యకళానిధి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఆమేరకు ప్రత్యేకంగా నిర్వహించిన సభకు గాడేపల్లి దివాకర్‌దత్తు అధ్యక్షతవహించగా, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి చేరెడ్డి కవిత్వాన్ని విశ్లేషించారు. అదే విధంగా డాక్టర్ యు.దేవపాలన కూడ చేరెడ్డి రచనలను, ప్రాచీన కావ్యాలను,తలపించేవిధంగా వున్నాయని అన్నారు. ఈ సందర్భంగా చేరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించి, పురస్కారం క్రింద, 5వేల నగదు, పట్టు బట్టలు, సన్మానపత్రం, జ్ఞాపికలను ట్రస్టు తరుపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఆయన ధర్మపత్ని శైలజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలూరి వెంకట శివ రామప్రసాద్, వై. త్యాగరాజు, కెవి పోలిరెడ్డి, చుండూరి మురళీ సుధాకరరావు, పాపారావు, సుబ్బారావు, కొండకావూరి కుమార్, శేఖర్, కూరపాటి రామకోటేశ్వరరావు, పాలపర్తి జ్యోతిష్మతి, మోటుపల్లి రామదాసు, పిసిహెచ్ కోటయ్య, నాగేశ్వరరావు, బత్తుల బాలు, ఎం. శ్రీనివాసరావు, మస్తాన్, రాఘవరావు, శివానంద రెడ్డి చిన్ని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభాభిషేకం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం

### - వేమారెడ్డి అన్నదాన సత్ర సమావేశంలో నిర్ణయం



**అద్దంకి ,మే 18, ప్రభాతవార్త**

సింగరకొండలోని వేమారెడ్డి, సేవా సమితి అన్నదాన సత్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ మహా కుంభాభిషేక సందర్భంగా సోమవారం క్షేత్రానికి వచ్చే భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని, కార్యవర్గం నిర్ణయించింది. అమేరకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు అన్నదాన సత్ర నిర్వహకులు మేడగం ప్రభాకరరెడ్డి వెల్లడించారు. ఈ సమావేశానికి అన్నదాన సత్ర కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

# దేశం గర్వించేలా ఆపరేషన్ సింధూర్

### - అద్దంకిలో తిరంగ యాత్రలో పలువురు వక్తలు వెల్లడి



**అద్దంకి , మే 18,ప్రభాతవార్త**

దేశంలో ప్రతి భారతీయుడు గర్వించేలా త్రివిధ దళాలు సింధూర్ పేర నిర్వహించిన ఆపరేషన్ నిలించిందని, పలువురు వక్తలు కొనియాడారు. వీర సైనికులకు మద్దతుగా ఎన్డిఏ ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం అద్దంకిలో పట్టణంలో త్రివర్ణ పతాకాలతో వందేమాతం నినాదాలతో భారతమాతకి జై అంటూ తిరంగ ర్యాలీని నిర్వహించారు. మతం పేరుతో భార్యముందే భర్తను, కొడుకుముందే తండ్రిని చంపడం దారుణమని, ఈ ఘటనలు జరిగిన తరువాత ఉగ్రవాదులను తుడిచి పెట్టేందుకు ఆపరేషన్ సింధూర్‌కు త్రివిధ దళాల ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారని దీంతో దేశంలోని ప్రతి పౌరుడు, గర్వించేలా, ఆపరేషన్ సింధూర్ సాగిందన్నారు. ఈ పోరాటంలో అశువులు బాశిన మురళీ నాయక్ కుటుంబానికి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీంద్రతోపాటు, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## నేడు సింగరకొండకు ముగ్గురు మంత్రులు రాక



**అద్దంకి , మే 18, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి మహా కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఉదయం 8.45గంటలకు సింగరకొండకు చేరుకోనున్నట్లు ఆయన క్యాంపు కార్యాలయ ఒక ప్రకటనలో తెలియజేశారు. అదే విధంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనాయణరెడ్డి, సాంఘిఖసంక్షేమ శాఖ మంత్రి డిబివి స్వామి కూడ ఈ కార్యక్రమంలో పాల్గొన నున్నట్లు పేర్కొన్నారు.

## మహానాడు ఏర్పాట్లుపై మంత్రుల కమిటీ సమీక్ష

**అద్దంకి ,మే 18, ప్రభాతవార్త**

కడపలో ఈ నెల 27,28,29 తేదిలలో నిర్వహించనున్నట మహానాడు ఏర్పాట్లపై మంత్రులతో ఏర్పాటు చేయబడిన సమన్వయకమిటీ ఆదివారం కడపలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా బహిరంగ సభ, ప్రతినిధుల సభల నిర్వహణపై మంత్రుల కమిటీ చర్చించింది. ఈ సమావేశంలో మంత్రులు, అనగాన సత్యప్రసాద్, అనిత, పయ్యాల కెశవ్, గొట్టిపాటి రవికుమార్, డిబివి స్వామి, నిమ్మల రామానాయుడు, మండిపల్లి, సవిత, జనార్ధన్‌రెడ్డి, ఎంపిలు దగ్గుమళ్ళా, పల్లా శ్రీనివాస్, తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.



# గాంధీనగర్‌లో సిపిఐ శాఖ మహాసభలు



**త్రిపురాంతకం, మే 18, ప్రభాతవార్త**
మండలంలోని గాంధీనగర్ గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో సిపిఐ శాఖ మహాసభలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సిపిఐ నాయకులు మన్నెం తిరుపతయ్య సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గత మూడు సంవత్సరాలుగా గాంధీనగర్ శాఖలో జరిగిన శాఖ పనితీరును నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్, మండల కార్యదర్శి బాణాల రామయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్ మాట్లాడుతూ 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన పార్టీలో మనమందరం సభ్యులు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కమ్యూనిస్టులే లేకపోతే ప్రజల జీవితాలు మరీ ముఖ్యంగా పేద ప్రజల జీవితాలు ప్రశ్నార్థకమని, నేటికీ కొన్ని జాతుల వారికి ప్రభుత్వం, ప్రజలకు ఏమి చేస్తుందో వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం పొందాలో తెలియని జాతులు లేకపోలేదు అని వారన్నారు. కార్మికులకు, రైతుల పరిరక్షణ చట్టాలను నిర్వీర్యం చేయాలనుకునే కేంద్ర ప్రభుత్వ వైఖరిని తిప్పికొట్టాలని అన్నారు. భవిష్యత్తులో జరుగు మండల, జిల్లా, రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సూచించారు. రామాలయం వెనుక బజార్‌ను సిమెంట్ రోడ్డు నిర్మించాలని తీర్మానించింది. నూతన కమిటీ కార్యదర్శి కురేటి అచ్చమ్మ, సహాయ కార్యదర్శి పోలుదాసు భూలక్ష్మి, నూర్జహాన్, నాయకులు బంగారు నరసింహులు, మన్నెం తిరుపతయ్య, కురేటి వెంకటేశ్వర్లు, కొమ్ము చందమ్మ, రిబ్కమ్మ, పుచ్చకాయల రమణమ్మ, అద్దంకి యల్లమ్మ, సరోజినమ్మ, మాజీ కార్యదర్శి మన్నెం శివనారాయణ, మరికొందరు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య పేదలకు చీరలు మరియు పంచెలు పంపిణీ



**మార్కాపురం రూరల్, మే 18,ప్రభాతవార్త**
ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) వారి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్య పేదలకు చీరలు మరియు పంచెల పంపిణీ కార్యక్రమం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు జరిగింది. ఆవోపా ఆధ్వర్యంలో 100మంది మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా దయాల్బాగ్ వారి సహకారంతో 10మంది పురుషులకు పంచలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రెసిడెంట్ చీదెళ్ళ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆర్యవైశ్య పేదలకు సహాయం చేయడమే కాకుండా 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మెరిట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల సమక్షంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా ఆర్యవైశ్యులకే కాకుండా సమాజంలో అందరికీ ఉపయోగపడే విధంగా చెన్నకేశవ స్వామి తిరుణాల సందర్భంగా ప్రతి సంవత్సరం 1000మందికి పైగా భోజనం కార్యక్రమాలు, రథసప్తమి రోజు అల్పాహారం కార్యక్రమాలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలు, మరియు గాంధీజయంతిని పురస్కరించుకొని మూడు మండలాల పరిధిలో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పెరుమాళ్ళ కోటిమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ వి సుబ్బారావు, స్టేట్ నెంబర్ దేవిశెట్టి రామశేఖర్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, ఈసి మెంబర్లు నాగేశ్వరరావు, కేశవరావు, లక్ష్మీనారాయణ, చలమయ్య, రామకృష్ణ, వెన్న వెంకట సుబ్బారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఈఏ) కంభం తాలూకా ఎన్నికలు

**అర్ధవీడు, మే 18, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఈఏ) కంభం తాలూకా ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలను ఈనెల 25వ తేదీ వచ్చే ఆదివారం కంభంలోని స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనం నందు జరుగునని ఎన్నికల అధికారి పాండు రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాలలో పనిచేసే అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని కంభం తాలూకా ఏపీజీఈఏ అధ్యక్ష కార్యదర్శులతోపాటు ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్‌ను ఎన్నుకోవలసిందిగా ఎన్నికల అధికారి పాండురంగారెడ్డి మరియు సహాయ ఎన్నికల అధికారి ఎస్వీ రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలను పర్యవేక్షించుటకు జిల్లా అధ్యక్షులు చిన్నపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వరకుమార్‌తోపాటు మార్కాపురం తాలూకా అధ్యక్షులు వెంకటరెడ్డి, కనిగిరి తాలూకా అధ్యక్షులు రమేష్ బాబులు పాల్గొంటారని తెలిపారు. కావున కంభం తాలూకా ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఎన్నికలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఎన్నికలలో పాల్గొను ఉద్యోగులు తమ వివరాలను రంగయ్య (స్థానిక ట్రెజరి ఉద్యోగి), ముక్కు ప్రసాద్ రెడ్డి (స్థానిక అటవీశాఖ ఉద్యోగి)లకు తెలియపరచవలసిందిగా వారు తెలిపారు.

## నేడు కొండపిలో తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం


**కొండపి, మే 18, ప్రభాతవార్త**
కొండపిలోని శ్రీసీతారామ కళ్యాణ మండపంలో నేడు అనగా సోమవారం తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు మాజీ ఏఎంసి ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యలు పాల్గొంటారని ఆయన తెలియజేశారు. కావున ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు, హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమానికి ముందు ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్‌లకు శ్రద్ధాంజలి అర్పిస్తూ భారీ తిరంగ ర్యాలీ జాతీయ సమైక్యతను చాటేలా జాతీయ జెండాతో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ర్యాలీ తూర్పునాయుడుపాలెం కార్యాలయం నుండి సీతారామ కళ్యాణ మండపం వరకు నిర్వహించి జెండా ఆవిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు.

## మీనిగ వారి వివాహ వేడుకలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, మే18, ప్రభాతవార్త**
మండల పరిధిలోని హనుమంతాపురం గ్రామ పంచాయతీలో గల నారాయణపల్లి గ్రామం మీనిగ వారి వివాహ వేడుకలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పంచాయతీ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 108 లోనే సుఖప్రసవం



**బల్లికురవ, మే 18, ప్రభాతవార్త**
పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణీకి 108 సిబ్బంది సుఖ ప్రసవం చేసి తల్లి బిడ్డని కాపాడారు. ఆదివారం వేకువజామున 4గంటల సమయంలో జరిగింది. మండలంలోని కూకట్లపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి ఎస్తేర్ రాణికి పురిటినొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. 108 వాహనంలో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించే సమయంలో కొప్పెరపాడు గ్రామ సమీపానికి రాగానే పురిటినొప్పులు ఎక్కువగా రావడంతో ఈ.ఎం.టి ఆశోక్ ఆమెకు ప్రసవం చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది ఆశోక్, పైలెట్ భాషా తెలిపారు. సరైన సమయంలో కాన్పు చేసినందుకు ఎస్తేర్ రాణి కుటుంబసభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు షూరిటీ లేని రుణాలు కేటాయించాలి

**సంతనూతలపాడు, మే18, ప్రభాతవార్త**
రాష్ట్రంలో గల కూటమి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గీయులకు అందించే రుణాలు షూరిటీ లేకుండా మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంకే సుబ్బారావు డిమాండ్ చేశారు. ముఖ్యంగా బ్యాంకుల్లో ఎస్సీ వర్గీయులకు కేటాయించే రుణాలకు ఓసీ వర్గీయులకు సంబంధించిన బ్యాంక్ ఉన్న రైతులను హామీ కింద తెచ్చుకోవాలంటూ బ్యాంకర్స్, ఒత్తిడి తేవటం మరింత దారుణమని సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్యాంకర్స్ రుణాలకు సంబంధించి ఎస్సీ వర్గీయులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని సుబ్బారావు ఆరోపించారు. బీజేపీ, జనసేన, పార్టీలు టీడీపీ కూటమి ప్రభుత్వంలో కొనసాగుతుంటే ఇదేమిటి అంటూ సుబ్బారావు ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఎస్సీలకు సంబంధించి షూరిటీ లేకుండా వాటిని కేటాయించాలని సుబ్బారావు కోరారు.

## బంగారమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించిన సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి



**హనుమంతునిపాడు, మే18, ప్రభాతవార్త**
మండల పరిధిలోని దొడ్డిచింతల పంచాయతీలో గ్రామ దేవతైన ఆదిశక్తి దేవత బంగారమ్మ తల్లికి ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మినీ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

### - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి




**హనుమంతునిపాడు, మే18, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు గౌరవ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నేడు అనగా సోమవారం ఉదయం 9.30గంటలకు కందుకూరు రోడ్డులో గల మూలే బాలిరెడ్డి ఫంక్షన్ హాల్లో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కావున తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల శ్రేణులు, గ్రామ/ వార్డు కమిటీ నాయకులు, ఇటీవల నియమించబడిన కేఎస్ఎస్ సభ్యులు తప్పనిసరిగా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**సంతనూతలపాడు, మే 18, ప్రభాతవార్త**
సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్‌లో వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రం వద్ద వారం వారం మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 7వ వారం దాత వాసవి క్లబ్, కోశాధికారి పామిడి సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు మజ్జిగ పంపిణీ చేశారు. పామిడి వెంకట సుబ్బయ్య, వెంకట సుబ్బరత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు సుధాకర్ స్వచ్ఛందంగా ఈ మజ్జిగ పంపిణీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, గౌరవ అధ్యక్షులు పాదర్తి గిరి, ఉపాధ్యక్షులు వేమా శ్రీను, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పి.సుధాకర్, వాసవి మహిళా సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు శిఘాకొల్లి విజయలక్ష్మీ, వాసవి మహిళా క్లబ్ ప్రతినిది ఎన్.సుకన్యరాణి, వాసవి క్లబ్, ఆర్యవైశ్య నాయకులు శిఘాకొల్లి రాజేష్, చలువాది రము, ఎం.అంకంశెట్టి, మద్ది సుబ్బయ్య, వేమూరి ప్రసన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల కన్వీనర్ పిన్నిక శ్రీనివాసరావు



**జరుగుమల్లి, మే 18, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన జరుగుమల్లిలో దగ్గుమాటి కృష్ణారెడ్డి, శ్రీలతల కుమారుడు వివాహానికి సమాచార విభాగ అధ్యక్షులు కనపర్తి శేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నిక శ్రీనివాసరావు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ బత్తిన మదన మనోహర్‌రావు, కొర్రపాటి వెంకటేశ్వర్లు, మధు, పెద్దిరెడ్డి, బ్రహ్మయ్య, కంచర్ల రామకృష్ణ, కిరణ్, మండలంలోని పలువురు వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



**పెద్దదోర్నాల, మే18, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కళాజాత బృందాలను ప్రారంభించడం జరిగింది. ఈ మేరకు హ్యాండ్స్ ఆఫ్ కంఫాషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ విఘ్నేశ్వర కళా నాటక బృందంచే ప్రసాద్‌బాబు కళాజాత బృందం స్థానిక దోర్నాల నటరాజ్ సెంటర్‌లో వీధి నాటకము, పలు కళారూపాలు ఆట పాటలు ప్రదర్శించి హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి సుఖ వ్యాధులు ఎలా వస్తాయి, ఎయిడ్స్ ఎలా వ్యాపించదు అనే విషయంపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ/ ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి అని తెలియజేస్తూ కళా జాత బృందం వివరించింది. హెచ్ఐవీ/ ఎయిడ్స్ క్షయ వ్యాధి సంబంధం గురించి, హెచ్ఐవీ ఉన్న గర్భిణీ నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సుఖ వ్యాధులు, చికిత్స గురించి, కండోమ్ యొక్క ఉపయోగం గురించి తెలిపారు. హెచ్ఐవీ/ ఎయిడ్స్ యాక్ట్ 2017 గురించి ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ పరీక్ష అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని, వ్యాధి ఉన్న వారు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని, క్రమం తప్పకుండా సీడీ4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రివెన్షన్ యూనిట్ ఎన్జీవో ప్రాజెక్టు డైరక్టర్ టి.ఆనంద్ బెంజిమెన్, ప్రకాశం జిల్లా సీపీఎం నాయకులు పి.కిరణ్, పూర్ణకంటి తిరుమలయ్య, పి.రేణుకాదేవి, బి.శ్రావణి, కే.రాణి, భవాని, కళాజాత బృందం పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ




**యర్రగొండపాలెం,మే18,ప్రభాతవార్త**
భారతీయులపై పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతికారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సంధూర్ విజయవంతం అయిన నేపద్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగిందని యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టి ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన భారి ర్యాలీ ఆర్‌అండ్‌బీ బంగ్ల నుండి అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు జాతీయ జెండాలు పట్టుకొని అపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ భారతదేశంపైకి ఎవరైనా దాడి చేస్తే అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. భారతదేశం తలుచుకుంటే పాకిస్థాన్‌న్ని ప్రపంచపటంలోనే లేకుండా చేయగలదన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీలో రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, పలువురు వ్యాపారవేత్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రజలు, విద్యార్థులు, యువతి యువకులు చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత నిబంధనతో, ప్రాముఖ్యతతో రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో నిర్వహించడమైనదని ఆయన అన్నారు. అపరేషన్ సింధూరి కార్యక్రమంలో సాయుధ దళాలు, జవాన్లు చూపిన ధైర్య సాహసాలకు మన దేశ ప్రతిష్టను ఇనుమడించే విధంగా వారు పోరాడిన తీరుకు భారత దేశ ప్రజలందరూ బాసటగా నిలవాల్సిన ఆవసరం ఉందన్నారు. కాల్పుల విరమణ నియమాలను ఉల్లంఘించి పాకిస్తాన్ చేసిన దాడుల్లో 23 సంవత్సరాల మన రాష్ట్ర యువకుడు మురళి నాయక్ వీరమరణం పొందారని ఆయన తెలిపారు. అదేవిధంగా అనేకమంది ఈ దాడుల్లో వీరమరణం పొందారని వారికి నివాళులర్పింస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ బాసటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడివో శ్రీనివాసులు, యంఇవో పి.ఆంజనేయులు నాయకులు, చేకూరి సుబ్బారావు, యం.మంత్రునాయక్, చిట్యాల వెంగళ్‌రెడ్డి, వేగినాటి శ్రీను, తోటమహేష్‌నాయుడు, కంచర్ల సత్యనారాయణగౌడ్, షేక్.మస్తాన్‌వలి, అధికారులు, ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, మే18, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పి.విజయ లక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ కాటూరి ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

# ఎయిడ్స్ మృతుల స్మారక కొవ్వొత్తుల ప్రదర్శన



**సింగరాయకొండ, మే 18, ప్రభాతవార్త**
మహమ్మారి ఎయిడ్స్ మృతుల కుటుంబాలు, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు వారి కుటుంబాల పట్ల వివక్షత వద్దు అని వారి పట్ల సమాజం ఆదరించాలని సింగరాయకొండ ప్రాథమిక వైద్యశాల వైద్యులు, ఐ సి టి ఎస్,ఎం ఎల్ ఎస్, ఒ ఆర్ డబ్ల్యూ నిర్వాహకులు పిలుపు ఇచ్చారు. ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తులతో ప్రదర్శనగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరాయకొండ ఒ ఆర్ డబ్ల్యూ,ఎం ఎల్ ఎస్ సిబ్బంది కార్యకర్తలు, ఉన్నత శ్రేణి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల ర్యాలీకి సంబంధించి రంగవల్లి ఏర్పాటు చేసి కొవ్వొత్తులతో తమ ప్రగాఢ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత శ్రేణి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఐ సి టి సి కౌన్సిలర్ జి.ప్రసాద్,ఎం ఎల్ ఎస్ మేనేజర్ ఎం వెంకటరావు, ఒ ఆర్ డబ్ల్యూ కార్యకర్త కె.నాగమణి, సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి 40 వేలు ఆర్థిక సహాయం



**సింగరాయకొండ, మే 18,ప్రభాతవార్త**
ఉలవపాడు మండలం, భీమవరం గ్రామానికి చెందిన దేవండ్ల అర్చన పరమేశ్వరి మూడుసంవత్సరాలు వయస్సు పాప మూడురోజుల క్రితం స్పృహతప్పి పడిపోవడంతో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో వైద్యులు పరీక్షలు నిర్వహించి, మెదడు వాపు వచ్చిందని, వెంటిలేటర్‌పై చికిత్స అవసరమని తెలిపారు. వైద్య ఖర్చులు రూ. 5 నుండి 8 లక్షలు అవుతాయని హాస్పిటల్ వర్గాలు పేర్కొన్నాయి. పాప తల్లిదండ్రులు రోజువారీ కూలీలుగా భరించే సామర్థం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సింగరాయకొండ అప్డేట్స్ ఛైర్మన్ సాంబ చెన్నంశెట్టి మిత్రులు కలిసి పాప వైద్యానికి రూ.40,000 ఆర్థిక సహాయం చేశారు. ఈ సహాయాన్ని సింగరాయకొండ అప్డేట్స్ సభ్యులు చెన్నంశెట్టి సాయి మనోజ్, హరి, రాకేష్ దారుకుమల్లిలు అర్చన తండ్రి దేవండ్ల శివకుమార్ కు అందజేశారు. పాప ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ, తమ వంతు సహాయాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంపు

**సంతనూతలపాడు, మే18, ప్రభాతవార్త**
ప్రకాశం బాలోత్సవం సంతనూతలపాడు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గల సుందరయ్య భవన్లో ఈనెల 9నుండి 18వరకు 10 రోజుల పాటు విద్యార్థులకు ఘనంగా జరిగిన సమ్మర్ క్యాంపు నేటితో ముగిసింది. ఈ సందర్భంగా క్యాంపులో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్యాంపు కన్వీనర్ మారతి మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం, వికాసం అనే పేరుతో పిల్లలు సృజనాత్మకతను కలిగి ఉండాలనే లక్ష్యంతో గత 3 సంవత్సరాలుగా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన సమ్మర్ క్యాంపులో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పిల్లల కోసం పెద్దలు ముందుకు రావాలనే ఉద్దేశంతో వివిధ అంశాల్లో ప్రత్యేక కలిగిన వారు స్వచ్ఛందంగా క్యాంపులో పాల్గొని విద్యార్థులకు కొత్త విషయాలు నేర్పించినట్లు తెలిపారు. ఈ క్యాంపును మండల ఐద్వా కార్యదర్శి ఎన్.మాలతి, జేవీవీ జిల్లా నాయకులు కే.కోటేశ్వరరావు, బుజ్జిలు పర్యవేక్షించారు. బొమ్మలు గీయడాన్ని రాధ విద్యార్థులకు సులభంగా నేర్పారు. బొమ్మలు గీయడానికి అసవరమైన మెలుకువలు నేర్పారు. ప్రతి విద్యార్థి బొమ్మలు గీయడానికి ప్రయత్నించారు. క్రాఫ్టింగ్‌ను ఐద్వా రమాదేవి, వీరాస్వామి నేర్పారు. న్యూస్ పేపర్, కలర్ పేపర్‌ను ఉపయోగించి వివిధ రకాల బొమ్మలు తయారు చేయడం పేపర్ కటింగ్ ద్వారా పలు ఆకారాలు చేయడం వంటి క్రాఫ్టింగ్ నేర్పారు. శాస్త్రీయ ఆలోచనపై కోటేశ్వరరావు వివరించారు. సైన్స్ ప్రయోగాలను బాలోత్సవం కార్యదర్శి కే.సుబ్రహ్మణ్యం నేర్పారు. మాయలు, మంత్రాలు పేరుతో కొంత మంది అమాయకులను ఎలా మోసం చేస్తున్నారో వాటిని ఎలా గుర్తించాలో విద్యార్థులకు వివరించారు. సైన్స్ ప్రత్యేకతను, అవసరాన్ని తెలిపారు. ప్రయోగాత్మకంగా కొన్ని ప్రయోగాలు విద్యార్థులచే చేపించారు. మ్యాజిక్ క్లాసును మ్యాజిక్ రామన్ ప్రతి విద్యార్థికి ఒక అంశం నేర్పారు. మూఢనమ్మకాలు, అభూత కల్పనలు నుండి విద్యార్థులు బయటపడటానికి మ్యాజిక్ శాస్త్రీయ భావాలను విద్యార్థుల్లో నింపింది. ప్రతిది రెండో కోణంలో ఆలోచించే లక్షణాన్ని మ్యాజిక్ ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారు.

**ప్రముఖుల జీవితాలు పరిచయాలు :**
మేధావులు, స్వతంత్ర సమరయోధుల గురించి తెలుసుకోవడానికి విద్యార్థులకు ఆటల రూపంలో మార్చి చేసిన ప్రయత్నం వలన ప్రతి విద్యార్థి తన పేరులో ఉన్న అక్షరంతో కలిసి మేధావుల గురించి చెప్పడం వలన మహనీయుల జీవితాలు తెలుసుకున్నారు.

**సందేశాలు :**
ఎన్వీ నరసింహం, అబ్దుల్ మాలిక్, నెరుసుల వెంకటేశ్వర్లు, క్యాంపులో పాల్గొని విద్యార్థులకు నీతి కథలు,పాటలు, ప్రకృతివ్యవసాయం,కుటుంబ సంబంధాలు ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు.

**దాతల సహకారంతో :**
ప్రతి రోజు విద్యార్థులకు స్నాక్స్, మ్యూజిక్ పరికరాలు ఇతర క్లాసుల మెటీరియల్, భోజనం ఏర్పాటు కోసం దాతలు సహకారం అందించారు. వారి పిల్లలు క్యాంపులో లేకపోయినా కార్యక్రమం లక్ష్యం నచ్చి ఆదరించడం ప్రత్యేకత.

**ఉత్సాహంగా ముగింపు కార్యక్రమం :**
9 రోజుల పాటు నేర్చుకున్న అంశాలను బాలోత్సవం నాయకుల ముందు ప్రదర్శించారు.

**పాల్గొన్న విద్యార్థులందరికి బహుమతులు :**
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ వినోద్, కోటేశ్వరరావు, వి.సంపత్, మాలతి పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేసి మానవ విలువలు, లౌకిక విలువలు శాస్త్రీయ దృక్పధం, క్రమశిక్షణ, దేశభక్తి, ఆడ పిల్లల పట్ల సమానత్వం గౌరవం ఉండాలని ఇంటి పనులలో పిల్లలు తల్లిదండ్రులకు సహకారం అందించాలని కుటుంబ విలువలు కలిగి ఉండటం సామాజిక బాధ్యతతో మెలగడం వంటి విషయాలు వివరించారు.



## గ్రంధాలయంలో కథల రచన, చిత్రలేఖన పోటీలు

**కనిగిరి, మే 18, ప్రభాతవార్త**






కనిగిరి శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంధపాలకుడు షేక్ అహ్మద్ షరీఫ్ అధ్యక్షత వహించగా, హెచ్ఎంపాడు మండల సర్వేయర్,గ్రందాలయ పునర్వికాస ఉద్యమ సభ్యుడు కాకర్ల రమణయ్య ముఖ్య అతిధిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాక, ఆధునిక యుగంలో కథల ప్రాముఖ్యతను వివరించారు. ఇతర భాషలు నేర్చుకోవడం అవసరం, కానీ మాతృభాష అయినతెలుగులోనూ నైపుణ్యం సంపాదించాల్సిన అవసరం ఉంది అనేసందేశాన్ని విద్యార్థులకు అందించారు. తరువాత కథల రచన, చిత్రలేఖణ పోటీలు నిర్వహించగా,విద్యార్థులు అధిక ఉత్సాహం తో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేశారు.కథల పోటీలో జస్వంత్‌రెడ్డి,మఫీయా,భవిష్‌లు విజేతలుగా నిలిచారు. చిత్రలేఖన పోటీలో షేక్ రీను,భవ్య,రూఫియా, మేఘనలు విజేతలుగా నిలిచారు. పిల్లలకు ప్రోత్సాహం కల్పించడంలో కాకర్ల రమణయ్య సహకారం అందించారని, విజేతలకు బహుమతులు పంపిణీ చేశామని గ్రంధపాలకుడు షేక్ అహ్మద్ షరీఫ్ తెలిపారు.

## చిట్టాబత్తుని నరసారెడ్డి - భారతి వివాహ వేడుక

### - వైసీపీ నాయకుడు దద్దాల నారాయణయాదవ్ శుభాకాంక్షలు

**కనిగిరి, మే18, ప్రభాతవార్త**



కనిగిరి టౌన్‌లో తాళ్లూరి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన చిట్టా బత్తుని మాలకొండరెడ్డి, భాగ్యమ్మ దంపతుల కుమారుడు నరసారెడ్డి, భారతి వివాహ వేడుకకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కనిగిరి ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, చింతం శ్రీను, చిట్టాబత్తుని పెద్ద మాలకొండారెడ్డి, రేగుల బాలయ్య చౌదరి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి తదితరులు కూడా ఈ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేదిక ఆనందోత్సాహాలతో నిండిపోయింది. బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున హాజరై కొత్త దంపతులపై ఆశీర్వాద వర్షం కురిపించారు.

## డీసీఎంఎస్ అధ్యక్షుడుగా నియమితులైన శ్యామల కాశిరెడ్డికి అభినందనలు తెలిపిన నాయకులు

**కనిగిరి, మే 18, ప్రభాతవార్త**



కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ అధ్యక్షుడుగా నియమితులైన శ్యామల కాశిరెడ్డిని పలువురు నాయకులు కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో పామూరు మండల టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమా శ్రీనివాసరావు, రాష్ట్ర టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకరరావు, క్లస్టర్ గుంటుపల్లి శ్రీను, ఎస్‌కే రసూల్(కావేరి)లు ఉన్నారు.

## కల్లూరివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఇన్‌ఛార్జీ దద్దాల



**కనిగిరి, మే 18, ప్రభాతవార్త**

పామూరు మండల మోపాడు పంచాయతీలో వైసీపీ సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి సోదరుడు కల్లూరి ఆంజనేయులు రెడ్డి కుమారుడు జయరామిరెడ్డి, గానుగపెంట వెంకటకొండారెడ్డి(లేట్) కుమార్తె గానుగపెంట నాగేశ్వరిల కళ్యాణ మహోత్సవంలో కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగసాని లక్ష్మీ, గంగసాని హుస్సేన్‌రెడ్డి, చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, రేగుల బాలయ్య చౌదరి, సైకం ఏడుకొండలురెడ్డి, గోబ్బిళ్ల శ్రీనివాస్ యాదవ్, పాశం కొండయ్య, శ్రీరామ శ్రీనివాసులు, షేక్ గయాజ్, బోయల్లా మహేష్‌రెడ్డి, బోయల్లా తిరుపతిరెడ్డి, గానుగపెంట రామకృష్ణారెడ్డి, బోయల్లా మాధవరెడ్డి, కల్లూరి జగన్, వై.రామిరెడ్డి, పేరం కొండారెడ్డి, పాలకొండు హజరత్‌రెడ్డి, బోయల్లా మహేంద్ర, బోయల్లా సురేష్, జొన్నలగడ్డ ప్రహల్లాద్, సూరిపోగి మాల్యాద్రి, షేక్ ఖాజావలి, పాలేటి ప్రేమ్‌కుమార్, మితికాల బాలకృష్ణ, షేక్ నాగూర్‌భాష, గంటా మధు, ఇరగల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## వివాహానికి హాజరైన గొట్టిపాటి లక్ష్మీ, నూకసాని బాలాజీ


**కురిచేడు, మే 18, ప్రభాతవార్త**



మండలంలోని పడమర నాయుడుపాలెంలో జరిగిన టీడీపీ నాయకుడు గడ్డం బాలయ్య కుమారుడి వివాహానికి దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, జిల్లా టీడీపీ నాయకులు నూకసాని బాలాజీలు హాజరయ్యారు. వీరు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, మాజీ అధ్యక్షులు నాగరాజు, మాజీ ఎంపీపీ గడ్డం వెంకటరత్నం, నాయకులు మొగల్ మస్తాన్‌వలి, కాశీ, ఆదినారాయణ, కిలారి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడుగా వెంకటేశ్వరరెడ్డి

**తాళ్లూరు, మే18, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ తాళ్లూరు మండల అధ్యక్షులుగా లక్కవరం గ్రామానికి చెందిన మేడగం వెంకటేశ్వరరెడ్డి నియమించారు. దర్శిలో ఆదివారం మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, కడియాల రమేష్‌ల ఆధ్వర్యంలో వెంకటేశ్వరరెడ్డి పేరును ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీ పార్టీ అభివృద్ధి, కృషికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన అధిష్టానం ఆయనకు మండల టీడీపీ అధ్యక్షుడిగా పదవి వరించింది. గతంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పదవి సాధించారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకు గాను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, కడియాల రమేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన మండల నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

### శ్రీమార్తాండేశ్వరస్వామి వారి దేవస్థానం

## షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, మే18, ప్రభాతవార్త**

కనిగిరిలోని శ్రీమార్తాండేశ్వరస్వామి వారి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌ను స్థానిక శాసన సభ్యులు ఉగ్రనరసింహారెడ్డి, డీఈ శ్రీనివాస్, మారుతీ,ఆలయ ఈవో నరసింహాబాబులు పరిశీలించారు.

## టీడీపీ మండల అధ్యక్షుడిగా రెండో సారి కూరపాటి శ్రీను ఎన్నిక

**ముండ్లమూరు, మే18, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షుడిగా తిరిగి రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన శంకరాపురం గ్రామానికి చెందిన కూరపాటి శ్రీను. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎన్నిక జరుగుతుండగా టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ఆదేశాల మేరకు తిరిగి మరలా ఎన్నిక కావడం పట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీకి, లలిత్ సాగర్‌లకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపిన కూరపాటి శ్రీను. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో టీడీపీ బలోపేతం కోసం టీడీపీ కార్యకర్తలకి అండగా ఉంటానని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా కూరపాటి శ్రీనుకి మండలంలోని టీడీపీ నాయకులు సోమేపల్లి శ్రీనివాసరావు, కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, దేవినేని కోటి, బేతపూడి రామారావు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



## కూరపాటి శ్రీనుకి అభినందనలు తెలిపిన బేతపూడి రామారావు

**ముండ్లమూరు, మే18, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండల పార్టీ టీడీపీ అధ్యక్షుడిగా తిరిగి రెండో సారి ఎన్నికైన కూరపాటి శ్రీనివాసరావుని ఆదివారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపిన ముండ్లమూరు టీడీపీ నాయకులు బేతపూడి రామారావు. ఈ సందర్భంగా ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. మండలంలోని టీడీపీ కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ దర్శి మండల అధ్యక్షుడిగా మారెళ్ళ వెంకటేశ్వర్లు

**దర్శి, మే18, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ దర్శి మండల అధ్యక్షుడిగా రామచంద్రపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యదర్శి మారెళ్ళ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీకి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి మండలంలో తెలుగుదేశం పార్టీ పెరుగుదలకు దర్శి మండలంలో టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ కోసం నమ్ముకున్న వారికి అండగా ఉండటం జరుగుతుందన్నారు. మండల పార్టీ అధ్యక్షులు ఎన్నికలలో భాగంగా దర్శి మండల పార్టీ అధ్యక్షుడిగా ఆదివారం ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మారెళ్ళ వెంకటేశ్వర్లరెడ్డికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## కూచిపూడి కళలకు ప్రోత్సాహం అందిస్తాం

### - దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



**దర్శి, మే18, ప్రభాతవార్త**

కూచిపూడి కళలకు ప్రోత్సాహం అందిస్తామని దర్శి ఎమ్మెల్యే, వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం దర్శి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణంలో దర్శనాపురి కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటిక పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పాశ్చాత్య సంస్కృతిలో సమాజం కొట్టుమిట్టాడుతోందని, అలాంటి సందర్భంలో దర్శిలో అంతర్జాతీయ కూచిపూడి కళాకారిణి డాక్టర్ స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అలాంటి వారిని మేము సన్మానం చేయడం చాలా సంతోషంగాను అదృష్టంగాను ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

## టీడీపీ మండల శాఖ అధ్యక్షుడిగా రెండోసారి నెమిలయ్య ఎంపిక

**కురిచేడు, మే 18, ప్రభాతవార్త**



కురిచేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా మండలంలోని పడమర వీరాయపాలెనికి చెందిన పిడతల నెమిలయ్య రెండో సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం దర్శిలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన మండల పార్టీ అధ్యక్షుల ఎంపికలో భాగంగా నెమిలయ్యను ఎంపిక చేశారు. రెండో సారి అతనికి ఆ పదవి వరించడంతో పలువురు టీడీపీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. నెమిలయ్యకు అభినందనలు తెలిపారు.

## పెండ్లి కుమారుడిని ఆశీర్వదించిన వైకాపా నాయకులు

**పెద్దదోర్నాల, మే18, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల పట్టణం సుందరయ్య కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త వీరాంజి వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహానికి వైకాపా మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి, దోర్నాల ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, దోర్నాల మండల సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు, వైకాపా టీయుసీ యర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ షేక్షావలి, కాశయ్య, సర్దార్, విజయ్, వెంకీ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

## అందరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

### - శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామి



**మద్దిపాడు, మే18, ప్రభాతవార్త**

వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకోవడం మర్చిపోలేనని మంచి అనుభూతినిచ్చిందని శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి తెలిపారు. ఆదివారం సాయంత్రం గుండ్లపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద నెల 8వ తేదీన ప్రతిష్ఠ చేసిన వరసిద్ధి వినాయక స్వామి దేవాలయానికి విచ్చేశారు. ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి మాట్లాడుతూ వినాయకుని పూజా కార్యక్రమాలు క్రమపద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని అర్చకులకు సూచించారు. ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందానని తెలిపారు. ఇక్కడ స్వామివారికి జరిగే అభిషేకాలు, పూజలు కొన్ని చోట్ల మాత్రమే ఉంటాయని తెలిపారు. ప్రతి మనిషి సన్మార్గం ఆధ్యాత్మిక అలవర్చుకోవాలన్నారు. తద్వారా ఉత్తంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలన్నారు. భక్తితోనే సన్మార్గంగా నడుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎన్వి సుధాకర్, కార్యదర్శి సర్వేశ్వరరావు, కోశాధికారి అజిత్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంతిబాబు, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మండవ రత్నాకర్‌రావు, మండవ హరిబాబు, ఫ్యాక్టరీ ఓనర్స్ వరసిద్ధి వినాయక స్వామి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పీడీసీసీ బ్యాంకు నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు



**నాగులుప్పలపాడు, మే18, ప్రభాతవార్త**

పీడీసీసీ బ్యాంకు నూతన చైర్మన్ కామేపల్లి సీతారామయ్యని నిడమానూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నిడమానూరు టీడీపీ నాయకులు పైడి నాగేశ్వరరావు, మోషే, సౌలు, బాబురావు, వెంకట్రావు, సింగయ్య, హనుమంతరావు, చంద్రం, బాబు, వెంకటేశ్వర్లు, ప్రేమయ్య, హనుమంతరావు, చింపిరయ్య, లాజర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఓడా చైర్మన్‌గా సుచరిత..?

**నాగులుప్పలపాడు, మే18, ప్రభాతవార్త**



మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి చౌటపాలెం ఎంపీటీసీ ముప్పవరపు సుచరితను ఓడా చైర్మన్ రేసులో ఉన్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గంతో పాటు జిల్లాలో యువ నాయకత్వం వహిస్తున్న వీరయ్య చౌదరి హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు అన్ని విధాల అండగా ఉంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు మంత్రులు నారా లోకేష్ మరికొందరు ఆయన స్వగ్రామమైన అమ్మనబ్రోలు వచ్చి కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అన్ని విధాలు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇటీవల లోకేష్ పర్యటనలో గ్రామస్తులతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు మంత్రులు వీరయ్య చౌదరి కుటుంబానికి రాజకీయంగా ఉన్నత పదవి కేటాయిస్తే ఆయన వర్గానికి న్యాయం చేసినట్లు అవుతుందని భావిస్తుంది. గతంలో సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా ముప్పవరపు వీరయ్య చౌదరి ముందంజలో ఉండగా ఆయన హత్యానంతరం ఆ పదవిని ఒంగోలు ప్రముఖ వైద్యులు కామేపల్లి సీతారామయ్యకు దక్కింది. దీంతో వీరయ్య వర్గానికి ఓడా చైర్మన్ పదవి కేటాయిస్తే సముచితంగా ఉంటుందని ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు వివరించారు. ఆయన సుచితకు ఆ పదవి కేటాయించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. దీంతోనైనా ఆ కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ ఆదుకోవడంతో పాటు అండదండలు అందించినట్లు భావిస్తుంది.

## వివాహానికి హాజరై ఆశీర్వదించండి

### - ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు ఆహ్వానం

**పెద్దదోర్నాల, మే18, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లి గ్రామానికి చెందిన కోటేశ్వరరావు కాశమ్మల కుమార్తె మనోహరి వివాహం ఈ నెల 27వ తేదీన జరగనున్న నేపథ్యం లో వివాహానికి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించాలని పెద్దదోర్నాల సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు, వైకాపా టీయుసీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ షేక్షావలి ఆధ్వర్యంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు వివాహ శుభలేఖను అందించి ఆహ్వానించారు.

## అహంకారాన్ని తొలగించే ప్రళయకాల రుద్రుడు వీరభద్రస్వామి

**ఒంగోలు కల్చరల్ ,మే 18,ప్రభాతవార్త**







అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. వైశాఖమాసం పంచమి పుణ్య తిధిని పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీశైల దేవస్థానంలోని ధర్మనిధి వేదికపై "వీరభద్ర విజయం" అనే అంశంపై పొన్నూరు వేంకట శ్రీనివాసులు ఆధ్యాత్మిక ప్రసంగంచేశారు. దక్షుడి అహంకారాన్ని తొలగించడానికి, దక్షయజ్ఞం ధ్వంసం చేయటానికి ఆవిర్భవించిన మూర్తి వీరభద్రుడు అని అన్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వచ్చే వేలాదిమంది భక్తులను, క్షేత్రాన్ని రక్షించేందుకు బయలు వీరభద్రుడిగా, శ్రీశైలం క్షేత్రపాలకుడిగా కొలువుతీరి ఉన్నాడని అన్నారు. శివ దూషణ చేయడం, శివదూషణ వినటం కూడా పాపమని శివ దూషణకు పాల్పడిన దక్షుడి శిరస్సుని ఖండించి దేవతలందరికీ ఆరాధ్యుడు, పూజ్యుడు వీరభద్రుడు అయ్యాడని అన్నారు. వీరభద్రుడి చరిత్ర చదవడం వినడం మోక్షదాయకమని తెలిపారు. మహాకవి పోతన రచించిన వీరభద్ర విజయం లోని అద్భుతమైన పద్యాలతో పొన్నూరు వేంకట శ్రీనివాసులు ఉపన్యాసం ఆద్యంతం ప్రేక్షకులను మంత్రముగ్ధలను చేసింది. అనంతరం ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసుని దేవస్థానం నాట్యాచార్యులు శ్రీసాయి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులును శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు పి ఆర్ ఓ టి.శ్రీనివాసులు శ్రీశైల ప్రభ ఎడిటర్ అనిల్ కుమార్ అభినందించారు.

# భారత్ మామిడిపండ్లను తిరస్కరించిన అమెరికా!

**15 కంటైనర్ల పండ్లను ధ్వంసంచేసిన ఎగుమతిదారులు**



**లాస్ ఏంజెల్స్, మే 18:** భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయిన మామిడి పండ్లు పత్రాల్లో లోపాల కారణంగా తిరస్కరణకు గుర య్యాయి. సుమారు 15 కంటైనర్ల మామిడి పండ్లను అమెరికా అధికారులు వెనక్కి పంపారు. తప్పనిసరిగా చేయించాల్సిన ఇర్రేడియేషన్ ప్రక్రియకు సంబంధించిన డాక్యుమెంటేషన్‌లో పొరపాట్లు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ పరిణామంతో భారత ఎగుమతిదారులు సుమారు 5 లక్షల డాలర్లు అంటే దాదాపు రూ.4.15 కోట్లు నష్టపోయారని అంచనా. పండ్లను వెనక్కి రప్పించేందుకు అయ్యే ఖర్చు అధికంగా ఉండటంతో, వ్యాపారులు వాటిని అమెరికాలోనే ధ్వంసం చేయాల్సి వచ్చింది. లాస్ ఏంజెల్స్, శాన్ ఫ్రాన్సిస్కో, అట్లాంటా వంటి పలు అమెరికా విమానాశ్రయాల్లో ఈ మామిడి పండ్ల షిప్‌మెంట్లను నిలిపివేశారు. ఈనెల 8, 9 తేదీల్లో ముంబైలోని ఈ మామిడి పండ్లకు ఇర్రేడియేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. అయితే, ఈ ప్రక్రియకు సంబంధించిన పత్రాల్లో ముఖ్యంగా పీపీక్యూ203 ఫారంలో తప్పులు దొర్లాయని అమెరికా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. పండ్లలో పురుగులు ఉన్నందువల్ల కాదని, కేవలం నిర్వహణ లోపాల వల్లే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఇర్రేడియేషన్ అనేది పండ్లలోని కీటకాలను నిర్మూలించి, వాటి నిల్వ కాలాన్ని పెంచడానికి ఉపయోగించే ప్రక్రియ.

"పీపీక్యూ203 ఫారం సరిగ్గా జారీ చేయనందున" సరకును తిరస్కరించినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తమకు తెలిపిందని ఓ ఎగుమతిదారు వాపోయారు. సరకును వెనక్కి పంపాలి లేదా ధ్వంసం చేయాలి. దీనికి అయ్యే ఖర్చును అమెరికా ప్రభుత్వం భరించదు అని యూఎస్‌డీఏ స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. నవీ ముంబైలోని ఇర్రేడియేషన్ కేంద్రంలో అమెరికా వ్యవసాయ విభాగం (యూఎస్‌డీఏ) ప్రతినిధి పర్యవేక్షణలోనే ఈ ప్రక్రియ జరుగుతుంది. అమెరికాకు మామిడి పండ్ల ఎగుమతికి అవసరమైన పీపీక్యూ203 ఫారంను కూడా ఆయనే ధ్రువీకరించాలి. ఇర్రేడియేషన్ కేంద్రంలో జరిగిన పొరపాట్లకు మేం నష్టపోవాల్సి వస్తోంది అని ఒక ఎగుమతిదారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల తొమ్మిది, 11 తేదీల మధ్య లాస్ ఏంజిల్స్ విమానాశ్రయంలో తన సరకును నిలిపివేసి, ఆ తర్వాత ధ్వంసం చేయాలని ఆదేశాలు అందుకున్న మరో ఎగుమతిదారు మాట్లాడుతూ, తప్పనిసరి ఇర్రేడియేషన్‌కు సంబంధించిన నిబంధనలు పాటించలేదని మాకు తెలిపారు. ఇది పూర్తిగా అవాస్తవం. ఇర్రేడియేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే మాకు పీపీక్యూ203 ఫారం ఇచ్చారు. యూఎస్‌డీఏ అధికారి జారీ చేసిన ఆ ఫారం లేకుండా ముంబై విమానాశ్రయంలో మామిడి పండ్లను విమానంలోకి ఎక్కించడానికి కూడా అనుమతించరని ఆయన అన్నారు. భారతదేశ మామిడి పండ్లకు అమెరికా ప్రధాన ఎగుమతి మార్కెట్ కావడంతో, ఈ ఘటన వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సమస్యపై, ప్రభావితమైన మామిడి పండ్ల పరిమాణం, పత్రాల్లోని లోపాల గురించి అడిగినప్పుడు, వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (అపెడా) ప్రెస్ కార్యాలయం స్పందించింది. ఈ వ్యవహారం ముంబై వాషిలోని యూఎస్‌డీఏ మహారాష్ట్ర రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు (ఎంఎస్‌ఏఎంబీ) కేంద్రానికి సంబంధించినది. కాబట్టి దీనిపై వారిని వివరణ కోరాలని సూచించారు. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ కింద అపెడా పనిచేస్తుంది. అయితే, ఈమెయిల్ ద్వారా వివరణ కోరినప్పటికీ ఎంఎస్‌ఏఎంబీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.



## కాల్పుల విరమణకు స్పష్టమైన గడువు తేదీ ఏదీలేదు..

**భారత్ రక్షణశాఖ వెల్లడి**

**న్యూఢిల్లీ, మే 18:** భారత-పాక్ మధ్య కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదని రక్షణ శాఖ వెల్లడించింది. కాల్పుల విరమణ అవగాహనకు గడువు ముగుస్తోందనే వార్తలను రక్షణ శాఖ వర్గాలు ఖండించాయి. ఈనెల 10న ప్రారంభించిన కాల్పుల విరమణ అవగాహన మేరకే కొనసాగుతోందని స్పష్టంచేశాయి. ఆదివారం భారత్-పాక్ డీజీఎంవోల చర్చల్లో తీసుకున్న నిర్ణయాలే కొనసాగుతాయని పేర్కొన్నాయి. 10వ తేదీన డీజీఎంవోల మధ్య జరిగిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాలకు కాలపరిమితి లేదని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం ఎలాంటి డీజీఎంవో స్థాయి చర్చలు లేవని తెలిపాయి. అంతకుముందు మే 12న జరిగిన డీజీఎంవోల మధ్య చర్చలు జరగగా, అందులో ఇరుపక్షాలు ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు కాల్పులు జరపకూడదని నిర్ణయం తీసుకున్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని, శత్రుత్వ చర్యలు తీసుకోకూడదనే విషయాలకు కట్టుబడి ఉండాలనే దానిపై చర్చించారు. అదేవిధంగా సరిహద్దులు, ఫార్వర్డ్ బేస్ ప్రాంతాల్లో బలగాల తగ్గింపును పరిగణించాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి భారత సైన్యం వెస్ట్రన్ కమాండ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేసింది. ఉగ్రవాదులు, పాకిస్థాన్ సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన దృశ్యాలను అందులో పొందుపర్చింది. ఆపరేషన్ సిందూర్ పాక్‌పై ప్రతీకార దాడి కాదని పహల్గాం ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయడమని భారత సైన్యం పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి పర్యాటకులపై కాల్పులు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరయ్యింది. ఈ దాడుల్లో సుమారు 100మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. అయితే, ఎదురు దాడులు చేసేందుకు దాయాది దేశం యత్నించినప్పటికీ భారత బలగాల దెబ్బకు తట్టుకోలేకపోయింది. వివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని పాకిస్థాన్ కోరడంతో అందుకు భారత్ అంగీకరించడంతో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. పరిస్థితులు తీవ్ర రూపం దాలుస్తున్న వేళ ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది.

# మలివిడత బెయిలౌట్ ప్యాకేజికి ఐఎంఎఫ్ సవాలక్ష షరతులు



**న్యూయార్క్, మే 18:** దాయాది దేశం పాకిస్థాన్‌కు బిగ్ షాక్. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్‌పై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ఫుల్ ఫోకస్ చేసింది. ఈ క్రమంలో పాకిస్థాన్ తన బెయిలౌట్ ప్రోగ్రామ్ మలి విడత విడుదల కోసం 11 కొత్త షరతులను విధించింది. ఈ పథకం ఆర్థిక, బాహ్య, సంస్కరణ లక్ష్యాలకు గణనీయమైన ప్రమాదాలను పెంచుతాయని ఐఎంఎఫ్ హెచ్చరించింది. పాకిస్థాన్‌పై విధించిన కొత్త షరతులలో రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం, విద్యుత్ బిల్లులపై రుణ సేవల సర్ ఛార్జ్ పెంపు, మూడేళ్లకు మించి ఉపయోగించిన కార్లను దిగుమతి చేసుకోవడంపై ఉన్న పరిమితులను తొలగించడం సహా 11 షరతులు ఉన్నాయి. తాజాగా విధించిన షరతులతో ఐఎంఎఫ్ పాక్‌కు విధించిన షరతుల సంఖ్య 50కి చేరింది. గత రెండు వారాల్లో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు గణనీయంగా పెరిగాయి. స్టాక్ మార్కెట్ లాభాల్లో ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పాక్ రక్షణ బడ్జెట్ రూ.2.414 ట్రిలియన్లుగా ఉంది. ఇది గతేడాది పోలిస్తే రూ.252 బిలియన్లు లేదా 12శాతం ఎక్కువ. మే ప్రారంభంలో భారత్‌తో ఘర్షణ తర్వాత పాక్ సర్కార్ రూ.2.5 ట్రిలియన్లు లేదా 18శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించనుందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. 2025 జూన్ నాటికి ఐఎంఎఫ్ ఒప్పందానికి అనుగుణంగా వచ్చే ఆర్థికబడ్జెట్‌ను పార్లమెంట్ ఆమోదించాలి. అలాగే ఫెడరల్ బడ్జెట్ మొత్తాన్ని రూ.17.6 ట్రిలియన్లుగా అంచనా వేసింది ఐఎంఎఫ్. ఇందులో అభివృద్ధి వ్యయం కోసం కేటాయించిన రూ.1.07 ట్రిలియన్లు ఉంది. నాలుగు ప్రావిన్సులు కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలను అమలు చేయాలి. పన్ను రిటర్న్ ప్రాసెసింగ్, పన్ను చెల్లింపుదారుల గుర్తింపు, నమోదు, కమ్యూనికేషన్ క్యాంపెయిన్, సమ్మతిని మెరుగుపరచడానికి వ్యూహాల కోసం ఒక కార్యాచరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. ఐఎంఎఫ్ సూచించిన గవర్నెన్స్ డయాగ్నొస్టిక్ అసెస్మెంట్ ఆధారంగా ప్రభుత్వ బలోపేతానికి చేపట్టే యాక్షన్ ప్లాన్‌ను ప్రభుత్వం రూపొందించాలి. అంతేకాకుండా 2027 తర్వాతి ఆర్థిక రంగ వ్యూహాన్ని వివరించే ప్రణాళికను సిద్ధం చేయాలి. అలాగే ఇంధన రంగంలో నాలుగు కొత్త షరతులను విధించింది. ఇంధన సుంకాలను కాస్ట్ రికవరీ స్థాయిలలో నిర్వహించడానికి ప్రభుత్వం ఈ ఏడాది జులై 1 నాటికి వార్షిక విద్యుత్ సుంకాల పునర్వ్యవస్థీకరణ నోటిఫికేషన్‌లను జారీచేయాలి. 2035 నాటికి ప్రత్యేక సాంకేతిక జోన్లు, ఇతర పారిశ్రామిక ప్రాంతాలకు సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలను తొలగించడానికి ప్రభుత్వం ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని ఐఎంఎఫ్ షరతులు విధించింది.

# రాహుల్ వ్యాఖ్యలు తప్పుదారిపట్టించేవిగా ఉన్నాయి



**భారత్ విదేశాంగ శాఖ స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, మే 18:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌కు సమాచారం అందించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఇదే విషయంపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌పై ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసిన విషయాన్ని పాక్‌కు తెలియజేయడానికి ప్రయత్నించామని తెలిపారు. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడిచేసిన విషయాన్ని పాకిస్థాన్ డీజీఎంఓకు తెలియజేశాం. ఈ చర్యను పాకిస్థాన్ తిరస్కరించింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన వెంటనే పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన విషయాన్ని చెప్పేందుకు ప్రయత్నించామని, పాకిస్థాన్ ఈ విషయంపై తీవ్రంగా స్పందించిందని డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌పై వ్యాఖ్యానించారు. అంతకుముందు పాక్ ఉగ్రవాద వ్యవస్థలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర సర్కారు ఆ దేశానికి చెప్పి తప్పు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

పాక్‌పై దాడి గురించి ఆ దేశానికి ముందే సమాచారం ఇవ్వడం నేరం. కేంద్ర ప్రభుత్వం ఇదే పని చేసిందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బహిరంగంగా అంగీకరించారు. వారికి అలా వెల్లడించడానికి ఎవరు అధికారం ఇచ్చారు. దాని ఫలితంగా ఈ ఆపరేషన్లో భారత వాయుసేన ఎన్ని విమానాలు కోల్పోయిందో చెప్పాలని రాహుల్ సోషల్‌మీడియాలో పశ్నలు గుప్పించారు. దీనికి జైశంకర్ వ్యాఖ్యల వీడియోను జోడించారు. అయితే రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఈ వ్యాఖ్యలు వాస్తవాలను పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ మొదలైన తొలి దశలో చేసిన హెచ్చరికను, ఆపరేషన్‌కు ముందు చేసినట్లు ఆరోపించడం తప్పుడు వ్యాఖ్యగా తెలిపింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట వైమానిక దాడులు జరిపింది. టెర్రర్ గ్రూప్స్ లష్కరే తోయిబా, జైషే మహ్మద్ స్థావరాలపై విరుచుకుపడింది. దీంతో దాదాపు 100 మంది ముష్కరులు హతమయ్యారు. ఆ తర్వాత పాక్ కూడా భారత్‌పై క్షిపణ దాడులు చేసేందుకు ప్రయత్నించగా, ఇండియన్ ఆర్మీ తిప్పికొట్టింది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

## సరిహద్దుల్లో సైనిక ఆపరేషన్

**పేలని పాక్ బాంబులు, గ్రెనేడ్లను నిర్వీర్యంచేసిన దళాలు**

**అఖ్నూర్(జమ్ము), మే 18:** పాకిస్థాన్‌తో సైనిక ఉద్రిక్తతలు తగ్గిన నేపథ్యంలో సైన్యం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తోంది. స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారిన పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్‌ను, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. పహల్గాంలో 26మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈనెల 7న సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపింది. ఆ తర్వాత పాక్ రేంజర్లు నియంత్రణ రేఖతోపాటు, అంతర్జాతీయ సరిహద్దు వెంట పెద్దఎత్తున షెల్లింగ్‌కు పాల్పడ్డారు. జనావాసాలపై పెద్దఎత్తున దాడులకు పాల్పడ్డారు. వాటిని సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. అయితే పాకిస్థాన్ రేంజర్లు జరిపిన దాడుల్లో కొన్ని ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లు, బాంబులు పేలలేదు. వాటిలో కొన్ని నివాస ప్రాంతాలు, పంట పొలాల్లో పడ్డాయి. అవి స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంట ఉన్న అఖ్నూర్ సెక్టార్‌లో సైన్యం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మొత్తం 16 షెల్స్‌ను సైన్యం నిర్వీర్యం చేసింది. అఖ్నూర్‌లో పెద్దఎత్తున బాంబు దాడులు జరిగాయి. షెల్స్ ఇళ్ల ముందూ, వెనుకా పడ్డాయి. కొన్ని పొలాల్లో పడ్డాయి. పేలనివి అలాగే ఉండిపోయాయి. వాటిని నిర్వీర్యం చేసేందుకు జమ్మూ నుంచి సైన్యం వచ్చింది. అఖ్నూర్‌కు ఓ బృందం వచ్చింది. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు పొలాలకు వెళ్లిన సైన్యం వాటిని నిర్వీర్యం చేస్తోందని స్థానికులు చెప్పారు. పాకిస్థాన్ వైపు నుంచి పెద్దఎత్తున కాల్పులు జరిగాయి. పెద్దపెద్ద షెల్స్ పడ్డాయి. వాటిలో కొన్ని పేలలేదు. జమ్మూ నుంచి సైనిక బృందం వచ్చింది. పేలని బాంబులను నిర్వీర్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు పది బాంబులను నిర్వీర్యం చేశారు. తమమ భద్రతకు ప్రమాదకరంగా మారిన షెల్స్‌ను నిర్వీర్యం చేసిన సైన్యానికి అఖ్నూర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు తాము నిశ్చింతగా ఉండొచ్చని సంతోషం వ్యక్తం చేశారు. లేకుంటే ఎక్కడ, ఎప్పుడు ఏ బాంబు పేలుతుందో అనే భయంతో రోజులు గడపాల్సి వచ్చేదని స్థానికులు తెలిపారు.

## పాకిస్థాన్‌లో తీవ్రమౌతున్న ఆహార సంక్షోభం

**11 మిలియన్ల మందికి దక్కని పౌష్టికాహారం**



**న్యూయార్క్, మే 18:** పాకిస్థాన్ తీవ్ర ఆహార సంక్షోభంలో ఉందని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ఆహార, వ్యవసాయ సంస్థ నివేదికలో తేలింది. 11 మిలియన్ల మందిపై ఈ ఆహార కొరత ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి వరకు పాక్‌లో అధిక స్థాయిలో ఆహార సంక్షోభం కొనసాగిందని వెల్లడైంది. ఆహార సంక్షోభాలపై ప్రపంచ నివేదికను ఎఫ్‌ఏఓ విడుదల చేసింది. దీని ప్రకారం బలూచిస్థాన్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా వంటి వరద ప్రభావిత జిల్లాల్లో 11 మిలియన్ల మంది లేదా జనాభాలో 22శాతం మంది తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటారని అంచనా. ఇందులో 1.7 మిలియన్ల మంది పరిస్థితి మరింత దారుణంగా ఉందని తేల్చింది. 2024 గరిష్ఠ స్థాయి ఆహార కొరతతో పోలిస్తే 2025లో మరో 38 శాతం పెరిగే అవకాశం ఉంది. గతేడాది పోలిస్తే ఆహార కొరత తగ్గినప్పటికీ వాతావరణ పరిస్థితులు ప్రజల జీవనోపాధిని ప్రభావితం చేస్తాయి. 2023 నవంబర్ నుంచి 2024 జనవరి మధ్య 11.8 మిలియన్ల ప్రజలు అధిక స్థాయిలో తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు. 2023 మార్చి 2024 జనవరి వరకు 6 నుంచి 59 నెలల వయసు గల 2.1 మిలియన్ల మంది పిల్లలు పోషకాహార లోపంతో ఇబ్బందిపడుతున్నారు. గర్భిణీలు, పాలిచ్చే బాలింతల్లో పోషకాహార లోపం ఎక్కువగా ఉంది. అలాగే సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో చాలా మంది చిన్నారులు తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. శీతాకాలంలో విరేచనాలు, తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, మలేరియాతో బాధపడుతున్నారు. పారిశుద్ధ్య సౌకర్యాలు, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఎఫ్‌ఏఓ తన నివేదికలో తెలిపింది.



## విస్తరిస్తున్న కొత్త కరోనా

**పెరుగుతున్న కేసులు..కొత్త వ్యాక్సిన్‌కు ఆమోదం!**

**న్యూఢిల్లీ, మే 18:** ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆసియా దేశాల్లో (హాంకాంగ్-సింగపూర్) పెరుగుతున్న కరోనా కేసులు ఆరోగ్య నిపుణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. గత కొన్ని వారాల్లో కరోనా కేసులు గణనీయంగా పెరిగాయని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కరోనా ఇన్‌ఫెక్షన్ కేసులు పెరగడమే కాకుండా చాలాచోట్ల ఆస్పత్రుల్లో చేరే రోగుల సంఖ్య పెరిగింది. ఈ పెరుగుతున్న కేసులకు కొత్త వేరియంట్ కారణమని ఇప్పటివరకు నిపుణులు ప్రకటించలేదు. అయితే, వ్యాక్సిన్ రోగ నిరోధక శక్తి తగ్గుతోందని, ఫలితంగా వైరస్ ప్రభావం మరోసారి కనిపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగా కరోనాకు బూస్టర్ వ్యాక్సిన్ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా రక్షణ ఉంటుందన్నారు. గతంలో ఫ్లూ మాదిరిగానే కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని పలు ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం హాంకాంగ్, సింగపూర్ వంటి నగరాల్లో ఆస్పత్రిలో చేరడం, మరణాలతోపాటు కొత్త కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్య సంస్థలు ప్రజలను అప్రమత్తం చేశాయి. మరోవైపు పెరుగుతున్న ముప్పు మధ్య యుఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) నోవావాక్స్ కొత్త వ్యాక్సిన్‌ను ఆమోదించింది. అమెరికాకు చెందిన నెబ్రాస్కా మెడిసిన్‌లో అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ మార్క్ ఇ రూప్ మాట్లాడుతూ ప్రస్తుతం అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఎల్‌పి 8.1వేరియంట్ ద్వారా కేసులు పెరుగుతున్నాయన్నారు. 70శాతం కేసులకు ఈ వేరియంట్ కారణమని 9శాతం కేసులకు ఎక్స్‌ఎఫ్‌సి వేరియంట్ కారణమన్నారు. కాలక్రమేణా ప్రజల రోగనిరోధక శక్తి బలహీనపడడం వల్ల వైరస్ మరింత సులభంగా వ్యాపిస్తుందని పలు నివేదికలు పేర్కొన్నాయి.

# మెరైన్ ఉత్పత్తుల్లో నాలుగో అతిపెద్ద దేశంగా భారత్



**న్యూఢిల్లీ, మే 18:** దేశ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి తయారీ రంగానికి ప్రాధాన్యత ఉన్న చోట ప్రోత్సహిస్తోంది. మరోవైపు, ఎగుమతులను పెంచడంపై ప్రభుత్వం వేగంగా కృషి చేస్తోంది. అటువంటి పరిస్థితిలో, ప్రభుత్వం పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం కనిపిస్తోంది. ఇప్పుడు, ఎగుమతులకు సంబంధించి భారతదేశానికి వచ్చిన వార్తలను బట్టి, ప్రపంచ స్థాయిలో భారతదేశం తన బలాన్ని అమాంతం పెంచుకుంటోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతి పరంగా ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించింది. భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులలో నాల్గవ అతిపెద్దదిగా అవతరించింది. 2014-15లో 105 దేశాలు భారతీయ సముద్ర ఉత్పత్తులను దిగుమతి చేసుకోగా, 2025 ఆర్థిక సంవత్సరంలో 130 దేశాలు పెరిగాయని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024-25లో, భారతదేశం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటి) సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 201415లో ఇది 10.51 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఆక్వాకల్చర్ పద్ధతుల్లో పురోగతి, మెరుగైన కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ నాణ్యత నిబంధనలకు కట్టుబడి ఉంది. దీంతో దేశ సముద్ర ఎగుమతులు 2015 ఆర్థిక సంవత్సరంలో 5.4 బిలియన్ల నుండి 2024-25 నాటికి 7.2 బిలియన్లకు పెరుగుతాయని అంచనా. ఎగుమతి గమ్యస్థానాలు ఈ వైవిధ్యీకరణ మార్కెట్ నష్టాలను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధికి అవకాశాలను తెరుస్తుందని ఆయన అన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం ర్యాంకింగ్ 2014-15లో ఎనిమిదవ స్థానం నుండి నాలుగు స్థానాలు మెరుగుపడింది. ఇది ప్రపంచ మార్కెట్‌లో దాని పెరుగుతున్న పోటీతత్వాన్ని, విశ్వసనీయతను సూచిస్తుంది. ఈ కాలంలో 3.15 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటుతో, భారతదేశం ప్రపంచ సగటు వృద్ధి రేటు 2.7 శాతం కంటే ముందుంది, అంతర్జాతీయ మత్స్యరంగంలో దాని వృద్ధి స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.

# అమెరికాలో టోర్నడోల బీభత్సం



**మిస్సోరి, మే 18:** అమెరికాలోని లారెల్ కౌంటీలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో టొర్నడో బీభత్సం సృష్టించింది. దీంతో సుమారు 21 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల కోసం రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ తుఫాన్, టోర్నడోల ఎఫెక్ట్‌తో ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఎమర్జెన్సీ ప్రకటించారు. భారీ ఈదురుగాలులతో స్థంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. మిస్సోరీలో, కెంటకీ రాష్ట్రాల్లో శుక్రవారం టోర్నడోలు బీభత్సం సృష్టించడంతో భారీగా ప్రాణనష్టం జరిగింది. కొన్ని నివేదకల ప్రకారం రద్దీగా ఉండే రహదారిపై ఈ టోర్నడోలు ప్రారంభమై నగరంలో 20 చదరపు బ్లాక్‌ల ప్రాంతంలో విధ్వంసం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ కారణంగా మిస్సోరీలో ఐదువేల భవనాలకుపైగా దెబ్బతిన్నాయని మేయర్ కారా తెలిపారు. స్కాట్ కౌంటీలోనూ టోర్నడోల బీభత్సంలో ఇద్దరు మరణించడంతో పాటు అనేక ఇళ్లు ధ్వంసంమైనట్టు తెలుస్తోంది. ఇవే కాకుండా ఇల్లినోయిలో కూడా టోర్నడోలు బీభత్సం సృష్టిస్తున్నట్టు యూఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ తెలిపింది.

# లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ ఖతం



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హతమయ్యాడు. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు సైఫుల్లా ఖలీద్‌ను మట్టుబెట్టినట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఇండియాలో జరిగిన మూడు ఉగ్రదాడుల్లో సైఫుల్లా ఖలీద్ కీలకంగా వ్యవహరించాడు. 2001లో రాం పూర్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంపుపై దాడి చేశాడు. బెంగళూరులో 2005లో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో దాడులకు పాల్పడ్డాడు. 2006లో నాగ్‌పూర్‌లోని ఆర్ ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడంలో కీలకంగా వ్యవహరించాడు సైఫుల్లా ఖలీద్. ఐదేండ్ల వ్యవధిలోనే జరిగిన ఈ దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక ఖలీద్ నేపాల్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. అక్కడ వినోద్ కుమార్ పేరుతో తప్పుడు ధృవపత్రాలు సృష్టించి, స్థానిక మహిళ నగ్మా బానును వివాహం చేసుకున్నాడు. లష్కరే తోయిబా కార్యకలాపాలను నేపాల్ నుంచే ఖలీద్ సమన్వయం చేసినట్లు సమాచారం. ఇటీవల ఖలీద్ తన స్థావరాన్ని పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ బాదిన్ జిల్లాలోని మట్లీకి మార్చాడు. లష్కరే తోయిబాతో పాటు దాని ప్రధాన సంస్థ జమాద్‌ఉద్‌దవా కోసం ఖలీద్ పని చేస్తున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలతోపాటు నియామకాలు, నిధుల సేకరణపై సైఫుల్లా దృష్టి సారించాడు.

## ప్రపంచదేశాలకు మేం కూడా పంపిస్తున్నాం..

**భారత్‌ను కాపీకొడుతున్న పాకిస్థాన్**



**ఇస్లామాబాద్, మే 18:** ఆపరేషన్ సిందూర్‌తో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనే ఉంది. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమనే సందేశాన్ని ప్రపంచ దేశాలకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం ఏడు బృందాలను విదేశాలకు పంపాలని నిర్ణయం తీసుకోవటంతో పాకిస్థాన్ కూడా తమ ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆలోచిస్తోంది. పాకిస్థాన్ ప్రతినిధి బృందానికి సారథ్యం వహించాలని విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టోను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కోరారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో బిలావల్ పోస్టు పెట్టారు. అంతర్జాజీయ సమాజానికి పాకిస్థాన్ వైఖరిని వివరించే బృందానికి నాయకత్వం వహించాలని ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కోరగా అంగీకరించాను. నాపై పెట్టినబాధ్యతలనునిర్వర్తిస్తాను. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో దేశానికి సేవ చేసేందుకు సిద్ధంగాఉన్నానని భుట్టో పోస్ట్ చేశారు.

## పూరీ జగన్నాథుని మహాప్రసాదానికి అపచారం

**డైనింగ్‌టేబుల్‌పై కూర్చుని తిన్న విడియో వైరల్**



**పూరి, మే 18:** పూరీ జగన్నాథ ఆలయానికి చెందిన మహాప్రసాదాన్ని ఒక కుటుంబం డైనింగ్ టేబుల్‌పై కూర్చుని తింటున్న వీడియో వివాదానికి దారితీసింది. పూరీ జగన్నాథుడికి సమర్పించబడిన పవిత్ర ఆహారం మహాప్రసాదం, దీనిని సాంప్రదాయకంగా నేలపై కూర్చుని తింటారు. పూరీలోని ఒక బీచ్ రిసార్ట్‌లో డైనింగ్ టేబుల్ వద్ద పూజారి మహాప్రసాదం వడ్డిస్తుండగా పిల్లలతో సహా కనీసం 10 మంది కుటుంబ సభ్యులు తింటూ కనిపించారు. ఒక వ్యక్తి వారిని మహాప్రసాదం అలా తినకూడదు అని వారించారు. పూజారి మీరు అలా ఎందుకు వడ్డిస్తున్నారంటూ ప్రశ్నించాడు. ఈ వీడియో వైరల్ అవ్వడంతో జగన్నాథభక్తులలో ఆందోళనలు తలెత్తడంతో ఆలయ అధికారులు టేబుల్ వద్దమహాప్రసాదంతినడం సంప్రదాయానికి విరుద్ధమని పేర్కొంటూ ప్రకటన విడుదల చేశారు.



మురళినాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్

## మురళినాయక్‌కు పరమవీరచక్రకై ప్రతిపాదనలు పంపుతాం

### పెద్దకర్మ కార్యక్రమంలో మహారాష్ట్ర నీటిపారుదల మంత్రి సంజయ్‌రాథోడ్

**గోరంట్ల, మే 18 ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రమూకలను అంతమొందించడానికి ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన బంజారా బిడ్డ మురళినాయక్‌కు కేంద్ర ప్రభుత్వం నుండి పరమవీరచక్ర బిరుదు అందే విధంగా మహారాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిపాదనలు పంపుతామని మహారాష్ట్ర నీటిపారుదల శాశా మంత్రి సంజయ్‌రాథోడ్ పేర్కొన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన మురళినాయక్ పెద్దకర్మ కార్యక్రమానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కల్లితండాలోని వీర జవాన్ మురళి నాయక్ నివాసానికి మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్‌తో పాటు ప్రఖ్యాత తెలంగాణ సింగర్ మంగ్లీ, కర్ణాటకకు చెందిన కేంద్ర మాజీ మంత్రి చౌహాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళి నివాసంలో వారు మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జోహార్లు పలికారు. అనంతరం మహారాష్ట్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి తాండాలోనూ మురళి చిత్రపటాలకు గిరిజనులు నివాళులు అర్పిస్తున్నారని దేశవ్యాప్తంగా బంజారాలు మురళి కుటుంబానికి అండగా వుంటున్నారని పేర్కొన్నారు. మురళి కుటుంబీకులు గతంలో ముంబై నగరంలో కొన్నేళ్లపాటు నివాసముండే వారని ఇప్పటికీ వారి సమీప బంధువులు అక్కడే వుంటున్నారని మురళి కుటుంబ సభ్యులను మేము స్థానికులుగా భావించి మా ప్రభుత్వం వారికి అండగా వుంటుందని అన్ని రకాల సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. అనంతరం మురళి అంత్యక్రియలు నిర్వహించిన సమాధి వద్దకు వెళ్లి అక్కడ నివాళులర్పించి జోహార్లు పలికారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సిఐ బోయశేఖర్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, బంజారా సంఘం రాష్ట్ర నాయకులు శంకర్‌లాల్‌నాయక్, గంపల రమణారెడ్డి, పుడగుండ్లపల్లి శివారెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, గోరంట్ల జెడ్‌పిటిసి పాలే జయరాంనాయక్, నాగేనాయక్, సర్పంచు వాసునాయక్, రాజేష్‌నాయక్, మాజీ సర్పంచు రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారం



**శ్రీశైలంప్రాజెక్టు,మే18,ప్రబాతవార్త:** శ్రీశైలక్షేత్రంలో భ్రామరి పుష్పవనం సమీపంలో అదివారంనాడు పెద్ద పులి ప్రత్యక్షం అయింది. డంపుయార్డు దగ్గర జెసిపితో భూమి చదును చేస్తుండడంతో అక్కడ పనిచేస్తున్న కూలిల కంటపడడంతో జెసిపి డ్రైవర్ దగ్గర ఉన్న చరవాణిలో రికార్డు చేయడం జరిగింది. పులి అకస్మాత్తుగా వారి కంటపడడంతో ఒకింత భయోదళనకు గురిఅయా ్యరు. కూలిల కదలికలను పసిగట్టిన పెద్దపులి కొంచం సేపు అటుఇటు తిరిగి తిరిగి అటవిప్రాంతంలోకి పోవడం జరిగింది. ఈ నేపథ్యాంలోనే పెద్ద పులి సంచారంతో స్థానికుల్లో భయోంధళన మొదలైంది. గతంలో కూడా శ్రీశైలంలో నివాసం ఉండే ఓ పూజారి ఇంట్లోకి కూడా చిరుతపులి వచ్చిన సంగతి సిసి కేమేరాల్లో రికార్డు అయిన సంగతి పాఠకులకు విధితమే. పులి సంచారంపై విషయం తెలుసుకున్న స్థానిక అటవిశాఖ అధికారులు అప్రమత్తం అయి సంఘటన స్థలికి చేరుకోని పెద్దపులి ఎక్కడి నుండి వచ్చింది ఎటు వైపు మరల వెళ్లింది అని విషయంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరుగుతుంది. పులి సంచా రంతో స్థానికులు కూడా ఏవ్వరు కూడా అటవిప్రాంతం వైపు వెళ్లవద్దు అని స్థానికులకు అటవిశాఖ అదికారులు అప్రమత్తం చేయడం జరుగుతుంది. జనసంచారంలోకి రాకుండా అటవిశాఖ అధికారులు చర్యలకు సిద్దమవుతున్నారు.

## కాణిపాకంలో భక్తుల వేసవి రద్దీ

### దర్శనానికి నాలుగు గంటల సమయం



**కాణిపాకం, మే 18 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయంలో ఆదివారం భక్తుల వేసవి రద్దీతో కిటకిటలాడింది. సాధారణంగా ఆలయం లో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో పాటు విద్యాసంస్థలు, పాఠశాలలకు సెలవులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది.

రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు

## మావోలతో కేంద్రం చర్చలు జరపాలి: జస్టిస్ చంద్రకుమార్

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రశ్నించారు. ఏపీ పీస్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎవరిదైనా ప్రాణమేనని పోలీసు లైనా, మావోయిస్టులైనా ఎవరూ చనిపోకూడదని చెప్పారు. ప్రాణనష్టం నివారించడానికే మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టులతో చర్చలు జరపబోమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించడం సరికాదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్చలు జరిపి, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు అరసవిల్లి కృష్ణ , పిచ్చుక శ్రీనివాస్, టి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలు, ఉద్యోగుల ఫంక్షనరీలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణలో భాగంగా స్పెసిఫిక్ పర్పస్ ఫంక్షనరీలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 10న జనరల్ పర్పస్ ఫంక్షనరీలను ప్రభుత్వం కేటాయించింది. అప్పట్లోనే టెక్నికల్ ఫంక్షనరీలకు సంబంధించి విడిగా మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడించింది. తాజా ఉత్తర్వులతో సచివాలయాల్లో ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇప్పటివరకు 8 నుంచి 12 మంది చొప్పున ఉద్యోగుల ఉన్నారు. కొన్నిచోట్ల స్థానిక ప్రజల అవసరాలకు మించి ఎక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరికొన్ని చోట్ల తక్కువ ఉన్నట్లు తేల్చారు. ప్రజలకు నిర్దేశించిన సేవలను సకాలంలో అందించేందుకు జనాభా ఆధారంగా సచివాలయాలను ఉద్యోగుల ను విభజించాలని నిర్ణయించి ఆ మేరకు ప్రభు త్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కలెక్టర్లు తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచి వా లయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఆదేశించారు.

## దౌత్యపరంగా పాక్‌ను ఎండగట్టాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ,రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్

**తిరుపతి, మే 18ప్రభాతవార్తప్రతినిధి:** దౌత్యపరంగా పాక్‌ను ఎండగట్టే ప్రయత్నం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం అనేక ప్రశ్నలకు జవాబుచెప్పాలన్నారు. ఉన్న ఫళంగా అగ్రదేశం ప్రకటనతో సీజ్‌ఫైర్‌కు కేంద్రం ఆమోదించడంవెనుక ఇంకా అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. దౌత్యపరంగా పాక్‌పైచర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రమూకలకు, పాకిస్తాన్ కు సంబంధం లేదని తేలితే వారితో కలసి ఆ దేశంలోకి నేరుగావెళ్ళి ఉగ్రవాదులను పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడురోజుల ఏఐవైఎఫ్ జాతీయ సదస్సులో చివరగాఆదివారం సాయంత్రం సిపిఐ నారాయణ, సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పాక్‌తో సీజ్ ఫైర్ విషయంలో అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. ఉగ్రమూకల వ్యవహారంలో పాక్ అనుసరిస్తున్న తీరును ప్రపంచ దేశాలకు వివరించే క్రమంగా కేంద్రం ప్రకటించిన కమిటీల్లో బిజెపి ఏకపక్షనిర్ణయాలు, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి.హరినాథరెడ్డి, జిల్లా కార్యదర్శిపి.మురళి తదితరులు పాల్గోన్నారు.

## మినీ మహానాడుకు విశేష స్పందన



మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 19, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు గోమతీనగర్‌లో జరిగిన సిటీ నియోజకవర్గ మినీ మహానాడుకు విశేష స్పందన లబించింది. నగర నలుమూలల నుండి తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. పసుపుమయంగా మారిన మినీ మహానాడు ప్రాంగణం. తెలుగుతమ్ముళ్లలో నూతన జోష్ నింపింది. పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి నారాయణ. జ్యోతిప్రజ్వలన చేసి పార్టీ జెండా ఆవిష్కరించారు. మినీ మహానాడులో అభివృద్ధి పనులపై ఏడు ప్రతిపాదనలు చేశారు.. పొంగూరు షరిణి మాట్లాడుతూ కార్యకర్తల శ్రమతోనే టీడీపీ గెలుపు సాధ్యమైందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా మా అందరి సహకారంతో నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారన్నారు. చంద్రబాబు పాలనలో సింహపురికి మంచి రోజులు వచ్చాయన్నారు.

డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ అవసరం తీరాక గాలికి వదిలేస్తారు, అండగా నిలిచిన కార్యకర్తలకు సంవత్సరానికి పది కోట్ల సొంత నిధులు ఇస్తున్న గొప్ప వ్యక్తి నారాయణ అన్నారు. కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారన్నారు.

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నారాయణతో నాకు 30 ఏళ్ల పరిచయం ఉంది. ఆయన ఇంత గొప్ప నాయకులు అవుతారని అనుకోలేదన్నారు. రాష్ట్రాన్ని దోచుకొని వైఎస్సార్‌సీపీ అప్పుల పాలు చేసి వెళ్ళిందన్నారు. రాష్ట్రానికి ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆపద్భాంధవుడిగా మారారన్నారు. ఆయన పాలనలో అన్ని వ్యవస్థలు గాడిన పడతాయి. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కార్యకర్తలంటే మంత్రి నారాయణకు సైనికులతో సమానం అన్నారు. మినీ మహానాడులో చేసిన ప్రతిపాదనలన్నీ అమలు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, సిటీ టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, కార్పొరే టర్లు, నాయకులు, ప్రెసిడెంట్లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## విఆర్‌సి ఆధునీకరణ పనులు పరిశీలించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మే 19, ప్రభాతవార్త-వైద్యం:** వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులను రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె షరణితో కలిసి పరిశీలించారు. హైస్కూల్‌లో ఏర్పాట్లపై ఇండోర్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటుపై పొంగూరు షరిణి పలు సూచనలు ఇచ్చారు. ప్లే గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణంలో మార్పులు చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ కుమార్తె షరిణి మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా మూతబడ్డ వీఆర్ హైస్కూల్‌పై మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి పెట్టారని, దేశంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. పిల్లలకి చదువులతో పాటు ఆటలు కూడా ముఖ్యమన్నారు. ఆహ్లాదభరిత వాతావరణం ఉంటే పిల్లలు చదువుల్లో రాణించగలరని, పాఠశాల అంటే అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఉండాలన్నారు. అందుకు తగ్గట్టుగా వీఆర్ హైస్కూల్ సిద్దమవుతుందని తెలిపారు. జూన్ 12వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్న పీ-4 కింద కుమార్తె షరిణి కూడా కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకొంటానని చెప్పారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మంత్రి లోకేష్ ఆమోదంతో రూ.15కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టామని, ఎన్సెస్పీ ఆధ్వర్యంలో పనులు చకచకా సాగుతున్నాయన్నారు. నిరుపేద పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేలా స్కూల్‌ని డిజైన్ చేశామన్నారు. ఏడాదికి వెయ్యి మంది చొప్పున ఐదేళ్లలో ఐదు వేల మంది పేద పిల్లలకి అడ్మిషన్ కల్పిస్తామని వెల్లడించారు. అన్ని సౌకర్యాలుఉచితంగా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే పీ-4తో పేరెంట్స్‌కి అండగా నిలబడతామని వీఆర్స్‌లో చేరబోయే పేద విద్యార్థుల్లో కొందరిని నా కూతురు షరిణి పీ-4 కింద దత్తత తీసుకోవడం గర్వంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్‌తో పాటు టీడీపీ ముఖ్య నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## పురావస్తు ప్రదర్శనశాలలు నాగరికతకు దర్పణాలు

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ట్రాకింగ్ చేస్తూ కొండపల్లి ఖిల్లాకు చేరుకున్న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** సంస్కృతి, చారిత్రక పరిరక్షణలో పురావస్తు ప్రదర్శనశాలలు (మ్యూజియాల) పాత్ర విశిష్టమైనదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వ్యాఖ్యానించారు. చారిత్రక ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ట్రెక్కింగ్(పర్వతారోహణ)తో కొండపల్లి ఖిల్లాకు కలెక్టర్ చేరుకున్నారు. ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, ఆర్కియాలజీ, రెవెన్యూ, పర్యాటకం, పట్టణ పరిపాలన తదితర శాఖల అధికారులు, అడ్వెంచర్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో కలిసి కొండపల్లి కోటలోని మ్యూజియంను సందర్శించారు. కొండపల్లి బొమ్మల కళాకారుల వీధి నుంచి ఖిల్లాకు ట్రెక్కింగ్ చేశారు. కొండపల్లి ఖిల్లా ప్రాంత గొప్ప వారసత్వ పరిరక్షణపై నిబద్ధతను చాటిచెప్పే లక్ష్యంతో ఈ పర్యటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగంగా మారుతున్న సమాజాల్లో మ్యూజియాల భవిష్యత్తు అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. చారిత్రక ఔన్నత్యాన్ని కళ్ల ముందుంచే సజీవ తరగతిగ దులైన మ్యూజియాలను ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు సందర్శించాలన్నారు. విజయవాడలోని బాపూ మ్యూజియం, కొండపల్లికోటలోని మ్యూజియం వంటివాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, డీఎఫ్‌వో సతీష్, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్, విజయవాడ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని, ఏపీ టూరిజం అథారిటీ కన్సల్టెంట్ సాహితి, టూర్స్ అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.



ఆకస్మిక తనిఖీ చేసి వివరాలు తెలుసుకుంటున్న ఇఓ



నృత్యనీరాజనం

## భక్తుల సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 18, ప్రభాతవార్త :** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తులకందిస్తున్న సౌకర్యాలను ఇఓ వికె శీనా నాయక్ వ్యక్తిగతంగా ఎవరూ వెంటలేకుండా పరిశీలించారు. కేశఖండనశాల, దుర్గాఘాట్ లను మాస్క్ ధరించి టూవీలర్‌పై వెళ్ళి పరిశీలించారు. అక్కడ సిబ్బందిని భక్తునిలా వెళ్ళి వివరాలు తెలుసుకున్నారు. దుర్గాఘాట్లో భక్తులతో ముచ్చటించి వారి సౌకర్యాలను తెలుసుకున్నారు. కొన్ని చోట్ల స్వయంగా పరిశీలించి పరిశుభ్రత లేకపోవడం గమనించారు. టోల్‌గేట్ వద్ద బ్యారికేడ్లు గోపురం వైపు జరిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానంలోని ప్రథమ చికిత్స కేంద్రంలో ఒక డాక్టర్, నర్సు ను కేటాయించాలని కలెక్టర్ లక్ష్మీషాను కోరామన్నారు. రాష్ట్ర రాజధానిలోని పురాతన వారసత్వ సంపద అయిన దుర్గమ్మవారి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాలు వుండేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ పరిశీలన చేశామన్నారు.

**దుర్గమ్మకు నృత్యనీరాజనం :** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం కళావేదికపై విజయవాడకు చెందిన కళాక్షేత్ర డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ ఆచార్యులు గీత, మౌనిక ఆధ్వర్యంలో నృత్య విద్యార్థులు నృత్యనీరాజనం సమర్పించారు.

## వ్యాపార యాజమానులకు ఆర్థికాంశాలపై మాస్టర్ క్లాస్

**విజయవాడ, మే 18, ప్రభాతవార్త :** వ్యాపార యాజమానులకు ఆర్థిక ప్రాథమిక అంశాలపై ఎపిఎంఎస్ఇ ఆధర ్యంలో మాస్టర్ క్లాస్‌ను విజయవాడలో ఆదివారం నిర్వహించారు. ఆర్థిక నిపుణులు యు శ్రీనివాసమూర్తి, వైస్ చైర్మన్ ఇంటిగ్రేటెడ్ క్లీన్‌రూం టెక్నాలజీస్ ప్రై లిమిటెడ్, విరించి నందుల, బెంగుళూరు ఎంఎస్‌ఎంఇ అసోసియేట్స్, ఎంఎస్‌ఎంఇ వ్యవస్థాపకులకు ఆర్థిక క్రమశిక్షణ, మరియు వ్యాపార విలువను నిర్మించడానికి మార్గనిర్దేశం చేశారు. వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణ, లిక్విడిటి, నగదు ప్రవాహ ప్రణాళికపై లోతైన ప్రజంటేషన్‌ను ప్రతినిధులు ప్రదర్శించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఎంఎస్ రామచంద్రరావు, అధ్యక్షుడు డి దుర్గాప్రసాద్, కోశాదికారి జెవిఎస్ఆర్‌కె ప్రసాద్, జి ఎస్ అల్లాయ్ కాస్టింగ్స్ శ్రీనివాస్, ప్రోగ్రాం కన్వీనర్ పర్వతనేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సజ్జల శ్రీధర్ రెడ్డి విచారణ ముగిసింది

### ప్రకటించిన సిట్

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు సజ్జల శ్రీధర్ రెడ్డి సిట్ అధికారుల మూడో రోజుల విచారణ ముగిసిందని సీట్ అధికారికంగా ప్రకటించింది. అయితే ఆయన సిట్‌కు తగిన విధంగా సహకరించనందున మరో పర్యాయం పోలీసు కస్టడీకి కోరి విచారించే అవకాశం ఉందని సిట్ అధికారులు తెలిపారు. వైకాంగ్రెస్ సామాజిక మాధ్య మాల నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన శ్రీధర్ రెడ్డిని మూడు రోజులపాటు సిట్ అధికారులు ప్రశ్నించారు. మద్యం పాలసీ రూపకల్పన, డిస్టిలరీలకు అనుమతులు, అమ్మకాలకు సంబంధించి శ్రీధర్ రెడ్డికి ప్రశ్నలు వేశారు. విచారణ తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. 3 రోజుల విచారణ ముగియడంతో ఏసీబీ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. అనంతరం శ్రీధర్ రెడ్డిని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. మద్యం కేసులో 33 మంది నిందితులను సిట్ గుర్తించింది. ఇప్పటివరకు రాజ్ కసిరెడ్డి, చాణక్య, దిలీప్, సజ్జల శ్రీధర్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను అరెస్టు చేసారు. అనంతర పరిణామాల్లో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టు అయినవారి సంఖ్య 7కు చేరింది. ఇక మద్యం కుంభకోణంలో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి నేరానికి పాల్పడినట్లు పక్కా ఆధారాలు ఉన్నాయని విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టులో సిట్ వాదనలు వినిపించింది. ఇదే కేసులో ఇతర నిందితులు వీరిద్దరి పాత్రపై వాంగ్మూలాలిచ్చారని కోర్టుకు వివరించింది. ఇది మిగతా కేసుల్లాంటిది కాదని రూ.3,500 కోట్ల కుపైగా దోచుకున్న వ్యవహారమని వాదించింది.

## జిఓ నెం.4 పట్ల విఆర్‌ఓ అసోసియేషన్ అసంతృప్తి

**విజయవాడ, మే 18, ప్రభాతవార్త :** ప్రతి సెక్రటేరియట్‌కు ఒక విఆర్‌ఓను కేటాయించాలని తాము పలు మార్లు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు హేతుబద్ధంగా వివరించామని, కానీ ఒక సెక్రటేరియట్‌కు ఒక విఆర్‌ఓ, మరో సెక్రటేరియట్‌కు సర్వే అసిస్టెంట్‌కు కేటాయిస్తూ జారీ చేసిన జిఓ 4 పై విఆర్‌ఓలందరూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు వెల్లడించారు. ఏపి రాష్ట్ర గ్రామవార్డు సచివాలయాల సెక్రటరీ కాటంనేని భాస్కర్ ఆదేశాలతో ఈ జిఓ4ను ఇచ్చారన్నారు. ఇలా చేయడం వల్ల 7500 మంది గ్రామ రెవెన్యూ అధికారులు మిగులు సిబ్బందిగా చూపుతారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14వేల మంది గ్రామ రెవెన్యూ అధికారులు పనిచేస్తుంటే ఇప్పుడు క్లస్టర్ విధానంలో 50శాతం విఆర్‌ఓలు తగ్గిపోతున్నారని, తమపై పనిభారం పెరిగిపోతుందని, మిగిలిన విఆర్‌ఓలకు ఏ బాధ్యతలు చెప్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సచివాలయానికి ఒక విఆర్‌ఓ లేదా ప్రతి రెవెన్యూ విలేజ్‌కు ఒక విఆర్వో వుండేలా నిర్ణయం తీసుకుని తమ క్యాడర్ స్ట్రెంత్‌ను తగ్గకుండా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నామన్నారు. లేకుంటే ఈ క్లస్టర్ విధానంపై తాము చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణ నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు.

## హిందూ ధర్మ రక్షకులు ఛత్రపతి శివాజీ మహరాజ్

### ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 18, ప్రభాతవార్త :** భారతదేశంలో హిందూత్వం, ధర్మాచరణలకు ప్రాణంపోసి ఛత్రపతి శివాజీ మహరాజ్ యువతకు దేశభక్తి, దైవభక్తిని స్ఫూర్తిగా అందించారని తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ఆదివారం సీతరామపురం వేడుకల మందిరంలో జరిగిన ఛత్రపతి శివాజీ మహరాజ్ కళా ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ నేటి తరానికి శివాజీ మహరాజ్ చరిత్రను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంస్కార భారతి, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆధునాతన శాస్త్రపరిజ్ఞానంతో ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. తొలుత ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిట్టా లక్ష్మీ ృనరసింహశాస్త్రి, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, రంగస్థల కళాకారులు బొబ్బిళ్ళపాటి సాయి జెండా ఊపి కళాప్రదర్శనను ప్రారంభించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక అధ్యక్షులు పిన్నం చినవెంగళరావు, కోర్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

**జూన్ 2న విగ్రహాల పునఃప్రతిష్ట:** జగ్గయ్యపేట పట్టణంలోని ప్రాచీన ధనశైల శ్రీరామాలయంలో జూన్ 2న విగ్రహాల పునఃప్రతిష్ట జరుగనుండగా శ్రీచినజీయర్‌స్వామి వారి ఆదేశాలతో ఆదివారం శ్రీరామాలయంలో భక్తులకు హైందవ జెండాల పంపిణీ కార్యక్ర మాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభిం చారు. పట్టణంలోని ప్రతి ఇంటికి ఒక జెండా, మృత్తికా కలశం ఇవ్వటం జరుగుతుందని వీటిని స్వీకరించిన వారు ప్రతిరోజూ శ్రీరామనామ జపం చేస్తూ అన్ని బియ్యపు గింజలను ఈ కలశంలో వేస్తూ 11రోజుల అనంతరం ఆలయంలో అందజే యాలని ఇలా సేకరించిన బియ్యంతో ప్రసాదం తయారుచేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి పూజలుపూర్తయిన అనంతరం భక్తులకు పంపిణీ చేయటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

**శివాలయంలో శుద్ధి:**

పట్టణంలోని శ్రీచంద్రమౌళీ శ్వరస్వామి (పెద్దశివాలయం)లో ఆదివారం అన్నపూర్ణ సేవా సమితి వ్యవస్థాప కులు మహంకాళి జయప్రకాష్ ఆధ్వర్యంలో సేవా సమితి సభ్యులు 22 మంది శుద్ధి సేవా కార్య క్రమాన్ని చేపట్టారు.

19-5P□g7exHMNWJQE.qxd:19-5P□g7exHMNWJQE.qxd 01/01/01 7:57 AM Page 1



# నిజాం నాటి నక్షాలకు మోక్షం

## వచ్చే వారం నుండి ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాల్లో రీసర్వే

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిజాం కాలం నుంచి ఉన్న నక్షాలకు మోక్షం కల్పించ బోతున్నామని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తర తరాలుగా నిజాం కాలం నుండి సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని 413 గ్రామాలు ఉన్నాయని గత పది సంవత్సరాలలో ఈ సమస్యకు ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కారం చూపలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందుకు గాను 413 గ్రామాల్లోని ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహించి దానిలో వచ్చే ఫీడ్‌బ్యాక్ మేరకు మిగిలిన గ్రామాల్లో కూడా చేపడతామని తెలిపారు.

పైలట్ గ్రామాలు మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో ఆధునిక సాంకేతికను వినియోగిస్తూ రెండు పద్ధతులలో విస్తృత సర్వే జరుగుతుందని, ఏరియల్, డ్రోన్ సర్వే పద్ధతి, ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతుల్లో సర్వే చేసి జియో రిఫరెన్స్డ్, క్యాడస్ట్రల్ మ్యాపులు, హక్కుల నమోదు పత్రాలను తయారుచేస్తారని తెలిపారు. ఈ నూతన విధానాల వలన భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుంది, ఫలితంగా రైతులు, గ్రామీణ భూయజమా నులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ రీ సర్వే కోసం వివిధ రాష్ట్రాలలో రీ సర్వే లో అనుభవం కలిగిన ఆర్వీ అసోసియేట్స్, మార్వెల్ జియో స్పేషియల్, ఐఐసి టెక్నాలజీస్, నియో జియో, డ్రోగో డ్రోన్ సంస్థలను ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. పైలట్ గ్రామాల్లో ఈ సంస్థలు రీ సర్వే చేస్తాయని, సర్వే ఫలితాల ఆధారంగా మిగిలిన గ్రామాలకు విస్తరిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆధునిక యంత్రాలు, టెక్నాలజీని వాడుకుని శాశ్వతంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

**మున్నేరు, పాలేరు లింక్**

**కెనాల్‌కు రూ.162.54 కోట్లు విడుదల**

వృధాగా సముద్రంలోకి వెళ్తున్న మున్నేరు వాగు వరద నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించడానికి మున్నేరు పాలేరు లింక్ కెనాల్ కు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసిందని రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 98 ని విడుదల చేసినట్లు చెప్పారు.

సముద్రంలోకి పోయే వరద నీటిని రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా మళ్లించాలన్న ఆలోచన ఈ రాష్ట్రాన్ని పదేళ్లు ఏలిన ప్రభుత్వానికి రాలేదని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల వృధాగా పోతున్న వరద నీటిలో సుమారు 10 టిఎంసిల వరద నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించవచ్చన్నారు. దీంతఈ రిజర్వాయర్ పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయ కట్టు స్థిరీకరణ జరుగుతుందని ఇందులో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు. పాలేరు లింక్ కెనాల్‌కు నిధులు విడుదల చేసిన సిఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలాగే ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నా అన్నారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీరు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వస్తున్న వరద నీరు వృధా కాకుండా ఒడిసి పట్టాలనే సంకల్పంతో మున్నేరు నుంచి పాలేరుకు లింక్ కెనాల్‌ను మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.



# ప్రతి ఎకరం సాగులోకి తీసుకురావడమే లక్ష్యం

## రెండు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తాం

### పనుల జాప్యంపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), మే 18, ప్రభాతవార్త :** కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాన్ని సాగులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పాలకీడు మండలంలోని బెట్టే తండ లోని మూసీ నది వద్ద, జాన్ పహాడ్ సమీపంలోని కృష్ణా నది వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల పనులను ఆయన పరిశీలించారు. మొదట పెట్టే తండా సమీపంలోని మూసీ నది వద్ద 33 కోట్ల 83 లక్షలతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం నిర్మాణపు పనులను ఆయన పరిశీలించి అధికారులను పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు నెల వరకు ఈ పథకం పూర్తవుతుందని మంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పథకం పూర్తి అయితే బెట్టే తండా, పాడే తండా, రాఘవాపురం, సజ్జాపురంలోని బడుగు బలహీన వర్గాల రైతులకు చెందిన 2,041 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు.

గిరిజనులకు చెందిన 1877 మంది, షెడ్యూల్ కులాలకు చెందిన 34 మంది, బలహీన వర్గాలకు చెందిన 100 మంది, ఇతరులు 97 మంది మొత్తంగా 2,176 మంది రైతులకు చెందిన 2041 ఎకరాలు సాగులోకొస్తాయని తెలిపారు. ఈ పథకం అమలు అయితే ఈ ప్రాంతంలోని పేద రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ పథకానికి సంబంధించి భూ సేకరణ పూర్తయిందని వాటికి సంబంధించిన రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించడం జరిగింది అని తెలిపారు.

ఈ పథకం అమల్లోకి వచ్చి రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. అనంతరం జాన్ పహాడ్ సమీపంలోని కృష్ణా నది వద్ద 273 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ పథకం ద్వారా సుమారు 11 గ్రామాలకు చెందిన పదివేల ఎకరాలకి సాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం నిర్మాణం పనులను ఇప్పటికి రెండుసార్లు పరిశీలించానని, ఇది మూడవ సారి పరిశీలించేందుకు వచ్చానని ఆయన పనుల్లో పురోగతి కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ తీరుపై ఆయన మండిపడ్డారు. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదని ఆయన మందలించారు. నిర్మాణపు పనులు వేగవంతం చేయాలని అవసరమైన నిధులను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పనుల్లో జాప్యం బాగా జరుగుతుందని ఏజెన్సీ నిర్లక్ష్యం కనిపిస్తుందని ఇకనుంచి పథకాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మిషన్లను, కూలీలను పెంచుకొని నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. నిర్మాణపు పనుల్లో జాప్యం జరిగిన నిర్లక్ష్యం వహించిన సహించేది లేదన్నారు. ఈ పథకం పూర్తి అయితే జాన్ పాడ్, గుండబోయిన గూడెం, గుండ్లపాడు, అలింగాపూర్, బొత్తల పాలెం, కోమటికుంట, మీగడం పాడు తండా, చెరువు తండా, పాలకవీడు, సజ్జాపురం, నాగిరెడ్డి గూడెం గ్రామాల్లోని పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

# వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై ప్రజల్లో చైతన్యం నింపాలి




## ఒకేసారి ఎన్నికలు జరిగితే సమయం వృధాకాదు

### రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మార్చుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్స రాలు పూర్తి చేసుకున్న ఇంకా బ్రిటిష్ వారి విధానాల్ని అవలంబిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో ఉన్నటువంటి వర్తమాన రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్ని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం ఒకే దేశం ఒకే ఎన్నికలు పేరుతో దేశవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా, నగరంలో ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే కొన్ని చట్టాలు మార్చుకున్నామన్నారు. కానీ దురదృష్టం ఏంటంటే మార్చే క్రమంలో వాటికి అడ్డంపడే ప్రయత్నం జరుగుతుందన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ సంబంధించి ప్రజల్లో చైతన్య నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ నినాదాన్ని ప్రజల మధ్యకు తీసుకుని వెళ్లాలన్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీలపై, మేధావులపై, విశ్లేషకులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారాలంటూ కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడ ఎలక్షన్ జరిగిన దేశమంతా చర్చ జరుగుతుందన్నారు. దీనివల్ల ఎన్నో పని గంటలు వృధా అవుతున్నాయన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే ఇలాంటి పరిస్థితి ఉండదన్నారు. దేశంలో మార్పు రావాలి అంటే మోడీ నాయకత్వంలోనే మార్పు వస్తుందన్నారు. జిఎస్టీ విషయంలో కావచ్చు, 370 ఆర్టికల్ విషయంలో కావచ్చు అది ఏదైనా మోడీ పట్టుదలతోనే అది సాధ్యమైందన్నారు. త్రిబుల్ తలక్ విషయంలో కూడా అదే జరిగిందన్నారు. సిఏఏ న్యూ క్రిమినల్ యాక్ట్, తీసుకోచ్చింది మోడీ ప్రభుత్వమే అన్నారు. ఉగ్రవాదాన్ని మోడీ ప్రభుత్వమే కూకటి వేళ్ళతో పెకిలించే ప్రయత్నం చేస్తుందన్నారు. గతంలో హైదరాబాద్ నగరంలో ఎన్నో ఘటనలు మనం చూసామన్నారు.

పాకిస్థాన్ విషయంలో నేడు పరిస్థితి మారింది ఉగ్రవాద చర్యలకు పాల్పడితే పాకిస్తాన్ గడ్డమీదికి వెళ్లి వారిని తుద ముట్టించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పహాల్గం దాడి తర్వాత క్యాండిల్ లైట్లతో ఎర్ర గులాబీలతో సంతాపం ప్రకటించలేదని, వారి స్థావరాల్ని పేల్చేశాం అన్నారు. ఇది దేశం గురించి ఆలోచించే వారికే సాధ్యమవుతుందన్నారు. అధికారం కోసం ఓట్ల కోసం పదవుల కోసం ఆలోచించే వారికి సాధ్యం కాదన్నారు. ఏదైనా దేశంలో సంస్కరణలు తీసుకు రావడం దేశం కోసం ఏదైనా చేయాలంటే అది మోడీ ప్రభుత్వానికి సాధ్యం అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వేస్టేషన్ పునర్నిర్మాణం లాంటి అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం దేశం పరిస్థితులు దేశం యొక్క అభివృద్ధి వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాల్సిందే అన్నారు. ఎక్కడో ఒకచోట ఎప్పుడు ఎలక్షన్స్ ఉండడం వల్ల సిబ్బందికి ప్రభుత్వానికి ఇబ్బంది అన్నారు. అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని, ఈ విషయంలో ఒక్కసారి ప్రజలందరూ ఆలోచించాలన్నారు. దేశ అభివృద్ధి కోసం భవిష్యత్తు తరాల నిర్మాణం సంస్కరణలు తీసుకురావాల్సిందేనని, తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంలో మోడి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. రాఫెల్ యుద్ధ విమానాల విషయంలో ప్రతిపక్షాలు ఎంత రాద్ధాంతం చేశాయో అందరికి తెలుసు. కానీ నేడు యావత్ ప్రపంచం మన దేశం వైపు చూస్తుందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి దేశాన్ని అందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవసరం ఉందని, దీనికి అందరూ ప్రజలు సహకరించాలన్నారు. మేధావులు అన్ని వర్గాలు ఆలోచించాలని, ప్రజలు సహకరించాలన్నారు.

## రూ.11 లక్షల విలువైన పటిక, బెల్లం పట్టివేత

### నల్గొండ, సిద్దపేటలో ఎక్సైజ్ అధికారుల దాడులు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది మూడుచోట్ల దాడులు నిర్వహించి 6,740 కేజీల బెల్లం 250 పటిక పట్టుకున్నారు. బెల్లం పట్టిక విలువ రూ.11 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేశారు. బెల్లం ఆలంతోపాటు పట్టుకున్న వాహనాల విలువ రూ. 23 నుంచి రూ.25 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో లారీలో అక్రమంగా వెళుతున్న 8,000 కేజీల బెల్లం, 200 కేజీల పటికను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లా కొండ మల్లేపల్లి రోడ్‌లో లారీలో వెళ్తున్న 2,400 కేజీల బెల్లాన్ని దేవరకొండలో పట్టుకున్నారు. నిర్మల్ ఖానాపూర్ ప్రాంతంలో ఎక్సైజ్ సిబ్బంది బైక్ పై తీసుకు వెళుతున్న 340 కేజీల బెల్లాన్ని 20 కేజీల ఆలమును ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.



## హెలికాప్టర్ ద్వారా సరస్వతిఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌శర్మ

**కాళేశ్వరం, మే 18, ప్రభాతవార్త:** హెలిప్యాడ్ వద్ద జాయ్‌రైడ్ హెలికాప్టర్, సరస్వతి ఘాట్‌ను ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. భక్తులు కాళేశ్వరం అందాలను వీక్షించేందుకు అనువుగా జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సరస్వతి ఘాట్ ప్రాంతాలను పరిశీలించారు. ఏర్పాట్లను సమీక్షిస్తూ, వాకీటాకీ ద్వారా అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం భక్తుల రద్దీ పెరుగు తుందని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు వారి కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విభాగం అధికారులు వారి ప్రదేశాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టంగా ఆదేశించారు. స్నాన ఘాట్స్ వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని, శుభ్రత, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు.

## 42 శాతం రిజర్వేషన్ల అమలు చేశాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

### 14 బిసి సంఘాలు డిమాండ్

**హైదరాబాద్(సైఫాబాద్), మే 18, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని 14 బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాజకీయ పార్టీల సవాళ్లు-ప్రతిసవాళ్లతో సమస్యను పక్కదారి పట్టిస్తే సహించేది లేదని హెచ్చరించాయి. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన 14 బిసి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభసభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కొంతమంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వానికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని సవాళ్లు విసురుతున్నారని, ఇలాంటి సవాళ్ల ఉద్దేశం ఏమిటీ?, రిజర్వేషన్‌లు పెంచకుండానే ఎన్నికలకు వెళ్లాలనా?, అన్ని పార్టీల ప్రతి సవాళ్లు రిజర్వేషన్‌లను పెంచకుండా తప్పించుకోవాలని చూస్తున్నాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన వాగ్దానం ప్రకారం బిసి రిజర్వేషన్‌లను పెంచి ఎన్నికలు జరపాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి నాయకులు జిల్లపల్లి అంజీ, పగిళ్ళ సతీష్, రాందేవ్, నిమ్మల వీరన్న, చిక్కుడు బాలయ్యముదిరాజ్, నిఖిల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మద్యం ధరలు పెంపు

## వైన్‌షాపులకు సర్క్యులర్లు జారీ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** తెలంగాణలోని మందుబాబులకు బ్యాడ్ న్యూస్. మద్యం ధరలు పెరగనున్నాయి. క్వార్టర్‌పై రూ. 10, హాఫ్‌పై రూ. 20, ఫుల్‌పై రూ. 40 పెంచేందుకు ఎక్సైజ్ శాఖ సర్క్యులర్లు పంపినట్లు సమాచారం. ఇటీవలే బీర్ల ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు ఇతర మద్యం ధరలు పెంచేందుకు డిసైడ్ అయింది. అయితే ఈ పెంపుపై ఎక్సైజ్ శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ధరలు పెరిగినా అమ్మకాలు తగ్గకపోవచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

తెలంగాణలో మద్యం ప్రియులకు ఇది నిజంగా షాకింగ్ న్యూసే. ఇటీవలే బీర్ల ధరలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం, తాజాగా ఇతర మద్యం ధరలను కూడా పెంచడానికి సిద్ధమైంది. మార్కెట్ ధరల్లో మార్పుల కారణంగా ఈ కొత్త రేట్లు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం. తెలంగాణ ఎక్సైజ్ శాఖ మద్యం ధరలను పెంచుతూ మద్యం దుకాణాలకు సర్క్యులర్లు పంపినట్లు తెలిసింది. ఈ సర్క్యులర్ల ప్రకారం, 180 (మిల్లీ లీటర్లు)క్వార్టర్ బాటిల్‌పై రూ. 10, 360 (మిల్లీ లీటర్లు)హాఫ్ బాటిల్‌పై రూ. 20, ఫుల్ బాటిల్‌పై రూ.40 ధరలు పెరగనున్నాయి. అయితే, ఈ ధరల పెరుగుదలపై ఎక్సైజ్ శాఖ నుండి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

అధికారిక ప్రకటన లేకపోవడంతో మద్యం ప్రియులు కొంత గందరగోళానికి గురవుతున్నారు. ఒకవైపు ధరల పెంపు గురించి వార్తలు వస్తుండగా.. మరోవైపు ఎక్సైజ్ శాఖ దీనిపై స్పందిచడం లేదు. ఒకవేళ ఈ ధరల పెరుగుదల వాస్తవమైతే మందుబాబుల జేబులకు మరింత చిల్లు ఎట్టే అవకాశముంది. గత అనుభవాలను బట్టి చూస్తే ధరలు పెరిగినా అమ్మకాలు ఆశించిన స్థాయిలో తగ్గకపోవచ్చని తెలుస్తోంది. తతెలంగాణలో మద్యం అమ్మకాల జోరు కొనసాగే అవకాశం ఉంది. ధరల పెంపుపై ఎక్సైజ్ శాఖ ఎప్పుడు అధికారికంగా ప్రకటన చేస్తుందో వేచి చూడాలి. ఇక తెలంగాణలో ఎండలు మండు తుండటంతో బీర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఎండలు తీవ్రంగా ఉండటంతో చల్లని బీర్ తాగడానికి మందుబాబులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బీర్ల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి.

సాధారణ రోజులతో పోలిస్తే అమ్మకాలు రెట్టింపు అయ్యాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా యువత బీర్లు ఎక్కువగా తాగుతున్నారు. అయితే, ఈ పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, బేవరేజెస్ కంపెనీల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచింది. ధరలు పెరిగినా అమ్మకాలు మాత్రం తగ్గడం లేదు. పెళ్లిళ్ల సీజన్ కూడా కొనసాగుతుండటంతో బీర్ల వినియోగం మరింతగా పెరిగింది. దీంతో వైన్ షాపుల్లో చల్లని బీర్లు దొరకడం కూడా కష్టంగా మారింది. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు రెట్టింపు అయినట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో చల్లటి బీర్లకు కొరత ఏర్పడింది. ఏప్రిల్ నెలలో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ. 3,272.32 కోట్ల ఆదాయం వచ్చింది. ఈనెలాఖరు వరకు బీర్ల డిమాండ్ ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# తెలంగాణలో డమ్మీ పేలుళ్లకు ఐసిస్ కుట్ర

## ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు

### పాక్‌పై భారత్ దాడి చేసినందుకు కుట్ర

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** నిషిద్ధ ఐసిస్ ఉగ్రవాద సంస్థ తెలంగాణలో మరోసారి పేలుళ్లకు కుట్ర పన్నింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత పాక్‌పై భారత్ దాడికి దిగినందుకు ప్రతీకారంగా వీరు ఈ కుట్ర పన్నినట్లు తేలింది. దీనిపై తెలంగాణ, ఎపి పోలీసులు పక్కా సమాచారంతో ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలను జప్తు చేశారు. పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో ఒకడు విజయనగరం వాసి కాగా మరొకతను హైదరాబాద్ వాసి. సౌది అరేబియా నుంచి ఈ ఇద్దరు ఉగ్రవాదులకు ఐసిస్ పెద్దలు ఈ పేలుళ్ల కుట్రకు ఆదేశించినట్లు తేలింది. వివరాలు ఇలావున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, దాని తరువాత పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడికి దిగడం, అనంతరం పాక్ డ్రోన్లతో ఎదురు దాడి చేయడం, వీటిని భారత సైన్యం ధ్వంసం చేయడం తెలిసిందే. దీని తరువాత పాక్ అనుకూల ఉగ్రవాద సంస్థలు భారత్‌లో దాడులకు పాల్పడే వీలుందన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు దేశ వ్యాప్తంగా అప్రమత్తంగా వుండసాగారు. ఈ క్రమంలో కాశ్మీర్‌లో పలువురు ఉగ్రవాదులు పట్టుబడగా ఆరుగురు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. దీంతో పాటు ముంబాయిలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. వీరిద్దరు దుబాయ్ నుంచి భారత్‌కు రాగా ముంబాయి విమానాశ్రయంలో పట్టుబడ్డారు. వీరిద్దరు 2023 పూణె పేలుళ్ల కేసులో నిందితులు. వీరిని విచారిస్తున్న క్రమంలో అందిన సమాచారం ఆధారంగా విజయనగరం వాసి సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన స మీర్ అనే ఐసిస్ ఉగ్రవాదులు హైదరాబాద్‌లో డమ్మీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తేలింది. పాక్‌పై భారత్ దాడులకు పాల్పడినందుకు వీరు హైదరాబాద్‌లో డమ్మీ పేలుళ్లకు పాల్పడి ప్రజలను భయాందోళనలకు గురిచేసేందుకు వ్యూహం పన్నినట్లు తేలింది. దీనిపై ఎన్ఐఎ అధికారులు తెలుగు రాష్ట్రాల పోలీసలును అప్రమత్తం చేయడంతో రెండు రాష్ట్రాల కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు వెంటనే రంగంలో దిగి విజయనగరంలో సిరాజ్‌ను, హైదరాబాద్‌లో సమీర్‌ను అరెస్టు చేశారు. వీరిని విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో వీరు తమ నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. సోమవారం నాడు ఇద్దరు ఉగ్రవాదులను కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించే వీలుంది.

# నకిలీ మందుల అమ్మకాలపై నిరంతరం నిఘా పెట్టాలి

## డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** మార్కెట్లో నకిలీ మందుల వ్యాప్తిని అరి కట్టేందుకు దాడులు ముమ్మరం చేయాలని, నిరంతర నిఘా తోనే ఈ దందాను అరికట్టవచ్చని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ షా నవాజ్ ఖాసీం అన్నారు. ఈ మేరకు ఆయన ఆబ్కారీ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వ హించారు. నకిలీ ఔషధాల తయారీ, పంపిణీ, అమ్మకాలలో నిమగ్నమైన వ్యవహారాలను నిర్మూ లించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం నకిలీ డ్రగ్స్ తరలించి విక్రయా లకు పాల్పడు తున్న వారిపై నిఘా పెంచాలన్నారు.

అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టడం మన శాఖ కర్తవ్యమన్న డైరెక్టర్ జనరల్ నకిలీ డ్రగ్స్ దందాను అరికట్టేందుకు సమిష్టి కృషి అవసరమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి డ్రగ్స్ ఫ్రీతెలంగాణ లక్ష్యాన్ని నిజం చేసేందుకు, మత్తుపదార్థాల దుర్వినియో గాన్ని అరికట్టేందుకు మద్యపాన నిషేధ శాఖతో సమన్వయంగా 1 కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఔషధ తనిఖీ అధికా రులు విక్రయ కేంద్రాలలో తనిఖీలు నిర్వ హిస్తూ తప్పని సరిగా క్యూఆర్ కోడ్లు ధృవీకరించాలని, నకిలీ ఔషదాలు గుర్తించేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అలాగే ప్రజలను తప్పుదారి పట్టించే అనధికారిక ప్రకటనలు చేసేవ్యక్తులపై కఠిన చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు.

## వణ్యప్రాణుల రక్షణకు 150 ప్రత్యేక బృందాల ఏర్పాటు

**హైదరాబాద్,మే 18,ప్రభాతవార్త :** వన్యప్రాణుల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. ఇందులో భాగం వాటి సంరక్షణక ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. అడవులు, ఇతర ప్రాంతాల్లో వేటగాళ్ళ వేటకు అనేక వన్యప్రాణులు బలువుతున్నాయి. వేటగాళ్ళ బారి నుంచి వాటిని కాపాడేందుకు రాష్ట్రప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. వీటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా 150 స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది వేటగాళ్ల నుంచి జంతువులను రక్షించడంతోపాటు వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేలా ఈ బృందాలు పనిచేస్తాయి. జంతువుల రాకపోకలను పసిగట్టేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 242 ట్రాక్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు... రాజాగా ప్రకటన విడుదలైంది. వాటి దాహార్తి తీర్చడానికి మొత్తం 449 సోలార్ బోర్ వెల్స్ అమర్చబోతున్నారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో... వన్యప్రాణులకు చాలావరకు మేలు జరగడమే కాకుండా వేటగాళ్ళ ఆటను కూడా కట్టించనట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.


సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

## మంద కృష్ణమాదిగ, చెన్నయ్య రహస్యమిత్రులు

### పిడమర్తి రవి ఆరోపణ

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైకోర్టులో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య వేసిన కేసు వెనుక ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హస్తం ఉందని ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ పడమర్తి రవి ఆరోపించారు. రాష్ట్రంలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్‌లు కల్పించి వర్గీకరణ అమలు చేస్తున్న తరుణంలో 5 శాతం కూడా లేని మాల సామాజిక వర్గానికి ప్రభుత్వం కల్పిస్తే దాన్ని కూడా ఓర్వలేని జి.చెన్నయ్య వర్గీకరణ అమలుపై హైకోర్టులో కేసు వేయడం వెనుక కృష్ణమాదిగ హస్తం ఉందని, ఆదే విధంగా జి.చెన్నయ్య, కృష్ణమాదిగ రహస్య మిత్రులని, గత మూడు దశాబ్ధాల కాలంలో మంద కృష్ణమాదిగ, జి.చెన్నయ్యకు డబ్బులు ఇచ్చి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం చేయించారని, ఇప్పుడు కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిడమర్తి రవి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వానికి మందిగలంతా సిఎం రేవంత్‌రెడ్డి పక్షాన ఉంటే దీన్ని ఓర్వలేక కృష్ణమాదిగ ఈ పనిచేశారని, భవిష్యత్తులో బిజెపి బలోపేతం కోసం కృష్ణమాదిగ ఈ పనిచేశారని, ఎన్ని కుట్రలు చేసినా రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేసి తీరుతారని ఆయన స్పష్టం చేశారు. సరస్వతి పుష్కారాలలో ఎంపి వంశీకృష్ణకు ఆహ్వాన పత్రిక అందలేదని జి.చెన్నయ్య వ్యాఖ్యలు మానవ అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వర్గీకరణను అడ్డుకోవడం మనువాదమే అవుతుందని హెచ్చరించారు. జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను సన్మానిస్తున్నామని, ఈ కార్యక్రమం తొలుత హైదరాబాద్‌లో ప్రారంభమా తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ మీసాల మల్లేష్, బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, నిమ్మల వీరన్న, వరలక్ష్మి, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

19-5pg10.qxd:19-5pg10.qxd 01/01/01 7:22 AM Page 1





## పావోలినికి ఇటాలియన్ టైటిల్

### మాజీ ఛాంపియన్ గౌఫ్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్ టైటిల్-2025ను ఇటలీకి చెందిన జాస్మిన్ పావోలిని కైవసం చేసుకుంది. రోమ్‌లో జరిగిన ఫైనల్లో జాస్మిన్ పావోలిని 6-4, 6-2 తేడాతో కోకో గౌఫ్‌ను ఓడించి ఇటాలియన్ ఓపెన్‌ను గెలుచుకుంది. ఇటీవల రోలాండ్ గారోస్‌ను ఓడించి తన రెండవ 1000 సిరీస్ టైటిల్‌ను సాధించింది. 1985లో మాజీ యూఎస్ ఓపెన్ ఛాంపియన్ గౌఫ్‌ను ఓడించి రాఫెల్లా రెగ్గీ తర్వాత రోమ్ ఈవెంట్‌ను గెలుచుకున్న తొలి ఇటాలియన్ మహిళగా పావోలిని నిలిచింది. ఇక 29 ఏళ్ల ఆమె ఓపెన్ ఎరాలో తన తొలి రోమ్ టైటిల్‌ను గెలుచుకున్న మహిళ కాగా, పావోలిని కంటే ఎనిమిది సంవత్సరాలు చిన్నదైన గౌఫ్, 2002లో సెరెనా విలియమ్స్ తర్వాత కిరీటాన్ని గెలుచుకున్న అతి పిన్న వయస్కురాలిగా అవతరించే అవకాశాన్ని కోల్పోయింది. కాగా జెంగ్ క్విన్వెన్‌పై జరిగిన సెమీఫైనల్ విజయంలో లాగానే, గౌఫ్ 55 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్‌లు చేసి, సర్వ్‌లో ఏడు డబుల్ ఫాల్ట్‌లతో ముందుకు సాగింది, దీంతో పావోలిని విజయం సులభతరం అయింది. అయితే పావోలిని ఇంకా సింగిల్స్ మరియు మహిళల డబుల్స్ టోర్నమెంట్‌లను గెలుచుకోలేకపోవడం విశేషం.




## వరల్డ్ ఛాంపియన్‌గా షెర్బిని

### రికార్డు స్థాయిలో 8వ టైటిల్ సొంతం

### రెండో రౌండ్‌లోనే ఇంటికి భారత్ ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో షెర్బిని రికార్డు స్థాయిలో 8వ టైటిల్‌ను గెలుచుకుని తొలి కిరీటాన్ని కైవసం చేసుకుంది. చికాగోలో జరిగిన స్క్వాష్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఈజిప్షియన్లు మహిళల విభాగంలో ఛాంపియన్‌గా నూర్ ఎల్ షెర్బిని, పురుషుల విభాగంలో మోస్తఫా అసల్ ఛాంపియన్‌లుగా నిలిచారు. ఈ ఈవెంట్‌లో వరుసగా 10వ ఫైనల్ ఆడుతున్న 29 ఏళ్ల ఎల్ షెర్బిని, స్వదేశీయురాలు మరియు ప్రపంచ నంబర్ త్రి హనియా ఎల్ హమ్మామిని 3-1 (11-5, 11-9, 4-11, 11-7) తేడాతో ఓడించి తన ఎనిమిదో టైటిల్‌ను గెలుచుకుంది. ప్రపంచ నంబర్ టు షెర్బిని ఎనిమిది ప్రపంచ ఛాంపియన్‌షిప్ కిరీటాల నికోల్ డేవిడ్ యొక్క ఆల్‌టైమ్ రికార్డును సమం చేసింది. కాగా పురుషుల ఫైనల్లో, ప్రపంచ నంబర్ వన్ అసల్ ప్రపంచ నంబర్ టు మరియు స్వదేశీయుడు అలీ ఫరాగ్‌ను 3-0 (11-7, 11-8, 11-3) తేడాతో ఓడించి తన తొలి టైటిల్‌ను గెలుచుకున్నాడు. 24 ఏళ్ల అసల్ ఇప్పుడు పిఎస్ఎ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు మరియు బ్రిటిష్ ఓపెన్ టైటిళ్లతో పాటు, ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కూడా కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీ ఫైనల్‌లో 33 ఏళ్ల ఫరాగ్ చేతిలో ఓడిపోయి ఉంటే అతను ఈ స్థానాన్ని కోల్పోయేవాడు. ఇక ఈ ఎడిషన్ ఈవెంట్‌లో భారత్‌లో ఐదుగురు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో వేలవన్ సెంథిల్‌కుమార్ ప్రారంభ రౌండ్‌లోనే ఓడిపోగా, అభయ్ సింగ్, భారత నంబర్ 1 రమిత్ టాండన్ మరియు అరంగేట్ర వీర్ చోత్రాని రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించారు. మహిళల డ్రాలో, 17 ఏళ్ల అరంగేట్ర ఆటగాడు అనాహత్ సింగ్ రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించాడు.




# టెస్ట్‌లలో డబుల్ హీరోస్

### సెంచరీల్లో టాప్ 5 భారత్ బ్యాటర్లు

### అద్భుతమైన విజయాలు అందించిన ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలగడంతో టీమ్ ఇండియా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జట్టులో ముఖ్యంగా బ్యాటింగ్‌లో అనుభవజ్ఞులైన బ్యాటర్లు లేరు. జట్టు పూర్తిగా యువ, కొత్త ఆటగాళ్లతో నిండిపోయింది. టెస్ట్ క్రికెట్ లో కేవలం సెంచరీలు మాత్రమే కాదు డబుల్ సెంచరీల మోత మోగించి భారత్‌కు అద్భుతమైన విజయాలు అందించిన ప్లేయర్లు చాలా మంది ఉన్నారు. టెస్ట్ క్రికెట్‌లో ఎన్నో మంది దిగ్గజ భారతీయ బ్యాటర్లు సెంచరీల మీద సెంచరీలు సాధించి చరిత్ర సృష్టించారు. విరాట్ కోహ్లి నుండి సునీల్ గవాస్కర్ వరకు చాలా మంది ప్లేయర్లు డబుల్ సెంచరీలతో భారత్ కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించారు. అటువంటి టాప్ 5 హీరోల్లో టెస్టు క్రికెట్ లో అత్యధిక డబుల్ సెంచరీలు సాధించిన భారత ప్లేయర్ల లిస్టులో మొదటి స్థానంలో కింగ్ కోహ్లి ఉన్నాడు. కోహ్లి 123 టెస్ట్‌లలో 46.85 సగటుతో 9230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. అలాగే, 7 డబుల్ సెంచరీలు కూడా బాదాడు. ఇక ఈ ప్లేయర్ల జాబితాలో టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ రెండో స్థానంలో ఉన్నాడు. 103 టెస్ట్‌లలో 49.43 సగటుతో 8503 పరుగులు కొట్టాడు. ఇందులో 23 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. సెహ్వాగ్ టెస్టు 6 డబుల్ సెంచరీలతో పాటు రెండు ట్రిపుల్ సెంచరీలు కూడా సాధించాడు. అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన భారత ప్లేయర్ల లిస్టులో మూడో స్థానంలో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. 200 టెస్ట్‌లలో 53.78 సగటుతో 15921 పరుగులు సాధించిన సచిన్ టెండూల్కర్ 51 సెంచరీలు, 68 అర్ధసెంచరీలు సాధించాడు. టెస్టు క్రికెట్ లో అత్యధిక సెంచరీలు బాదిన రికార్డు సచిన్ పేరిట ఉంది. టెండూల్కర్ టెస్టుల్లో 6 డబుల్ సెంచరీలు సాధించాడు. ప్రపంచ క్రికెట్ లెజెండరీలలో ఒకరైన రాహుల్ ద్రవిడ్ భారత జట్టు కోసం ఎన్నో మారపురాని ఇన్నింగ్స్ లను ఆడాడు. అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన భారత ప్లేయర్ల లిస్టులో రాహుల్ ద్రవిడ్ నాల్గవ స్థానంలో ఉన్నాడు. ద్రవిడ్ 163 టెస్ట్‌లలో 52.63 సగటుతో 13265 పరుగులు సాధించాడు. ఇందులో 36 సెంచరీలు, 63 అర్ధసెంచరీలు ఉన్నాయి. ద్రవిడ్ టెస్టు క్రికెట్ లో 5 డబుల్ సెంచరీలు చేశాడు. కాగా భారత్ తరపున టెస్టు క్రికెట్‌లో అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన ప్లేయర్ల లిస్టులో ఐదవ స్థానంలో సునీల్ గవాస్కర్ ఉన్నాడు. సన్నీ 125 టెస్ట్‌లలో 51.12 సగటుతో 10122 పరుగులు సాధించాడు. ఇందులో 34 సెంచరీలు, 45 అర్ధసెంచరీలు ఉన్నాయి. అలాగే, టెస్టుల్లో 4 డబుల్ సెంచరీలు సాధించాడు.



# పంజాబ్ కింగ్స్ హ్యాట్రిక్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025లో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ హ్యాట్రిక్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో 12 మ్యాచ్‌ల్లో 8 మ్యాచ్‌ల్లో విజయం అందుకున్న పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది. జైపూర్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. ఈ లక్ష్య ఛేదనలో రాజస్థాన్ 7 వికెట్లు నష్టానికి 209 పరుగులకే పరిమితమైంది. యశస్వి జైస్వాల్ 25 బంతుల్లో 50 పరుగులు, 9 ఫోర్లు, 1 సిక్స్‌తో చెలరేగిపోయాడు. అలాగే వైభవ్ సూర్యవంశీ 15 బంతుల్లో 40 పరుగులు, 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో మరోసారి మెరుపు ఆరంభం ఇచ్చినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. ఆ తర్వాత వచ్చిన సంజు శాంసన్ 16 బంతుల్లో 20 పరుగులు, 1ఫోరు, 1సిక్స్, రియాన్‌పరాగ్ 11బంతుల్లో 13పరుగులు, 1సిక్స్ కొట్టి దూకుడుగా ఆడలేకపోయారు. ధ్రువ్ జురెల్ 31 బంతుల్లో 53 పరుగులు, 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో అర్ధ సెంచరీ చేసి పోరాడినా మిగిలిన బ్యాటర్ల నుండి సరైన సహకారం అంద లేదు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పంజాబ్ స్పిన్నర్ హర్ ప్రీత్ బ్రార్ కీలక సమయంలో వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బతీశాడు. యున్సెన్, ఒమర్జాయ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. యశస్వి జైస్వాల్, సూర్యవంశీ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో జైస్వాల్ వరుసగా 4 పోర్లు, 1 సిక్స్ బాది 22 పరుగులు పిండుకున్నా ఫలితం లేకుండా పోయింది. అంతకు ముందు ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నపంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ చేసి భారీ స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా యువకెరటం నేహల్ వధేరా(70) అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(30)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో ఆఖర్లో శశాంక్ సింగ్(59 నాటౌట్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్(21 నాటౌట్) విధ్వంసంక బ్యాటింగ్‌తో అలరించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికారేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. అయితే ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(9)ను తక్కువ స్కోర్‌కే ఔట్ చేసిన తుషార్ దేశ్‌పాండే రాజస్థాన్‌కు రెండో ఓవర్లోనే బ్రేకిచ్చాడు. కాసేపటికే ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన మిచెల్ ఓవెన్(0)ను క్వెనా మఫాకాడకౌట్ చేశాడు. అయినాసరే ప్రభ్‌సిమ్రన్‌సింగ్(0) దూకుడుగాఆడాడు. శ్రేయాస్ అయ్యర్(30) జతగా పంజాబ్ స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే దేశ్‌పాండే మరోసారి షాకిస్తూ ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేశాడు. దాంతో, పవర్ ప్లే 3.1 ఓవర్‌కే పంజాబ్ కీలకమైన 3 వికెట్లు కోల్పోయింది. దేశ్‌పాండే విజృంభణతో34కే మూడు కీలక వికెట్లు పడిన పంజాబ్‌ను అయ్యర్, నేహల్ వధేరా(70)లు ఆదుకున్నారు. క్రీజులో కుదురుకున్నాక జోరు పెంచిన ఇద్దరూ బౌండరీలతో హడలెత్తించారు. దాంతో, 10 ఓవర్లకు పంజాబ్ స్కోర్ 97కు చేరింది. అయితే దంచికొడుతున్న అయ్యర్ రియాన్ పరాగ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వత గేర్ మార్చిన వధేరా ఆకాశ్ మధ్వాల్ బౌలింగ్‌లో రెండో ఫోర్లతో అర్ధ శతకం సాధించాడు.



## హాకీ టోర్నీలో 4 దేశాలతో భారత్ ఢీ

### 25న చిలీతో పోరు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది డిసెంబరులో జరిగే మహిళల జూనియర్ ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా భారత్ జట్టు ఈ నెలలో నాలుగు దేశాల టోర్నీలో పోటీపడనుంది. అర్జెంటీనాలోని రొసారియా నగరంలో ఈ నెల 25 నుండి జూన్ 2 వరకూ జరిగే ఈ టోర్నీలో భారత్ తో పాటు, అర్జెంటీనా, చిలీ, ఉరుగ్వే జట్టు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో ఆడనున్న భారత్ జట్టును హాకీ ఇండియా ప్రకటించింఇ. 24 మంది సభ్యులతో కూడిన భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టుకు గోల్‌కీపర్ నిధి నాయకత్వం వహిస్తుంది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో భారత్ జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఈ నెల 25న చిలీతో ఆడుతుంది. ఆ తర్వాత టీమిండియా వరుసగా ఈ నెల 26న ఉరుగ్వేతో, అర్జెంటీనాతో 28న, చిలీతో 30న, ఉరుగ్వేతో జూన్ 1న, అర్జెంటీనాతో 2న తలపడుతుంది. భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టులో నిధి (కెప్టెన్, గోల్‌కీపర్), ఏంజిల్ హర్షరాణి మింజ్ (గోల్‌కీపర్), మమితా ఓరమ్, లాల్‌తట్లుయాంగి, మనీషా, పూజా సాహూ, పార్వతి టొప్నో, నందిని, సాక్షి శుక్లా (డిఫెండర్లు), ప్రియాంక యాదవ్, అనీషా సాహూ, రజని కెర్కెట్టా, బినామా ధన్, ఖైడెమ్ షిలీమా చాను, సంజన హోరో, సుప్రియా కుజుర్, ప్రియాంక డోగ్రా (మిడ్ ఫీల్డర్లు), హీనా బానో, సోనమ్, సుఖ్‌వీర్ కౌర్, గీతా యాదవ్, లాల్‌రిన్‌పుయ్, కనిక సివాచ్, కర్మన్‌ప్రీత్ కౌర్ (ఫార్వర్డ్లు), స్టాండ్‌బై విద్యశ్రీ, హుదా ఖాన్, మనీమని దాస్, సెలెస్టినా హోరో ఉన్నారు.

# లాంచ్ కాబోయే 'ఇవి' కార్లు ఇవే!

**ముంబై, మే 18:** ఎలక్ట్రిక్ వాహనాల విభాగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. అగ్రశ్రేణి కార్ల తయారీ సంస్థలన్నీ ఐసీఈ నుంచి నుండి 'ఇవి' వాహనాలవైపు వేగంగా మారుతున్నారు. కియా, మహీంద్రా, మారుతి సుజుకి, టాటా ఎంజీ వంటి కంపెనీలు కొత్త కార్లను లాంచ్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రిలీజవ్వబోయే 'ఇవి' కార్ల గురించి తెలుసుకుందాం. కియా క్లావిస్ 'ఇవి' కియా క్లావిస్ 'ఇవి' త్వరలో లాంచ్ కానుంది. కియా కంపెనీ ఇప్పటికే ఈ మోడల్ ఇంధన వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. ఈ మోడల్‌లో భవిష్యత్‌లో ఈవీ వెర్షన్ లాంచ్ కానుందని నిపుణులు చెబుతన్నారు. ఈ మోడల్ హాట్ సెల్లింగ్ ఉత్పత్తిగా ఉంది. క్రెటా ఎలక్ట్రిక్ నుండి చాలా కీలకమైన హార్డ్‌వేర్‌ను తీసుకుంటుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి మోడల్ రెండు బ్యాటరీ కాన్ఫిగరేషన్‌లలో అందించే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. ఎంజీ ఎం9 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ ఎం9ని భారత మార్కెట్‌కు త్వరలో తీసుకురానుంది. ఎంజీ ప్రీమియం శ్రేణిలో ఉన్న ఈ కారు 90 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే ఈ కారును ఓ సారి ఛార్జ్ చేస్తే దాదాపు 430 కి.మీ. మైలేజ్ అందిస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ మహీంద్రా కంపెనీ ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌ఓ కారును ఈవీ వెర్షన్‌లో త్వరలో లాంచ్ చేయనుంది. ఈ కారు 2025 చివర్లో మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ లాంచ్ గురించి కంపెనీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అధికారికంగా లాంచ్ అయిన తర్వాత, ఈ మోడల్ టాటా పంచ్ 'ఇవి'కు నేరుగా పోటీగా ఉంటుందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. టాటా హారియర్ 'ఇవి' 2025 బీఎంజీఈ సమయంలో టాటా కంపెనీ హారియర్ 'ఇవి'ను ప్రదర్శించింది. టాటా కంపెనీ ఈ కారుకు సంబంధించిన అన్ని పరీక్షలను దాదాపు పూర్తి చేసిందని, త్వరలోనే హారియర్ 'ఇవి'మార్కెట్‌ను పలుకరించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2025 ముగిసేలోపు ఈ కారు మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది.




## కార్ల కోసం వేసవి చిట్కాలు

**ముంబై, మే 18:** దేశంలోనిదాదాపు అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి సమయంలో కార్లను కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎండలో డ్రైవింగ్ చేయడం వల్ల మీకు అసౌకర్యం కలగడంతో పాటు కారుకూ నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా విండ్ షీల్డ్ పగుళ్లు తీస్తుంది. పెయింట్ వాడిపోయే ప్రమాదం ఉంది. అధిక వేడి కారణంగా టైర్లు హీటెక్కిపోతాయి. ఇలాంటి సమయంలో ఈ కింద తెలిసిన విధంగా కార్లను సంరక్షించుకోవాలి. ఎండా కాలంలో కారును వాడకుండా ఇంటిలోనే ఉంచడం కుదరదు. మన అవసరాలకు అనుగుణంగా దాన్ని ఉపయోగించుకోవాలి. కాబట్టి సాధ్యమైనంత వరకూ కారును నీడ కింద పార్కు చేయాలి. ఎందుకంటే సుమారు 30 నిమిషాల పాటు కారు ఎండలో ఉంటే లోపలి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయి. ప్రయాణం సమయంలో ఒక అరగంట పాటు చెట్ల కింద ఆపడంవల్ల మీతోపాటు కారుకు మంచి జరుగుతుంది. క్యాబిన్ చల్లబడడమే కాకుండాపెయింట్, డాష్ బోర్డులో పగుళ్ల రాకుండా ఉంటాయి. పార్కింగ్ చేసే ప్రదేశాల్లో నీడ లేనప్పుడు సన్ షేడ్‌లు, విండో నైజర్లను ఉపయోగించుకోవాలి. ఇవి సూర్యరశ్మిని నిరోధించి, కారు లోపలి భాగాన్ని చల్లగా ఉంచుతాయి. ముందు వెనుక ఉన్న కిటికీలపై వీటిని ఉంచడంమంచిది. అదే సమయంలో స్టీరింగ్ వీల్, సీట్లపై తువాళ్లు కప్పడం మర్చిపోవద్దు. తువాళ్లపై నీటిని చల్లడం వల్ల మరింత చల్లదనం అందుతుంది. ఈ పద్ధతులు కారు లోపల భాగం వేడెక్కకుండా చూడటానికి ఎంతో సహాయపడతాయి. బయట గాలి కారు లోపలకు వెళ్లడానికి వీలుగా, లోపలి భాగం వేడెక్కకుండా ఉండేందుకు కొద్దిగా కిటికీల తెరవడం చాలా మంచిది. దీనివల్ల లోపలి గాలిబయటకు, బయట గాలి లోపలకు వెళ్లి ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఇటీవల సౌరశక్తితో పనిచేసే ఫ్యాన్లు ఎక్కువగా తయారవుతున్నాయి. వాటిని కారు లో ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. ఇంజిన్ ఆఫ్‌లో ఉన్నప్పుడు క్యాబిన్ ఉష్ణో గ్రతను సరిచేస్తాయి. ఎండలో పార్కు చేసిన సమయంలోనూ ఉపయోగపడతాయి.



## ఈ వారం కొత్త ఐపిఓలు ఇవే..

**న్యూఢిల్లీ, మే 18:** ఆటో విడిభాగాల కంపెనీ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 21న ప్రారంభం కానుంది. 23న ముగియనున్న ఇష్యూకి రూ.85-90 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ.2,150 కోట్లుగా నమోదైంది. కంపెనీ ప్రధానంగా ఆటోరంగంలోని సేఫ్టీ క్రిటికల్ సిస్టమ్స్‌ను రూపొందించడంతో పాటు, ఇతర ఇంజినీరింగ్ సొల్యూషన్స్ అందిస్తోంది. టెక్స్‌టైల్ తయారీ కంపెనీ బొరానా వీవ్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభం కానుంది. 22న ముగియనున్న ఇష్యూకి రూ.205-216 ధరల శ్రేని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా 67.08 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ.145 కోట్లు సమీకరించే యోచరలొఓ ఉంది. 19న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 69 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇష్యూ నిధులను కొత్త తయారీ యూనిట్ ఫైనాన్స్ వ్యయాలతో పాటు, వర్కింగ్ కేపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. గుజరాత్‌లోని సూరత్ వద్ద ఏర్పాటు చేస్తున్న యూనిట్ ద్వారా గ్రే ఫ్యాబ్రిక్‌ను ఉత్పత్తి చేయనుంది.




## సాలరీ అకౌంట్‌తో ప్రయోజనాలెక్కువే..

**ముంబై, మే 18:** చాలా మందికి బ్యాంకు అకౌంట్లు ఉంటాయి. అయితే కొన్ని ఖాతాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. కానీ చాలా మందికి తెలియవు. బ్యాంకు అందించే వివిధ రకాల ఖాతాలు ఉన్నాయి. వీటిలో కరెంట్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా, సేవింగ్స్ ఖాతా మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా చాలా మందికి పొందుపు ఖాతాల ఉంటాయి. మీరు ఆ అకౌంట్‌ను సాలరీ అకౌంట్‌గా మార్చుకోవచ్చు. ఇదిలా ఉండగా, సాలరీ అకౌంట్‌తో చాలా ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ఆ ప్రయోజనాలు చాలా మందికి తెలియవు. దీనివల్ల ప్రజలు సాలరీ అకౌంట్‌ను నిర్వహించడానికి భయపడుతుంటారు. సాలరీ అకౌంట్ కింద ఓవర్‌డ్రాఫ్ట్ ప్రయోజనం ప్రజలకు లభిస్తుంది. ఓవర్‌డ్రాఫ్ట్ అంటే అత్యవసర పరిస్థితుల్లో మీరు ఖాతా నుండి డబ్బును ఉపసంహరించుకోవచ్చు. అంటే మీ అకౌంట్‌లో డబ్బులు లేకున్నా ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా కొంత అమోంట్‌ను పొందవచ్చు. ఓవర్‌డ్రాఫ్ట్ సద్వినియోగం చేసుకున్న తర్వాత అత్యవసర పరిస్థితుల్లో మీరు డబ్బు అప్పుగా తీసుకోవాల్సిన అవసరం ఉండదు లేదా క్రెడిట్ కార్డును ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. చాలా బ్యాంకులు సాలరీ అకౌంట్‌లకు బీమా కవరేజీని కూడా అందిస్తున్నాయి. మీరు దీని కింద ఆరోగ్య బీమా తీసుకుంటే ఆకస్మిక వైద్య ఖర్చుల గురించి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరోగ్య బీమా వల్ల కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. నేటి కాలంలో వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. ఈలోగా బీమా మాత్రమే ఉపయోగపడుతుంది. అయితే, దీని కోసం మీరు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మీ వేతనం అంత కాకపోతే ప్రభుత్వం రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను కూడా అందిస్తుంది. ఇది ఆయుష్మాన్ యోజన ద్వారా లభిస్తుంది. అయితే, ఈపథకం ప్రయోజనాలను పొందడానికి ఒక జీతం నిర్ణయించింది.




# వాణిజ్యం

## ఆన్‌లైన్ మోసాలకు ఎయిర్‌టెల్ చెక్

**ముంబై, మే 18:** భారతదేశంలో ప్రముఖ టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ అన్ని కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్స్‌లో హానికరమైన వెబ్‌సైట్లను రియల్ టైమ్‌లో గుర్తించి బ్లాక్ చేసేలా కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏఐ ఆధారంగా తీసుకున్న ఈ పరిష్కార చర్యలు ఎస్ఎంఎస్, ఈమెయిల్, ఓటీటీ మెసేజింగ్ యాప్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ ద్వారా యాక్సెస్ చేసే ప్రమాదకరమైన లింక్లను గుర్తించి బ్లాక్ చేస్తుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాల నుంచి వినియోగదారులను రక్షించడం లక్ష్యంగా ఈ కీలకచర్యలు తీసుకున్నారు. ఎయిర్టెల్‌మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ నెట్వర్క్స్‌లో ఇంటిగ్రేట్ చేసిన ఈ సేవ అదనపు ఖర్చు లేకుండా అందరు వినియోగదారు లకు ఆటోమెటిక్‌గా అందుబాటులో ఉంటుంది. హానికరమైన వెబ్ సైట్ గుర్తించినప్పుడు వినియోగ దారులు బ్లాక్‌ను వివరించే నోటిఫికేషన్ పేజీకి మళ్లించి ఆ పేజీ క్లోజ్ అవుతుంది. భారతదేశం అంతటా సైబర్ మోసం బాగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నామని ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను ఉపయోగించి స్కామర్లు ఎక్కువగా దోపిడీ చేస్తున్నారు. సాంప్రదాయ ఓటీపీ దొంగతనం, స్పామ్ కాల్స్‌కు అతీతంగా హానికరమైన లింక్లను ఉపయోగించే అధునాతన పథకాలు ఇప్పుడు మిలియన్ల మంది వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ మోసాలను అరికట్టేందుకు ఎయిర్టెల్ ఇంజనీర్లు ఏఐను ఉపయోగించి రియల్‌టైమ్ డొమైన్ ఫిల్టరింగ్‌ను నిర్వహించే మల్టీలెవల్ నిఘా వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇది వెబ్ ట్రాఫిక్‌ను గ్లోబల్ రిపోజిటరీలతో ఎయిర్టెల్ అంతర్గత డేటాబేస్లో క్రాస్‌రిఫరెన్స్ చేస్తుంది. ఇలాంటి చర్యలతో వినియోగదారులు మోసపోతామనే ఆందోళన లేకుండా ఇంటర్నెట్ బ్రౌజ్ చేయడమే తమ లక్ష్యమని ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెబుతున్నారు. ఆరు నెలల ట్రయల్స్ తర్వాత కచ్చితత్వంతో కూడిన బ్లాకింగ్ సిస్టమ్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సేవ ప్రస్తుతం హర్యానా సర్కిల్లో అందుబాటులో ఉంది. త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps